# జనబలం

ప్రజలే ప్రభువులు

నవంబర్ 2022 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-





## టీఆర్ఎస్: ప్రత్యామ్నాయ రాజకీయ ఎజెండా ఉంటేనే ప్రయోజనం




## పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం తప్పని సరి చేయాలి



## గాంధీ విగ్రహాలకు, అంబేద్కర్ రిజర్వేషన్లకు ఎందుకు పరిమితమైపోయారో ఆలోచించండి




## భాషపై లేని సమస్యను సృష్టించొద్దు




## అమరావతిపై హైకోర్టు తీర్పును అమలు చేయాలి.. అధికారాన్ని జిల్లాలు, స్థానిక ప్రభుత్వాలకు వికేంద్రీకరించాలి



# రాజధాని - అమరావతి భూసమీకరణ - వికేంద్రీకరణ - గ్రీన్ ఫీల్డ్ సిటీ
## JP మాటమార్చిందెక్కడ?

లోక్ సత్తా పార్టీ వార్షికోత్సవం సందర్భంగా పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగం అక్టోబర్ 16, 2022 న విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ మీడియాతో మాట్లాడుతూ అమరావతిపై చేసిన వ్యాఖ్యలపై కొందరు నిజాయితీగా సందేహాలు వ్యక్తం చేశారు. రాజధానిపై, అమరావతిపై గత వైఖరికి భిన్నంగా JP మాట్లాడారన్న భావాన్ని వ్యక్తం చేశారు. JP, లోక్ సత్తా వైఖరిలో ఎటువంటి మార్పూ లేదని వారికి స్పష్టతనివ్వటం బాధ్యతగా భావించి లోక్ సత్తా ఈ వివరాల్ని విడుదల చేస్తోంది..

### ఆంధ్రప్రదేశ్ రాజధాని, అమరావతిపై JP గతంలో చెప్పింది:

+ అన్నీ రాజధానిలోనే కేంద్రీకరించి హైదరాబాద్ లో చేసిన తప్పు చేయవద్దు
+ రాజధానిపై నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే
+ ప్రభుత్వ కార్యాలయాల్ని, హైకోర్టును, పరిశ్రమల్ని, వీలుంటే వేసవి రాజధానిని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో పెట్టండి
+ వీటన్నిటినీ మించి నిజమైన అధికార వికేంద్రీకరణ కోసం అధికారాన్ని జిల్లాలు, నగరాలూ, ఇతర స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయండి
+ రైతులకు వాటాతో, వారి సమ్మతితో అమరావతిలో జరిగిన భూసమీకరణ సమర్థనీయం
+ మహానగరాలు అభివృద్ధి కేంద్రాలు కాబట్టి ఏపీకి అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేయండి

### అక్టోబర్ 16 న JP చెప్పింది:

+ రాజధానిగా అమరావతిని ఏపీ అసెంబ్లీలో ఏకగ్రీవంగా నిర్ణయించినందున, అమరావతి రైతులతో ప్రభుత్వం ఒప్పందం కూడా కుదుర్చుకున్నందున, హైకోర్టు కూడా ఈ అంశాల్ని సమర్థిస్తూ సబబైన తీర్పు ఇచ్చినందున.. అమరావతిని రాజధానిగా కొనసాగించాలి, తుగ్లక్ తరహాలో మార్చొద్దు
+ అన్నీరాజధానిలోనే కేంద్రీకరించకుండా రాయలసీమ, ఉత్తరాంధ్రలలో కూడా ఏర్పాటు చేయండి
+ అధికారాన్ని రాజధానిలోనే కేంద్రీకరించకుండా అసలైన వికేంద్రీకరణకు జిల్లా, స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనివ్వండి
+ ఇప్పటికే రాష్ట్రం నడిబొడ్డులో భూసేకరణ జరిగింది కాబట్టి, పెట్టుబడి రిస్క్ తీసుకునేవారు కూడా ఉన్నారు కాబట్టి.. ఎలాగైతే హైదరాబాద్ అండ వల్ల తెలంగాణకు మిగులు ఆదాయం లభిస్తోందో, అలా ఏపీ ఆర్థిక భరోసాకు అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేయండి
+ రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇంకా రాజధాని, మహానగరంపై రాజకీయ వివాదం తగదు

## ఇందులో JP మాటమార్చింది ఎక్కడ?

నోట్: రాష్ట్ర విభజన అనివార్యమైనా అన్ని పార్టీలూ ఓట్ల రాజకీయంలో మునిగితేలుతుంటే, ఏపీ ఆర్థిక పరిరక్షణకు ప్రత్యేక హోదా సహా పలు అంశాల్ని చట్టంలో చేర్చేలా చేసింది JP. ఒకవేళ ఎప్పుడైనా వైఖరి మార్చుకుంటే, అందుకు హేతుబద్ధ కారణాల్ని వివరించగల సత్తా JP కి, లోక్ సత్తాకు ఉన్నాయి.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


| సంపుటి 25 | సంచిక 11 | సంపాదకవర్గం | వర్కింగ్ ఎడిటర్ |
|---|---|---|---|
| నవంబర్ 2022 | | బండారు రామ్మోహనరావు<br>శిరమణి నరేష్ | దూసనపూడి సోమసుందర్ |


### జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

### కార్టూన్ కార్నర్




గత ప్రభుత్వ తప్పిదాల వల్లే ఆర్థిక సంక్షోభం అని తిప్పికొట్టాలి కాని ఇలా రాజీనామా చేస్తే ఎలా?


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ఆందోళన కల్గిస్తున్న ఆర్థికరంగం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆర్థికరంగంపై అరుదుగా మాత్రమే మాట్లాడుతుంటారు. నవంబరు 2న బెంగళూరులో జరిగిన కర్ణాటక ప్రపంచ పెట్టుబడుల సదస్సును ఉద్దేశించి మోదీ వర్చువల్‌గా మాట్లాడారు. భారతీయ ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉన్నాయని మోదీ చెప్పారు. భారత్ పెట్టుబడులకు సురక్షిత స్థావరం అన్నారు. దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆరున్నర లక్షల కోట్లకు చేరాయని వెల్లడించారు. భారత్‌లో పెట్టుబడి పెట్టడమంటే ప్రజాస్వామ్యంలో పెట్టుబడి పెట్టడమేనన్నారు. తమది సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ అనీ, అందులో అన్ని వర్గాలకీ భాగం ఉందని, దేశంలో సహకార సమాఖ్య ఉండటంతో దేశమంతటా సమానాభివృద్ధి ఉందని మోదీ నొక్కి చెప్పారు. పెట్టుబడుల సదస్సులో సహజంగా వినిపించే సంప్రదాయక ప్రసంగాలు అచ్చంగా ఇలాగే ఉంటాయి. అయితే ఉత్సవాల్లో చేసే ఉత్సాహపూరిత ప్రసంగాలకు ఉత్సాహపడే పెట్టుబడిదారులెవరూ ఉండరు.

ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారత్ ఒక ప్రకాశవంతమైన ప్రదేశంగా ఉందని ఇటీవల అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ కూడా ప్రశంసించిన మాట నిజమే. కోవిడ్ సంక్షోభం, ఆర్థిక మాంద్యం, రష్యా-ఉక్రేయిన్ యుద్ధం తెచ్చిపెట్టిన సమస్యలతో ప్రపంచం ఉక్కిరిబిక్కిరి అవుతున్న సంగతి తెలిసినదే. వస్తూత్పత్తి రంగంలో ఒక త్రైమాసిక గణాంకాన్ని ఉదహరించి భారత్ వెలిగిపోతోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ చేసిన ప్రశంస భుజకీర్తి కాజాలదు.

కరోనా కాలంలో మైనస్ వృద్ధిరేటుకు చేరుకున్న భారత్ ఆశించిన స్థాయిలో కోలుకోవడం లేదు. ప్రజల కొనుగోలు శక్తి వేగంగా క్షీణిస్తోంది. నిరుద్యోగం మున్నెన్నడూ లేని స్థాయికి పెరిగిపోయింది. ద్రవ్యోల్బణం, అధిక ధరలు సరేసరి. రూపాయి విలువ క్షీణించడంతో పాటు విదేశీ మారక ద్రవ్యం నిల్వలు తరగడం కనిపిస్తోంది. ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. ద్రవ్యలోటు, కరెంటు ఖాతాలో లోటు పెరుగుతున్నాయి. గత మూడు నెలల్లో వృద్ధి రేటు క్షీణించడం కూడా ఆందోళన కల్గిస్తోంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి సంఖ్య ఇటీవల బాగా పెరిగిపోవడంతో అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాల్సిన భారత్ స్థాయి వెనుకచూపులు చూస్తోంది. బ్యాంకింగ్ రంగం కుప్పకూలేస్థితికి చేరుకున్నది.

ప్రపంచ బిలియనీర్ల జాబితాలో భారతీయుల సంఖ్య, స్థాయి పెరిగిన మాట వాస్తవమే. జీఎస్టీ పన్నుల ఆదాయం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న సంగతి కూడా వాస్తవమే. కానీ ధనికుల-పేదల మధ్య పెరుగుతున్న అంతరాలు ప్రమాదకరస్థాయికి చేరుకుంటున్నాయి. స్వేచ్ఛావాణిజ్య విధానాలు పాలక పెద్దల సన్నిహితులకు మాత్రమే మేలు చేస్తున్నాయని, విశాల ప్రజానీకం బీదరికంలోకి దిగజారిపోతుంటే, కొద్దిమంది పెద్దలు అత్యంత సంపన్నులుగా ఎదిగిపోవడంపై చర్చ చెలరేగుతోంది. ప్రభుత్వ విధానాలు దూరదృష్టితో కాకుండా అస్తవ్యవస్థంగానూ, అరకొరగానూ ఉంటున్నాయని, కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసమే పాలక పెద్దలు పనిచేస్తున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.

పాలకపక్షంపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడమనేది సహజమే. కానీ ప్రపంచస్థాయి సూచికలు గానీ, అంతర్జాతీయ ప్రమాణాలకు సంబంధించిన నివేదికలు గానీ భారత్ దిగజారిపోతున్నదని హెచ్చరిస్తున్నాయి. భారత్‌లో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు, ప్రజాస్వామ్య, మానవ హక్కులు, బీదరికం, ఆర్థిక అంతరాలు, పత్రికాస్వేచ్ఛ, ఆకలి, పోషకాహార లేమి, రక్తహీనత వంటి అంశాలలో గతస్థాయిల నుండి పతనమైనట్టు అంతర్జాతీయ సమాజం ఎత్తిచూపిస్తోంది. పైగా పనిగట్టుకుని విద్వేష భావజాలాన్ని, సమాజంలో వైమనస్యాన్ని పెంపొందించడం విషయంలో భారత్ ముందంజవేస్తున్నట్టు కూడా పలు నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ప్రతిపక్షాలు, వామపక్షాలు చేస్తున్న హెచ్చరికలను ప్రస్తుత పాలకపక్షం పట్టించుకోదనే సంగతి తెలిసినదే. కానీ స్వపక్షం నుండి వస్తున్న విమర్శలను సైతం పాలకపక్షం తోసి పుచ్చుతున్నది. ప్రధానమంత్రి ఆర్థిక సలహాదారులుగా, రిజర్వు బ్యాంకు గవర్నర్లుగా, ఆర్థికశాఖలో కీలక బాధ్యతలు నెరవేర్చిన మేధావుల సలహాలను ప్రభుత్వం పెడచెవిన పెట్టడం ఆందోళనకరమే. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ విద్యావంతులను ఈసడించే ధోరణిని పాలక పెద్దలు విడనాడటం లేదు. పది కేంద్ర కార్మిక సంఘాల విస్తృత ఐక్యవేదికకు దూరంగా ఉంటున్న పాలకపక్ష అనుకూల కార్మిక సంఘం ప్రభుత్వ ఆర్థిక విధానాలకు నిరసనగా ఆందోళనామార్గం చేపట్టింది. పాలకపక్ష సైద్ధాంతిక గురుపీఠంలోని పీఠాధిపతులు సైతం ప్రభుత్వ ఆర్థిక విధానాలను కఠినంగా విమర్శించడం తాజా పరిణామం. ఇప్పటికైనా స్వసంకీర్తనలను మాని ఆర్థికరంగంపై ఒక అర్థవంతమైన ప్రణాళికతో పాలకులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

డి. సోమసుందర్

# భాషపై లేని సమస్యను సృష్టించొద్దు






స్వతంత్ర భారతదేశం అనేక రంగాల్లో విఫలమైనా దేశంలోని అనేక భాషల మధ్య సమన్వయం సాధించటంలో మాత్రం ప్రపంచంలోనే గొప్ప విజయాన్ని సాధించింది. ఇండియాలో అధికారికంగానే 22 భాషలున్నాయి. అయినా ఏ రోజూ భాషల పేరుతో భయంకర సమస్య లేదు. అదే పొరుగున ఉన్న పాకిస్తాన్, శ్రీలంకల్ని చూడండి. ఒకే మతం పేరుతో ఏర్పడిన పాకిస్తాన్.. రెండు భాషల కారణంగా రెండు దేశాలుగా విడిపోయింది. బంగ్లాదేశ్ కొత్త దేశంగా అవతరించింది. శ్రీలంకలో రెండు భాషల కారణంగా సింహళీయులు, తమిళుల మధ్య దశాబ్దాల తరబడి అంతర్యుద్ధం చెలరేగి నరమేధం జరిగింది. అనేక అంతర్జాతీయ సంస్థల కేంద్రాలున్న బెల్జియంలో ఫ్రెంచ్, ఫ్లెమిష్/డచ్ భాషలు మాట్లాడేవారి మధ్య నిరంతరం ఘర్షణలు జరుగుతుంటాయి. దీనివల్ల ఎన్నికలయ్యాక ప్రభుత్వాలు ఏర్పాటు చేయటానికి కూడా ఏళ్ల తరబడి ప్రతిష్టంభనలు కొనసాగుతుంటాయి. అలాగే కెనడాలో. మన దేశంలో ఈ సమస్య లేకుండా తొలి నుంచీ సర్దుకుపోయాం, మన రాజకీయం కూడా ప్రోత్సహించింది. మనలో అనేకమంది ఇతర రాష్ట్రాలకు వెళ్తే తెలిసిన భాషకు హిందీయో, ఇంగ్లీషో కలిపేసి పని సాధించుకుంటుంటారు, కలిసిమెలిసి బతుకుతుంటారు. తెలుగునాటయితే ఇతర రాష్ట్రాలవారికి మరింత సులభం. ఫైళ్లు, కార్యాలయాల బోర్డులు తెలుగులో లేకున్నా ఇక్కడ పట్టింపు ఉండదు. ఈ పరిస్థితుల్లో పార్లమెంటు అధికార భాషా సంఘానికి చైర్‌పర్సన్‌గా ఉన్న హోం మంత్రి అమిత్‌షా నేతృత్వంలోని కమిటీ ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి ఇటీవల సమర్పించిన నివేదిక చర్చనీయాంశమైంది. ఎంబీబీఎస్, ఐఐటీ స్థాయిల్లోనూ హిందీని తప్పనిసరి బోధనా మాధ్యమంగా చేయాలి, ప్రభుత్వ నియామక పరీక్షలు ఇంగ్లీషులో కాకుండా హిందీలో జరగాలి, ప్రభుత్వ కార్యకలాపాలలో హిందీ భాషను విస్తృతంగా వ్యాపింప చేయటమనేది రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక రాజ్యాంగ బాధ్యతగా నిర్దేశించాలి.. వంటి అంశాలు అందులో ఉన్నట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వానికి, సమాజానికి కూడా భాషా విధానపరంగా కొంత మౌలిక స్పష్టత అవసరం. భాష మనిషికి బొడ్డుతాడు లాంటిది. ఆషామాషీ కాదు. కులం, మతం, ప్రాంతం కంటే కూడా భాష పెద్దది. ఆచితూచి విజ్ఞతతో వ్యవహరించాలి. మన దేశంలో పాఠశాల స్థాయిలో బోధించే భాష ఏదైనా విద్య అధ్వాన్నంగా ఉందన్నది పచ్చి నిజం. ఈ దేశంలో నూటికి 80 మంది పిల్లలకు తరగతికి తగ్గ కనీస పరిజ్ఞానం లేదు. వారి జన్యు సంపద వృథా అయిపోతోంది. చాలాచోట్ల ఇంగ్లీషు మీడియం పేరుతో ఇంగ్లీషు తెలియని టీచర్లు ఇంగ్లీషు తెలియని పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. పిల్లలకు ప్రాథమిక స్థాయిలో వారికి తెలిసిన భాషలో పాఠాలు నేర్పించటం ముఖ్యమన్న ప్రాథమిక సూత్రాన్ని కూడా మనం గుర్తించటం లేదు. విద్యార్థులకు కాన్సెప్టులు పట్టుబడటం, సమాజంలో ఉపాధికి కావలసిన నైపుణ్యాలను సంతరించుకోవటం కీలకం. అది వదిలేసి ఎంబీబీఎస్, ఐఐటీల స్థాయిలోనూ పాఠ్యపుస్తకాలను హిందీలో, తెలుగులో ప్రవేశపెట్టటం వల్ల నష్టం తప్ప లాభం ఏమిటి? ఐఐటీలకు ఎంపికయ్యే పిల్లలకు ఇంగ్లీషులో పాఠాలను అర్థం చేసుకునే సామర్థ్యం ఎలాగూ ఉంటుంది. అదీగాక హిందీ, మన ప్రాంతీయ భాషల్లో కొత్త పదాల్ని సృష్టించే క్రమం కొరవడింది. మనం జ్ఞానాన్ని, సాంకేతికతను అంటరానివిగా చూసి మన భాషల్ని తీవ్రంగా నష్టపరిచాం. ఇంగ్లీషు అన్ని భాషల్లోని పదాల్నీ కలుపుకుంటూ వేగంగా విస్తరించింది. ముందు మన భాషల్ని ఆధునిక అవసరాలకనుగుణమైన పదుల వేల పదాలతో సుసంపన్నం చేసుకున్నాక అప్పుడు ఇంగ్లీషు స్థానంలో అన్ని స్థాయిలో ప్రవేశపెడదాం. ఇంగ్లీషేతర భాషల్లోనూ నేర్చుకునే ఐచ్ఛికం మంచిదే కానీ, ఉట్టికెగరలేనివాళ్లు పైకి ఏమి ఎగురుతారు? దేశంలో మౌలిక సమస్యలన్నీ పరిష్కారమైనట్లు భాషపై చర్యలు ప్రారంభించటం ప్రభుత్వానికి ఇప్పుడు అవసరమా? దయచేసి లేని సమస్యను సృష్టించొద్దు. నిజంగా దేశాన్ని ప్రేమిస్తే, నిజంగా దేశ ఐక్యతే మీ లక్ష్యమైతే భాష పేరుతో అనైక్యతను పెంచే పనులు చేయవద్దు, దేశంలో విద్య అధ్వాన్నంగా ఉంది, ఆరోగ్యం అందక ఏటా 5.5 కోట్ల మంది పేదరికంలోకి జారిపోతున్నారు, చట్టబద్ధపాలన లేక కోట్ల మంది కన్నీరు కారుస్తున్నారు, ఉపాధి అవకాశాలు లేక యువత నలిగిపోతున్నారు, వ్యవసాయంలో ఆదాయం లేక రైతులు కుంగిపోతున్నారు.. ముందు వాటి మీద దృష్టి పెట్టండి.

**– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

# పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం తప్పనిసరి చేసే చట్టం తేవాలి






రహస్య బ్యాలెట్ ద్వారా అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక జరగటం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇందులో అంతా సవ్యం కాదు. కానీ జాతీయ, ప్రాంతీయ, పెద్ద, చిన్న తేడా లేకుండా అన్ని పార్టీల మీదా అంతర్గత ప్రజాస్వామ్యం దిశగా ఈ పరిణామం ఒత్తిడి తెస్తుంది. అన్ని పార్టీల్లో అన్ని స్థాయిల్లో నిజమైన ఎన్నికలు జరగాలి. అప్పుడే రాజకీయ పార్టీలు అత్యుత్తమ సామర్థ్యం గలవారిని ఆకర్షించగలుగుతాయి, హేతుబద్ధ, నైతిక పద్ధతుల ద్వారా వాళ్లు ఎదిగే అవకాశాలకు వేదికలు కాగలుగుతాయి. అలాగే ఎమ్మెల్యే, ఎంపీ లేదా స్థానిక ప్రభుత్వ నేత ఇలా ప్రజాప్రతినిధి స్థానాలకు తమ పార్టీ తరపున పోటీ పడే అభ్యర్థుల మధ్య కూడా పార్టీలు ప్రైమరీ ఎన్నికలు నిర్వహించాలి. ప్రైమరీ ఎన్నికలో ఎవరు నెగ్గితే వారికే పార్టీలు టికెట్ ఇవ్వాలి. పార్టీ పదవులకే కాకుండా, ఇలా ప్రజాప్రతినిధుల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో కూడా ఓటింగ్ ఉండటం వల్ల పార్టీలు మరింత ఆరోగ్యకరంగా, ప్రజాస్వామ్యయుతంగా రూపొందుతాయి. నేను 2002, డిసెంబర్‌లో కామన్వెల్త్ పరిశీలకుల బృందంలో భాగంగా కెన్యాలో అధ్యక్ష, పార్లమెంటు ఎన్నికలను పర్యవేక్షించాను. అక్కడి పార్టీల్లోని నిజమైన అంతర్గత ప్రజాస్వామ్యం నన్ను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. డానియల్ అరాప్ మోయి నియంతృత్వ పాలన సాగిస్తూ 27 ఏళ్లుగా కెన్యా అధ్యక్షుడిగా ఉన్నాడు. అయితే ఆ నియంత అధ్యక్షుడి కుమారుడు పార్టీ ప్రాథమిక ఎన్నికలో ఓటమి పాలయ్యాడు. దీంతో పార్లమెంటుకి పార్టీ అభ్యర్థి కాలేకపోయాడు. మన దేశం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కొన్ని గణనీయ విజయాల్ని సాధించినా, ఎంతో కీలకమైన పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యం విషయంలో అధ్వాన్నంగా ఉన్నాం. మన పార్టీలు చాలామేర కొన్ని కుటుంబాల ఆస్తులుగా, పెత్తందారుల మోచేతి సంస్థలుగా తయారయ్యాయి. ప్రజాస్వామ్యంలో పౌరులు చురుగ్గా రాజకీయ ప్రక్రియలో భాగస్వాములు కావాలంటే పార్టీలే అర్థవంతమైన వాహనాలు. అప్రజాస్వామిక పార్టీలు ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠంగా నడపలేవు. దీంతోపాటు మన నగరాలు, పట్టణాలను సమర్థవంతంగా నడిపించే పార్టీ నాయకత్వం తయారయ్యేందుకు స్థానిక ప్రభుత్వాలకు నిజమైన సాధికారతను ఇవ్వాలి. స్థానిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్యానికి పాఠశాలలు. మన పార్టీలు మొక్కుబడిగా కాకుండా, అన్ని స్థాయిల్లో నిజమైన అంతర్గత ఎన్నికలను నిర్వహిస్తాయని, ప్రభుత్వంలోకి ఎన్నికయ్యేందుకు పోటీ పడే అభ్యర్థుల ఎంపికకు కూడా ప్రైమరీ ఎన్నికలను నిర్వహిస్తాయని ఆశిద్దాం. జర్మనీలో ఉన్నట్టు అన్ని పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని తప్పనిసరి చేస్తూ ఒక జాతీయ చట్టాన్ని తీసుకురావటానికి కూడా మనం ఏకాభిప్రాయాన్ని నిర్మించాలి. రాజకీయ పార్టీలంటే కొన్ని కుటుంబాలు, కొందరు సంపన్నులకు వదిలేసే విషయాలు కావు, ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకపాత్ర పోషించేవి. ఒక్కసారి మనం పార్టీల్ని ప్రజాస్వామీకరిస్తే, మన ఎన్నికల ప్రక్రియలో చట్టవిరుద్ధ డబ్బు పాత్రని తొలగించేందుకు సంస్కరణలపై ఏకాభిప్రాయాన్ని తీసుకురాగలం. 19వ శతాబ్దపు రాజకీయం, 21వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థ కలిసి సాగలేవు.

– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

## దేశంలో, పార్టీల్లో నిజమైన ప్రజాస్వామ్యం ఉంటే యువత రిషీ సునాక్‌లా ఎదుగుతారు



భారతీయ మూలాలున్న రిషి సునాక్ బ్రిటన్ ప్రధానిగా ఎన్నికవటం గొప్ప విషయమని జేపీ అన్నారు. ఆయన విజయం భారతీయులందరికీ సంతోషకరమన్నారు. అంతకంటే ముఖ్యం, బ్రిటన్‌లాంటి దేశంలో తెల్లజాతీయుడుకాని ఒక యువ రాజకీయవేత్త తన ప్రతిభతో, పనితీరుతో అత్యున్నత స్థానానికి ఎదగటమన్నారు. ఆ దేశంలోని నిజమైన ప్రజాస్వామ్యం, పార్టీ అందుకు అవకాశం కల్పించాయన్నారు.

# ప్రజాస్వామ్య దేశంలో అప్రజాస్వామిక పార్టీలు

మన దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు వచ్చాయంటే డబ్బు ప్రవాహం, ఓట్ల కొనుగోలు బహిరంగ రహస్యాలు. ఓటుకు నోటు ఎందుకు ఇవ్వలేదు, తక్కువ ఎందుకు ఇస్తున్నారు అని కొన్నిచోట్ల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి అడుగుతున్నా, మీడియాలో సైతం ప్రముఖంగా రిపోర్టవుతున్నా కొన్ని రోజుల సంచనాలు కావటం తప్ప చివరికి జరుగుతున్నదేమీ లేదు. మరీ బాగుండదని ఎన్నికల సంఘం, పోలీసులు కాస్త హడావుడి చేస్తున్నారంతే. దీర్ఘకాలిక దృష్టి లేకుండా రోజువారీ పరిణామాల చుట్టూ తిరిగే ఆలోచనాపరుల హడావుడి కూడా.. 'ఎన్ని లక్షల మందిని అరెస్టు చేస్తారు' అన్న ప్రశ్న లేవనెత్తగానే చల్లారిపోతోంది. ఈ నల్లడబ్బు ప్రవాహానికి తోడు ఉచితాల తాయిలాలు. ఇవీ చాలటం లేదు కాబట్టి, కులం, మతం వంటివి రెచ్చగొట్టటం.

ఈ మొత్తానికీ మూలం ప్రజలేనని నిందించటం తేలిక. ప్రజలు ఓటేస్తేనే గదా నాయకులు గెలుస్తున్నది, తుపాకి పెట్టి బలవంతంగా వాళ్లని ఎవరూ ఓట్లు వేయించటం లేదు గదా, వాళ్లు సరిగా ఓట్లు వేస్తే సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికవుతారు గదా అనొచ్చు. వాస్తవమే.. కానీ అధికారాన్ని ఎక్కడో కేంద్రీకరించి, నాణ్యమైన విద్య, ఆరోగ్యం లేకుండా పేదరికాన్ని నిరంతరం కొనసాగిస్తూ ప్రజలదే తప్పు అంటే ఎలా? ఓటుకు-తన జీవితానికి సంబంధం ఏమిటో అర్థం కానప్పుడు, ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా తమ జీవితాల్లో పెద్ద మార్పేమీ కనిపించనప్పుడు, పార్టీలు ఓటుకు నోట్లు, ఉచితాల పథకాలు ఇస్తుంటే తీసుకుంటే తప్పేంటి? ప్రజల్ని తప్పు పట్టటమంటే, అసలు మార్పు తేవాలన్న ఉద్దేశమే ప్రశ్నార్థకమవుతుంది. ప్రజలకు అర్థమయ్యే వ్యవస్థని నిర్మించి, తమ ఓటు వల్ల తమ జీవితాలు ఎలా మారతాయో తెలియచెప్పగలగటం మనం ముందు చేయాల్సిన పని.

రాజకీయ పార్టీలు ఈ విషవలయంలో కూరుకుపోయి ప్రవాహంలో కొట్టుకుపోతున్నప్పటికీ.. ఈ పరిస్థితి తలెత్తటానికి ఆయా పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం అంతరించిపోయిన పరిస్థితి కూడా కారణం. సమర్థులు, నిజాయతీపరులు, పరిపాలన అంటే తెలిసినవారు, దీర్ఘదృష్టి ఉన్నవారు రాజకీయాల్లోకి రావాలనుకుంటే వారు వేగంగా ఎదిగే అవకాశాలు లేకుండా పార్టీలు కొందరు వ్యక్తుల సొంత ఆస్తులుగా మారిపోయాయి. శ్రీలంక ఆర్థిక సంక్షోభానికి ఇతరత్రా కారణాలు ఉన్నప్పటికీ, సమర్థులు ఎదిగే అవకాశం లేకుండా ఒకే కుటుంబానికి చెందినవారు కీలక పదవుల్లో ఉండటం కూడా పరిష్కారానికి కావలసిన వినూత్న, సృజనాత్మక ఆలోచనలు రానీయకుండా నిరోధించింది. ఇదే తరహాలో పార్టీలు కొందరు వ్యక్తులు, కుటుంబాల చుట్టూ తిరుగుతూ కొత్త ఆలోచనలు లేకుండా చేయటం వల్ల కూడా మన దేశంలో సమస్యలు యథాతథంగా కొనసాగుతూ ప్రజాస్వామ్యాన్ని ఓటింగ్, షోటింగ్‌గా, ప్రచ్ఛన్న నిరంకుశత్వంగా మార్చేశాయి. ఈ నేపథ్యంలో మనం అధికార వికేంద్రీకరణ, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా పద్ధతి వంటి పాలనా, ఎన్నికల సంస్కరణలతోపాటు.. పార్టీల్ని ప్రజాస్వామీకరించే సంస్కరణల్ని కూడా తీసుకురావాలి.

**వైకాపా బరితెగింపు**



ఈ పని చేయకపోగా, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైకాపా)కి ఆ పార్టీ వ్యవస్థాపకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని శాశ్వత అధ్యక్షుడుగా ఎన్నుకుంటున్నట్లు జులై, 2022లో ప్రకటించారు. పార్టీల్ని ప్రైవేటు ఎస్టేట్‌లలా నిర్వహిస్తున్నవారు కూడా ముక్కున వేలేసుకునేలా జరిగిన ఈ పరిణామానికి ఇటీవల ఎన్నికల సంఘం అభ్యంతరం చెప్పటంతో ప్లేటు ఫిరాయించి, మీడియా తప్పుగా రిపోర్టు చేసిందని ఆ పార్టీ వర్గాలు బుకాయించాయి. శాశ్వత అధ్యక్షుడిగా ఉండాలన్న ప్రతిపాదనను వైఎస్ జగన్ తిరస్కరించారని బహిరంగ వివరణలో చెప్పుకొచ్చారు. సమాచార తప్పిదంపై అంతర్గత విచారణ జరుపుతామన్నారు.

**కాంగ్రెస్ ఎన్నికలు**




వైకాపాకు మాతృసంస్థగా చెప్పుకోదగిన, దేశానికి స్వతంత్రం వచ్చాక ఇతర పలు జాడ్యాలతోపాటు వంశపారంపర్య రాజకీయాలకు కూడా నాంది పలికిన కాంగ్రెస్ పార్టీలో జాతీయ అధ్యక్ష పదవికి దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఇటీవల పోటీ జరిగింది. కొంతయినా మార్పు కనిపిస్తుంది, ఎన్నికల్లో ఎన్ని ఓటములు ఎదురవుతున్నా ఇప్పటికీ ప్రధాన జాతీయ పార్టీగానే కాంగ్రెస్ ఉనికిలో ఉంది కాబట్టి.. కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఇతర పార్టీలకూ బుద్ధిగరుపుతుంది అని ప్రజాస్వామ్యవాదులు ఆశగా ఎదురుచూశారు. కానీ సీనియర్ నేత, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్‌ను అదుపు చేసేందుకు సోనియాగాంధీ, ఆమె

కుటుంబ సభ్యులు వ్యవహరించినతీరుతో కాంగ్రెస్‌లో అంతర్గత ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఎంతమేర ఉందో ఇట్టే అర్థమైంది. మరోవైపు, దిగువ స్థాయి నుంచి ఎన్నికలు లేకుండా వచ్చినవారితో కేవలం పైస్థాయిలో, పరిమితంగా అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కూడా ఎవరు పోటీలో ఉండాలో సోనియా అండ్ ఫ్యామిలీయే నిర్దేశించారన్నది బహిరంగ రహస్యం. అశోక్ గెహ్లాట్, దిగ్విజయ్ సింగ్‌ల తర్వాత నాటకీయంగా అధ్యక్ష బరిలోకి దిగిన మల్లిఖార్జున ఖర్గేకు కొందరు నేతలు బహిరంగంగా మద్దతు తెలుపుతున్నారని, ఇది సమానావకాశాలను దెబ్బతీస్తోందని పోటీ అభ్యర్థి శశిథరూర్ వాపోవాల్సి వచ్చింది. తాను కొన్ని రాష్ట్రాలకు వెళ్లినప్పుడు తనతో భేటీ అయ్యేందుకు పీసీసీ అధ్యక్షులు, సీనియర్ నేతలు కూడా అందుబాటులో లేరని, అదే ఖర్గే వెళ్లినప్పుడు మాత్రం వారంతా ఆత్మీయంగా వ్యవహరించారని తెలిపారు. సోనియా, ఆమె కుటుంబ సభ్యుల ఆశీస్సులు ఖర్గేకు ఉన్నాయని పార్టీ నేతలకు సంకేతాలు వెళ్లటమే ఇందుకు కారణం. ఫలితాలు కూడా ఆ రకంగానే వచ్చాయి, 84%పైగా ఓట్లతో ఖర్గే విజయం సాధించారు. గుడ్డిలో మెల్ల తరహాలో అంతర్గత ప్రజాస్వామ్యంపై ఒక సంకేతాన్ని మాత్రం కాంగ్రెస్ ఇతర పార్టీలకు ఇవ్వగలిగిందన్నదే ఈ మొత్తంలో చెప్పుకోదగిన సానుకూల ఫలితం.

**మహాత్మాగాంధీని ధిక్కరించినవారిని ఎన్నుకున్న పార్టీ**



జాతీయోద్యమ సమయంలో దేశం నలుమూలల్నుండీ అద్భుత సామర్థ్యమున్న నేతలు కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఎన్నికై సత్తా చాటారు. ముఖ్యంగా దక్షిణాఫ్రికా నుంచి గాంధీజీ వచ్చాక స్వతంత్ర పోరాటంలో కాంగ్రెస్ కీలకంగా మారింది. పార్టీ ఎన్నికల్లో మహాత్మాగాంధీ లాంటి వారు ఎవరి పేరైనా సూచిస్తే కాదనటం కష్టమే అయినా, అంతిమంగా ఎవరి మాటా శిలాశాసనం కాదని నాటి కాంగ్రెస్ ఎన్నికలు రుజువు చేశాయి. గాంధీని వ్యతిరేకిస్తూ సుభాష్‌చంద్రబోస్ హరిపూర్ కాంగ్రెస్ సభలో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే ప్రజాస్వామ్యానికి చిరునామాగా చెప్పుకునే అమెరికా సహా ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనిరీతిలో జాతీయోద్యమ సమయంలో అనేకమంది మహిళల్ని నేతలుగా తయారుచేయటంతోపాటు మహిళలకి పార్టీ అధ్యక్ష పదవిని ఇచ్చిన ఘనత కూడా కాంగ్రెస్‌కు దక్కుతుంది. అలాంటి కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యానంతరం అంతర్గత ప్రజాస్వామ్యంలో క్షీణిస్తూ, ఇందిరాగాంధీ హయాం నుండి మరింత దిగజారింది. ఇతర పార్టీలనూ ఆ రకంగా తయారుచేసింది.

**ఇందిర కాలం నాటి కాంగ్రెస్‌లా తయారైన బీజేపీ**

స్వతంత్రం వచ్చిన పలు దశాబ్దాల తర్వాత కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ జాతీయ పార్టీగా ఎదిగిన బీజేపీ వంశపారంపర్య రాజకీయానికి భిన్నమైన పోకడల్ని ప్రదర్శించినా, ఆ పార్టీలో ఇటీవలి పోకడలు జాతీయోద్యమ కాలం నాటి కాంగ్రెస్ తరహాలో కాకుండా ఇందిర కాలం నాటి కాంగ్రెస్ తరహాలో తయారయ్యాయి. పార్టీలో ప్రజాస్వామ్యం కొందరు వ్యక్తులస్వామ్యంగా తయారైంది. కేంద్రీకృత ధోరణులు పార్టీలో సభ్యుల గొంతు నొక్కేస్తున్నాయి. ఒక్క మహిళ కూడా ఇప్పటి వరకు బీజేపీ జాతీయ అధ్యక్షురాలు కాలేదు.

**మన ఎన్నికల వ్యవస్థ వల్ల జనాకర్షణ గల నేతలు, డబ్బు చుట్టూ తిరుగుతున్న పార్టీలు**

విపరీత అధికార కేంద్రీకరణ వల్ల ప్రజల ఆకాంక్షలకు తగిన ప్రాధాన్యత లభించకపోవటం వల్ల దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలు, వాటిల్లోనూ చీలిక పార్టీలు పెరిగాయి. జాతీయ పార్టీ కాంగ్రెస్ నమూనాను అనుకరించటం వల్లా, కొంత స్వభావరీత్యా, ఈ రెంటినీ మించి ఒక్క ఓటుతో గెలుపోటములను తారుమారు చేసే మన ఎన్నికల వ్యవస్థ వల్లా.. జనాకర్షణ గల, డబ్బు సమకూర్చగల వ్యక్తుల చుట్టూ ఆ పార్టీలు కేంద్రీకృతమయ్యాయి. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడిగా అఖిలేష్ యాదవ్ ఇటీవల మూడోసారి ఎన్నికయ్యారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతీయ పార్టీలూ ఇదే ఒరవడిలో సాగుతున్నాయి. 'రాజకీయాల్లో నేను, తమ్ముడు పవన్ కళ్యాణ్ చెరోవైపు ఉండటం కంటే నేను తప్పుకోవటంతోనే తమ్ముడు పెద్ద నాయకుడిగా ఎదుగుతాడని నమ్మాను. ఏమో..! పరిపాలించే అవకాశం ప్రజలు తనకి ఇస్తారేమో! అలాంటి రోజు రావాలని కోరుకుంటున్నా' అని యూనియన్ మాజీ మంత్రి, సినీ మెగాస్టార్ చిరంజీవి ఇటీవల చెప్పిన మాటలు మన రాజకీయాల్లో వ్యక్తిగత, పెత్తందారీ ధోరణులు ఎంతగా పాతుకుపోయాయో తెలియచేస్తాయి. ప్రజల్ని ప్రభావితం చేసే వ్యక్తులు ప్రజల ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించిన కీలక రంగంపై రాజకీయ భావజాలాన్ని, విధానాల్ని బట్టి కాకుండా, రక్తసంబంధాన్ని బట్టి స్పందించటం నిరుత్సాహాన్ని కలిగిస్తుంది.


**పార్టీల్ని సొంతం చేసుకోకపోవటం వల్ల పెరుగుతున్న ఫిరాయింపులు**

పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవటం వల్ల పార్టీ కోసం పనిచేయటాన్ని సదరు పార్టీ సభ్యుల్లో, నేతల్లో ఎవరూ సొంతం చేసుకోవటం లేదు. దీనివల్ల పార్టీ ఫిరాయింపులు కూడా యధేచ్ఛగా జరుగుతున్నాయి. దీన్ని అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టం కూడా చట్టసభల్లో సభ్యుల గొంతు నొక్కేదిగా ఉండటంతో పార్టీల నియంతృత్వం మరింత పెరిగింది. ప్రతి దానికీ విప్ జారీ వల్ల సభ్యుల అభిప్రాయాలకు విలువ లేకుండా పోయింది. దీంతో చట్టసభలో లోతుగా చర్చించి చట్టాలు చేయాల్సిన శాసన సభ్యులు ఆ పని చేయకుండా నియోజకవర్గంలో ప్రభుత్వంలా వ్యవహరిస్తూ మరింత దుష్పరిపాలనకు కారణమవుతున్నారు. ఫిరాయించిన చట్టసభ సభ్యుడిపై చర్య తీసుకునే అధికారం స్పీకర్ చేతిలో పెట్టటం వల్ల నాన్చుడు తప్ప న్యాయం జరగదని ఇప్పటికే

సోదాహరణంగా అర్థమైంది. ఈ అధికారాన్ని ఈసీకి ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. కానీ పార్టీల్లో భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, ఎదిగే అవకాశాలు లేకుండా ఈ మార్పు చేస్తే మరోసారి చట్టమవుతుంది తప్ప మార్పు మాత్రం రాదు. కాబట్టి ముందు రాజకీయ పార్టీల్ని అంతర్గతంగా ప్రజాస్వామీకరణకు చర్యల్ని తీసుకోవాలి. బడ్జెట్, విశ్వాస/అవిశ్వాస తీర్మానం సమయంలో తప్ప విప్ జారీకి అవకాశం లేకుండా చేయాలి. అలాగే ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకోని శాసన మండలి, రాజ్యసభల్లో విప్‌ను పూర్తిగా ఎత్తివేయాలి.

**స్వతంత్ర భారతంలో అన్ని స్థాయిల్లో రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించిన తొలి పార్టీ లోక్‌సత్తా**

దేశంలో పాలనా, రాజకీయ సంస్కరణల కోసం సమగ్ర ఎజెండాతో రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించిన లోక్‌సత్తా ఆ క్రమంలో తర్వాత పార్టీగా కూడా విస్తరించినప్పుడు తెలుగునాట రహస్య బ్యాలెట్ ద్వారా అన్ని స్థాయిల్లో ఎన్నికల్ని







నిర్వహించింది. స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల అథారిటీ, నియమావళి ప్రకారం ఆ ఎన్నికలు జరిగాయి. కొన్ని లోపాలు దొర్లినా, ఒక రాజకీయ పార్టీలో అన్ని స్థాయిల్లో నాయకత్వాన్ని ప్రాథమిక సభ్యులు ఎన్నుకోవటం బహుశా స్వతంత్ర భారత చరిత్రలో అదే మొదటిసారి. పార్టీ రాజ్యాంగాన్ని అనుసరించి.. అన్ని స్థాయిల్లో రెండు కీలక పదవుల్లో విధిగా ఒకటి మహిళలు, బలహీన వర్గాలు, మైనారిటీలకు కేటాయించారు. అలాగే భారత్ యువజనాభా ఉన్న దేశం కాబట్టి.. తప్పనిసరిగా కనీసం సగం మంది యువనాయకులు ఉండేలా ప్రోత్సహించారు. మొత్తంగా చూస్తే పార్టీ పదవుల్లో 50 శాతం అణగారిన, అప్పటివరకూ రాజకీయ ప్రాతినిధ్యంలేని వారికే దక్కే ఏర్పాటు చేశారు. ఎవరు ఏ స్థాయిలో పదవికైనా పోటీ చేసే అవకాశం కల్పించారు. చదువు, పోటీతత్వం, నాయకత్వ లక్షణాలున్న యువతను అభ్యర్థులుగా పరిశీలించారు. కుటుంబ నేపథ్యం, డబ్బు, వారసత్వంతో పనిలేకుండా అభ్యర్థిత్వం కోసం పోటీ పడ్డారు. ఈ ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియపై పార్టీ సభ్యుల్లో, సమాజంలో అవగాహన పెంచేందుకు లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తొలుత బరిలో దిగి తనపై పోటీని ప్రోత్సహించారు. లోక్‌సత్తా పార్టీని ప్రజల ఆస్తిగా నిర్మించారు. ఆ తర్వాత ఎన్నికల్లో కటారి శ్రీనివాసరావు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

**పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యానికి కనీస ఏర్పాట్ల తర్వాతే ఫిరాయింపు సభ్యులపై నిర్ణయాధికారాన్ని ఈసీకి ఇవ్వాలి**

ఈ మార్పు కోసం అన్ని పార్టీలూ ప్రయత్నం ఇకనైనా చేయాలి. ఫిరాయింపులపై విసిగిపోతున్నవారు, సుప్రీంకోర్టు కావచ్చు.. ఈ అంశంపై దృష్టి పెట్టాలి. 'మెజారిటీ నియమాన్ని' వర్తింప చేస్తూ ఏ వర్గానిది అసలైన పార్టీయో నిర్ణయిస్తామని మహారాష్ట్రలో మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేల మధ్య శివసేన పార్టీపై ఆధిపత్యం కోసం పోరులో ప్రకటించిన ఎన్నికల సంఘానికే నిర్ణయాధికారం ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన సంకేతం సరిపోదు. పార్టీల్లో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకునేందుకు స్పష్టమైన ఏర్పాట్లుండాలి.

అమెరికా వంటి దేశాల్లోనే పార్టీలు, ప్రజాస్వామ్యం ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. ప్రజాస్వామ్యం సంక్లిష్టమైనదే గానీ, కనీసం స్థూలంగానైనా పార్టీ అంటే ప్రజల ఆస్తి, సమర్థులకు, నిజాయతీపరుల రాజకీయ కలాపాలకు వేదిక అనే ఏర్పాటు ఉండాలి. పార్టీల్లో ప్రజాస్వామ్యం ఉంటేనే దేశంలో ప్రజాస్వామ్యం బలపడటం సాధ్యమవుతుంది. అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ఈ విషయంలో ఒత్తిడి తేవాలి. గతిలేక అధికార పార్టీలోకి ఫిరాయించటం, చెంచాగిరి చేయటం లేదా రాజకీయాల నుంచి బయటకు పోవటం పరిష్కారాలు కావు.

డబ్బు ప్రభావాన్ని అదుపు చేసి, సమర్థులు, ప్రజాసేవ పట్ల ఆసక్తి గలవారు చట్టసభల్లోకి ప్రవేశించగలిగేలా మొదట్లో చెప్పుకున్న ఎన్నికల సంస్కరణల్ని తీసుకురావటం పార్టీల్లో నియంతృత్వానికి బలమైన విరుగుడుగా పనిచేస్తుంది. ఒక్క ఓటుతో ఓడిపోయినా ఆ అభ్యర్థి ఓట్లన్నీ వృధానే అనే పద్ధతి నుంచి.. ప్రతి ఓటుకూ విలువ ఉండే దామాషా పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికను ప్రవేశపెట్టగలిగితే పార్టీల్లో వ్యక్తుల ప్రాబల్యం తగ్గుతుంది. సామాన్యులూ భాగస్వాములవుతారు, ఎవరి అండదండలతో పనిలేకుండా విధానాల బలంతో, సొంత సామర్థ్యంతో ఎదుగుతారు. కానీ ఎన్నికల సంస్కరణలకు అవసరమైన ఏకాభిప్రాయ సాధనకు కూడా పార్టీల్లోని నియంతృత్వం అవరోధంగా మారుతుండటం మార్పు తేవటాన్ని జటిలం చేస్తోంది. ఎన్నికల సంస్కరణలకుతోడు, స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని తగిన జవాబుదారీతనంతో వికేంద్రీకరిస్తే ఆరోగ్యకరమైన రీతిలో అన్ని స్థాయిల్లో సమర్థ, సృజనాత్మక నాయకత్వం రూపుదిద్దుకుంటుంది. పార్టీలు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే ప్రజాప్రాతినిధ్యం అభ్యంతరాలు, మార్గదర్శకాలకు పరిమితం కాకుండా.. చట్టపరంగా చర్యలు తీసుకునే ఏర్పాట్లు కూడా ఉండాలి. ప్రజాస్వామ్యంలో పార్టీలు కీలకం గానీ, ప్రజాస్వామ్యమంటే పార్టీలస్వామ్యం, పార్టీలస్వామ్యమంటే కొందరు వ్యక్తులస్వామ్యం అంటే అది ప్రమాదకర వాదన అవుతుంది. ✦

## లోక్‌సత్తా కూడా ఎన్నికల తిరునాళ్లలో కొట్టుకుపోతే

# మార్పు ఎట్లొస్తది

### ..మధ్యతరగతిని పెంచటం, చట్టబద్ధపాలన, అధికార వికేంద్రీకరణ కోసం పనిచేయండి

## హైదరాబాద్‌లో లోక్‌సత్తా పార్టీ 16వ వార్షికోత్సవంలో జేపీ

గాంధీజీ స్వతంత్రం కన్నా జాతినిర్మాణం కోసం ఎక్కువ ఆలోచించారని.. తెల్లవాళ్లు ఈవేళ కాకున్నా రేపయినా దేశాన్ని వదిలివెళ్లక తప్పదని, కానీ వాళ్లు పోయినంత మాత్రాన మనకు స్వరాజ్యం వచ్చినట్లు కాదని ఆయన స్పష్టంగా గుర్తించారని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాల్ని బాగుచేసుకోలేనప్పుడు అది స్వరాజ్యమవదని నిర్మొహమాటంగా ప్రకటించారన్నారు. గాంధీజీ కంటే వక్తలు, మేధావులు, రచయితలు అనేకమంది స్వాతంత్ర్యోద్యమంలో ఉన్నా.. మనలో అంతస్సూత్రంగా ఉన్న ఒకే జాతి భావాన్ని బలోపేతం చేసి జాతి నిర్మాణం చేసింది గాంధీజీ మాత్రమే అన్నారు.

మనిషి ప్రవర్తనలో నైతిక విప్లవం రావాలని గాంధీజీ ఆశించారని, కానీ అది చాలదని, తగిన సంస్థాగత నిర్మాణం లేకుంటే నీతి నిలబడదని డా॥ అంబేద్కర్ భావించారని, అందుకే లోక్‌సత్తా పార్టీ తన భావజాల ఐకాన్లుగా ఇద్దరినీ కలిపిందని జేపీ పేర్కొన్నారు. భారతదేశంలో ఈ ప్రయత్నం లోక్‌సత్తా మాత్రమే చేసిందన్నారు.

గాంధీ, అంబ్కేదర్ ఇద్దరూ సమానమే అయినా స్వతంత్రానంతరం ఒక దేశంగా మనకి వ్యవస్థలు కీలకం కాబట్టి తన ఓటు అంబేద్కర్‌కేనని జేపీ తెలిపారు. కృత యుగంలో, ద్వాపరయుగంలోనూ రాక్షసులు, సమాజ వ్యతిరేకులు ఉన్నారని, కాబట్టి మందిహితం కోసం నీతిని నిలబెట్టటానికి వ్యవస్థ ఉండాలన్నారు.

లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 2న హైదరాబాద్‌లో జరిగిన పార్టీ 16వ వార్షికోత్సవంలో జేపీ కీలకోపన్యాసం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు అధ్యక్షత వహించారు. తొలుత గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి, అంబేద్కర్‌లకు పార్టీ నేతలు నివాళులర్పించారు.

జేపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం రెండు రకాల రాజకీయాలున్నాయని.. ఒకటి, ఎట్లాగొట్లా అధికారం సంపాదించటం కాగా, రెండోది, గాంధీ, అంబేద్కర్‌ల తరహా రాజకీయమని అన్నారు. కొన్ని సందర్భాల్లో రెండూ పరస్పర వ్యతిరేకం కావచ్చని, ఒక్కొక్కసారి రెండూ కలిసుండొచ్చని, కానీ



రెంటి మధ్యా విభేదం వస్తే మన ఓటు దేనికి అనే ఆలోచన కావాలన్నారు. తర్వాతి తరానికి మనం ఎలాంటి రాజకీయం అందించాలో మునుగోడులో ఉప ఎన్నిక తీరును చూశాకయినా తేల్చుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని సార్థకం చేయటం ఎలా అనే అంశంపై లోక్‌సత్తా పార్టీ దృష్టి పెట్టాలని సూచించారు.

ప్రస్తుత ఎన్నికలు ఒక జాతరలాగా, తిరునాళ్లలాగా తయారయ్యాయని జేపీ పేర్కొన్నారు. అధికార క్రీడగా మారిన రాజకీయం–గాంధీ, అంబేద్కర్‌ల తరహా రాజకీయం.. రెంటికీ మధ్య తేడాను అర్థం చేసుకుని అతీతంగా వ్యవహరించి సరైన నిర్ణయం తీసుకునే శక్తిని సమాజం ఇంకా సంతరించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో, తిరునాళ్లలో కొట్టుకుపోవటమా, విశ్వసనీయతను కోల్పోవటమా, పునాదుల్ని బలోపేతం చేసుకుంటూ గాంధీ, అంబేద్కర్ తరహా రాజకీయం చేయటమా లోక్‌సత్తావాదులుగా మనం తేల్చుకోవాలన్నారు. ఈ తిరునాళ్లలో లోక్‌సత్తా కూడా కలిసిపోతే సొమ్మొ్మ పోతుంది, శనీ పడుతుందన్నారు. లోక్‌సత్తా పార్టీని ప్రారంభించేటప్పుడు చేసిన ప్రసంగాన్ని ఒక్కసారి ఆలకించాలన్నారు. రాజకీయ పార్టీ అనగానే, ఎన్నికలు, డబ్బులు, ప్రచారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో.. ఎందుకు, ఏమిటి అనే ప్రశ్న మనం వేసుకోవాలన్నారు. మన శక్తిని ఎలా వినియోగించుకోవాలో

నిర్ణయించుకోవాలన్నారు.

అసమానతల్ని తొలగించాలంటే రెండు మార్గాలున్నాయని, ఒకటి, చట్టం, రెండు, రాజకీయమని జేపీ అన్నారు. కానీ మన వద్ద అధికారం ఉన్నచోట ప్రాతినిధ్యం లేదు, ప్రాతినిధ్యం ఉన్న చోట అధికారం లేదన్నారు. మునుగోడులో చట్ట ప్రకారం రిజర్వేషన్ ఉన్నా ఆ అభ్యర్థి కూడా రూ.50 కోట్లు కనీసం ఖర్చు పెడితేనే బరిలో ఉండగలుగుతాడన్నారు. దళితుల్లో సీట్లు ఇవ్వాలన్నా ఎవరి దగ్గర డబ్బు ఉంటే వారికే ఇవ్వాల్సిరావటం బహిరంగ రహస్యమన్నారు. వెంటనే పోరాడవలసింది స్థానిక ప్రభుత్వాలకు అధికారం సాధించటం కోసమన్నారు. దీనివల్ల అక్కడ రిజర్వేషన్ల ద్వారా వచ్చినవారు తమ సత్తా ప్రదర్శించగలుగుతున్నారన్నారు. స్థానిక ప్రభుత్వాల నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగినవారు గతంలో 28 మంది దాకా ఉంటే, గత 25-30 ఏళ్లలో ముగ్గురు కూడా లేరని తెలిపారు. వెతికితే కనిపించే స్టాలిన్, రీటా బహుగుణ లాంటి వారు కూడా వారసత్వ రాజకీయాల వల్ల వచ్చారన్నారు.

రాజకీయంగా కుల వ్యవస్థలో సమానత్వాన్ని సాధించాలంటే, ఉన్న వ్యవస్థను ఉపయోగించుకోవాలని, లేదంటే 50 కోట్లు, తాయిలాలు వంటి వాటిలో కూరుకుపోతామని జేపీ అన్నారు. గాంధీ, అంబేద్కర్‌లు ఆశించిన రాజకీయం రావాలంటే, రాజ్యాంగం, ఓటు, స్వేచ్ఛ చాలవన్నారు. ప్రజాస్వామ్యం మధ్యతరగతి భావన అని, ఇప్పటికీ మన దేశంలో మధ్యతరగతి సంఖ్య తక్కువన్నారు. రెండోది, చట్టబద్ధపాలన లేకుండా ప్రజాస్వామ్యం నేతిబీరకాయలోని నెయ్యిలాంటిదని, నిరర్థకమన్నారు. మూడోది, ఓటుకి-భవిష్యత్తుకి మధ్య సంబంధం ఉండాలంటే, బలమైన, జవాబుదారీతనమున్న, సేవలందించే, ప్రజలు ప్రశ్నించే, ప్రజాస్వామ్యానికి పాఠశాలల్లా ఉండే స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇవి లేకుండా ఎమ్మెల్యే ఎవరైనా వృధా అని, మంత్రులు ఉత్సవ విగ్రహాలవుతారన్నారు. ప్రధానమంత్రి దేశంలో రాజు, ముఖ్యమంత్రి రాష్ట్రంలో రాజు అయితే ఉపయోగం లేదన్నారు.

ఈ నేపథ్యంలో.. దేశంలో మధ్యతరగతి సంఖ్యను పెంచటానికి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయటం, వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలనిచ్చే నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటి రంగాలపై లోక్‌సత్తా పనిచేయాలని జేపీ అన్నారు. అలాగే చట్టం అందరికీ సమానంగా వర్తించేలా చట్టబద్ధపాలనను పటిష్ఠం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇదే సమయంలో స్థానిక ప్రభుత్వాల సాధికారతతో పౌరసత్వాన్ని పెంపొందించటం కోసం కృషి చేయాలన్నారు.

ప్రజలు ఆర్థికంగా పెరగకుండా, పేదరికం పోకుండా వ్యవస్థల్ని మార్చే శక్తి రాదని జేపీ స్పష్టం చేశారు. అయితే గతానుభవంతో, ఇతరుల అనుభవాలు, హేతుబద్ధత, వాస్తవాలతో సంబంధం లేకుండా పిడివాదాలతో మన దేశంలో బహిరంగచర్చ నాసిరకంగా ఉందన్నారు. నూతన వ్యవసాయ చట్టాలు రైతులకు ఆదాయం పెంచుతాయని, దేశాభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిసీ అసంబద్ధ వాదనలతో అడ్డుకున్నారన్నారు. ఆదాయాలు పెంచని వ్యాసంగం నిరర్థకమని, ఇతరుల ఆదాయాల నుంచి వ్యవసాయంలో ఆదాయం పెంచేందుకు ఎంతకాలం రాయితీలిచ్చి ఎంతమందిని బతికించగలం అని ప్రశ్నించారు. ఒక ఏడాది ఒక పంటను, తద్వారా ఆదాయాన్ని తీసుకుని చూస్తే చాలు, మనం ఎంత భ్రమల్లో బతుకుతున్నామో అర్థమవుతుందన్నారు. వ్యవసాయంలో పెట్టే ఖర్చుకు, చేసే శ్రమకు, వచ్చే ఆదాయానికి సంబంధం లేకున్నా, ఆ రంగాన్ని సంస్కరించి ఆదాయాలు పెంచేందుకు మన బహిరంగ చర్చ అవరోధమైందన్నారు. ఆదాయాలు పెరిగి మధ్యతరగతి విస్తరించాలన్నారు.

గాంధీ, అంబేద్కర్‌ల రాజకీయానికి, ప్రస్తుత రాజకీయానికి సంబంధం లేని ఈ పరిస్థితుల్లో లోక్‌సత్తా ఎన్నికల్లో పోటీ చేస్తే మార్పు ఎలా వస్తుందని జేపీ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం అత్యంత సంక్లిష్ట ప్రక్రియని, అర్థం చేసుకోవటం సులభం కాదన్నారు. ఎన్నికలు, పార్టీల వ్యవస్థ బూటకమైన పరిస్థితుల్లో, వాటిని మార్చకుండా మనం ఎన్నికల్లో పోటీ చేసి ఉపయోగం లేదన్నారు. మరి పార్టీ ఎందుకు అనే ప్రశ్న వస్తుందని, ప్రజల్లో 10-15% మంది ఆలోచించి మార్పులో పాల్గొంటారనే నమ్మకంతో పార్టీ పెట్టామని, అది లేదని తేలిపోయిందన్నారు. 'ఆప్' ఎంత మార్పు తెచ్చిందో చర్చించుకుందామన్నారు.

గాంధీ విగ్రహాలకు, అంబేద్కర్ రిజర్వేషన్లకు ఎందుకు పరిమితమైపోయారో ఆలోచించండి

ఎన్నికల్లో పోటీ చేయకపోయినా, లోక్‌సత్తాను ఎవరూ చులకన చేయరని, ఆ భావాలు అజరామరం, జాతి భవిష్యత్తుకి అవసరమని జేపీ పేర్కొన్నారు. ఇతరుల్ని తిట్టకుండా ఆధునిక భారతంలో రాజకీయం చేసిన ఏకైక పార్టీ లోక్‌సత్తా అన్నారు. లోక్‌సత్తా పార్టీని ఉద్యమంలా భావించండి అని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసేవాళ్లకి కొరత లేదని, ప్రజాస్వామ్యంలో, ప్రజల జీవితాల్ని మార్చటంలో కొరత ఉందన్నారు. మధ్యతరగతిని పెంచటం, చట్టబద్ధపాలనను తీసుకురావటం, అధికార వికేంద్రీకరణ ఈ మూడు ప్రశ్నలకూ సమాధానం వెతికినప్పుడు అప్పుడు మనం విజయం సాధించినట్లన్నారు. మారుతున్న పరిస్థితులకి లోక్‌సత్తా సిద్ధాంతాన్ని అన్వయించటం ఎలా అని ఆలోచించాలన్నారు. ఎందుకు గాంధీజీ విగ్రహాలకు, అంబేద్కర్ రాజ్యాంగ పండుగ, దళిత రిజర్వేషన్లకు పరిమితమయ్యారో ఆలోచించి కాలానుగుణ పరిస్థితులకు అవసరమైనరీతిలో లోక్‌సత్తా భావజాలంతో పనిచేయాలన్నారు. లోక్‌సత్తా భావజాలం అప్పుడూ ఇప్పుడూ ఒకటేనని, అది అజరామరని, కానీ నిరంతరం ఆధునీకరిస్తూ కొత్తదనంతో, కొత్తతరాన్ని తయారుచేస్తూండాలన్నారు. ఆ పని ఎఫ్‌డీఆర్‌లో జరుగుతోందని, లోక్‌సత్తా సంస్థలో, లోక్‌సత్తా పార్టీలో జరగటం లేదన్నారు. ఆధునిక సమాజం కంటే మన రాజ్యం వెనుకబడి ఉందన్నారు. ఆధునిక సమాజానికి, రాజ్యానికి మధ్య






సంఘర్షణను నిర్మాణాత్మకంగా అధ్యయనం చేసి పరిష్కారాలను అందిస్తూ వాటి కోసం కలసి కృషి చేద్దామన్నారు. తన సుదీర్ఘ పోరాటంలో ఎప్పుడూ బతుకులు త్యాగాలు చేయమని ఎవరికీ చెప్పలేదన్నారు. మీ జీవితాల్ని చూసుకుంటూనే కొంత సమయాన్ని, వనరుల్ని సమాజంలో మార్పు కోసం లోక్‌సత్తా భావజాలంతో వినియోగించమని కోరానన్నారు. భారతీయులు ప్రపంచ జనాభాలో 18% ఉన్నామని, దేశంలో మార్పు తేవటం అంత ఆషామాషీ కాదన్నారు. యువత తమ జీవితాల్ని చూసుకుంటూనే వ్యవస్థల్ని మార్చాలని జేపీ పిలుపునిచ్చారు.

నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని, విశ్రాంత జాయింట్ కలెక్టర్ సూర్యనారాయణ, పార్టీ కన్వీనర్ కటారి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస వర్మ, వైబీఐ నేత శివరామకృష్ణ, మల్లాది కిషోర్, సరోజనీదేవి, గజానని తదితరులు ప్రసంగించారు. ✦

### అమరావతిపై హైకోర్టు తీర్పుని అమలు చేయాలి, గ్రీన్‌ఫీల్డ్ సిటీగానూ అభివృద్ధి చేయాలి,

# అధికారాన్ని రాజధాని నుంచి జిల్లాలు, స్థానిక ప్రభుత్వాలకు వికేంద్రీకరించాలి

**అమరావతిపై హైకోర్టు రెండు సబబైన కారణాలతో ఇచ్చిన తీర్పును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేయాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.**

అమరావతిపై హైకోర్టు రెండు సబబైన కారణాలతో ఇచ్చిన తీర్పును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేయాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల దగ్గర్నుంచి భూమి తీసుకున్నప్పుడు నష్టపరిహారంతో పాటు భూమిని అభివృద్ధి చేశాక కూడా కొంత వాటా ఉండాలని లోక్‌సత్తా తొలి నుంచీ వాదిస్తోందని, ఆ రీతిలోనే రైతుల సమ్మతితోనే చేయటం వల్లే అమరావతి భూసమీకరణను సమర్థించిందని, ప్రభుత్వం లిఖితపూర్వకంగా రైతులతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలుచేయాల్సి ఉంటుందని అన్నారు. రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలన్నది ప్రభుత్వ నిర్ణయమని, ఒక నిర్ణయాన్ని అందరూ కలిసి అసెంబ్లీలో తీసుకున్నాక, భూసమీకరణ ఒప్పందం కుదుర్చుకున్నాక కట్టుబడి ఉండాలన్నారు. తుగ్లక్‌లా ఇష్టారాజ్యం రాజధానిని మార్చలేరన్నారు. ఏపీలో 3 రాజధానుల పేరుతో అస్పష్టత ఆవరించిందని, పాలన చట్టబద్ధంగా సాగటం లేదన్నారు. ఎన్నికలంటే విప్లవం కాదని, పార్టీలు వస్తూపోతుంటాయి కానీ ప్రభుత్వం శాశ్వతమని, ఒక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్ని తర్వాతి ప్రభుత్వం రాజకీయ కారణాలతో మార్చటం తగదన్నారు.




అమరావతి విషయంలో అందరూ రాజధాని కోణంలోనే మాట్లాడుతున్నారని, లోక్‌సత్తా మొదటి నుంచీ చెబుతున్నట్లు ఒక గ్రీన్‌ఫీల్డ్ సిటీగా కూడా అమరావతిని అభివృద్ధి చేయాలని జేపీ పేర్కొన్నారు. ఓ మహానగరం వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనటానికి హైదరాబాదే ఉదాహరణని, తెలంగాణలాంటి చిన్న రాష్ట్రానికి హైదరాబాద్ వంటి మహానగరం ఆదాయం ఉండటం వల్లే తలసరి ఆదాయం ఎక్కువగా ఉందన్నారు. హైదరాబాద్‌లో కూడా పాత నగరం, అబిడ్స్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్‌లు ఇప్పుడు ప్రధాన కేంద్రాలు కాదని, గ్రీన్‌ఫీల్డ్ సిటీ ఉన్న హైటెక్ సిటీ వంటి ప్రాంతాలకే పెట్టుబడులు తరలి వస్తున్నాయని, ఇటువంటి అవకాశం ఏపీకి ఇప్పటికే రాష్ట్రం నడిబొడ్డులో భూసమీకరణ జరిగి, ప్రభుత్వంపై భారం లేకుండా పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న అమరావతిలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, రాజధాని చుట్టూ గందరగోళంతో ఇంకా సమయం వృథా చేయకుండా దిద్దుబాటు చర్యలు అవసరమన్నారు. ప్రభుత్వం కాస్త వినటం నేర్చుకోవాలన్నారు.

లోక్‌సత్తా పార్టీ 16వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అనంతరం మీడియాతో జేపీ మాట్లాడారు. లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యం, సీనియర్ నాయకుడు డాక్టర్ పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలోనే అన్నీ ఉండాల్సిన అవసరం లేదని, ఉదాహరణకి పట్టు పరిశ్రమ కార్యాలయం ఆ ఉత్పత్తి ఎక్కువగా ఉండే రాయలసీమలో, మత్స్య పరిశ్రమ కార్యాలయం ఇంకో చోట ఉండేలా వికేంద్రీకరించాలని.. అయితే అసలైన వికేంద్రీకరణ జిల్లా ప్రభుత్వాలను ఏర్పాటు చేసి స్థానిక

ప్రభుత్వాలకు నిజమైన అధికారాల్ని, నిధుల్ని ఇచ్చినప్పుడే సాధ్యమవుతుందని జేపీ అన్నారు. మంత్రుల్ని కూడా డమ్మీలుగా మార్చేసి అధికారమంతా ముఖ్యమంత్రి దగ్గరే, రాజధానిలోనే కేంద్రీకరించటం వల్ల రాష్ట్రం, దేశం తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చెబుతున్న అధికార వికేంద్రీకరణలోని డొల్లతనం గురించి అన్ని పార్టీలకూ తెలిసినా, జిల్లా, స్థానిక ప్రభుత్వాలకు అధికారాన్ని, నిధుల్ని బదిలీ చేయాలని ఎవరూ ప్రశ్నించటం లేదని.. నిజమైన అధికార వికేంద్రీకరణ పట్ల ప్రతిపక్షాలకు కూడా ఆసక్తి లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల గురించి ఆలోచనే కరువైందని, నిరంతరం రాజకీయం, రాజకీయం, రాజకీయం అనే పరిస్థితి నెలకొందని, ఆ రాజకీయం ఎందుకంటే పదవి, పదవి, పదవి కోసమని, ఆ పదవి ఎందుకంటే కేవలం సొంతలాభం, పెత్తనం కోసమని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు వెగటు పుట్టిస్తున్నాయన్నారు. తెలుగునాట రాజకీయం తీరు మారాలన్నారు.

ఏపీ ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏటా సుమారు రూ.90,000 ఖర్చు పెడుతున్నా, 40 శాతం మంది గడియారం చూసి సమయం చెప్పలేకపోతున్నారని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. 'మార్కెట్‌కి వెళ్తే తూకాలు తెలియటం లేదు. కొవిడ్ తర్వాత ప్రభుత్వ బడుల్లో చేరేవారి సంఖ్య పెరిగినట్లు కాగితాల్లో చూపిస్తున్నారు తప్ప, వాస్తవం అలా లేదు. తల్లిదండ్రులు నాణ్యమైన విద్య వస్తుందనే ఆశతో పిల్లల్ని ప్రయివేటు పాఠశాలలకే పంపుతున్నారు. పిల్లలకు అర్థమయ్యే భాషలో బోధించాలి. ఇంగ్లీషు తెలియని ఉపాధ్యాయులు ఇంగ్లీషు తెలియని పిల్లలకు బోధిస్తుంటే ఎలా అర్థమవుతుంది?' అని ప్రశ్నించారు. పిల్లలకు తెలిసిన భాషలో కాన్సెప్ట్‌లు పట్టుబడేలా బోధన ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ అభినందనీయమేగానీ, ప్రభుత్వోద్యోగులను పెడితే సేవలు అందుతాయనుకోవటం భ్రమ అని జేపీ స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో 10 మంది సుశిక్షితులైన ఎంబీబీఎస్ చదివిన ఫ్యామిలీ డాక్టర్లు అందుబాటులో ఉండాలని, వారికి ప్రభుత్వం జీతం ఇచ్చే పద్ధతి కాకుండా, రోగికి ఇంత మొత్తం చొప్పున ఎంతమంది ప్రజలు వారి వద్దకు ఔట్ పేషెంట్లుగా వెళ్తే అంత మొత్తాన్ని రీఇంబర్స్ చేసే ఏర్పాటు ఉంటే డాక్టర్ల మధ్య పోటీ, ప్రజలకు ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండి నాణ్యమైన సేవలు తక్కువ వ్యయంతో అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు.

ఏపీలో దాదాపు శ్రీలంక పరిస్థితులే నెలకొన్నాయి. అప్పు తెచ్చిన డబ్బును మౌలిక వసతుల కల్పన, సంపద సృష్టికి కాకుండా, రోజువారీ, తాత్కాలిక అవసరాలకు వినియోగిస్తున్నారు. ప్రభుత్వం పేదలను సొంత కాళ్లపై నిలబడేలా తయారు చేయాలి కానీ అప్పు చేసి పప్పుకూడు తినకూడదని.. జేపీ హితవు పలికారు. 'ఎలక్ట్రిక్ వాహనాలు, చిప్స్ తయారీ పరిశ్రమలు తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్రలకే కాదు, చివరికి ఉత్తరప్రదేశ్, బీహార్‌లకు కూడా వస్తున్నాయి. దేశంలో అన్ని రాష్ట్రాలూ ముందుకు పోతుంటే మనం వెనుకబడిపోవటం ఏపీకి గౌరవమా?' అని ప్రశ్నించారు. కష్టపడేతత్వం, చొరవ తీసుకునే ధోరణి, పెట్టుబడి పెట్టేవారు ఉన్నా ప్రజల సామర్థ్యాల్ని ప్రభుత్వం సరైన దిశలో వినియోగించలేకపోతోందన్నారు. యువత నడుం బిగించి రాష్ట్రాన్ని పట్టించుకోకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని, మేలుకోవాలని జేపీ విజ్ఞప్తి చేశారు. ✦

## ఏపీ నుంచి జేపీ ప్రాతినిధ్యం వహించాలి

**ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలను సాధించేందుకు జయప్రకాష్ నారాయణ్ ఏపీ నుంచి పార్లమెంటుకు ఎన్నిక కావాల్సిన అవసరం ఉందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కమిటీ తీర్మానించింది. కలిసొచ్చే వారితో కొత్త రాజకీయ వేదికను పంచుకునేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని ప్రకటించింది.**

## పవన్ కళ్యాణ్‌పై నిర్బంధాన్ని ఖండించిన జేపీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒకప్పటి తమిళనాడును తలపిస్తోందని, రాజకీయాలను భావాల సంఘర్షణగా కాకుండా వ్యక్తుల సంఘర్షణగా భ్రమపడుతూ ప్రత్యర్థులను వేధిస్తున్నారని, బహిరంగ చర్చ ప్రమాణాలు దిగజారాయని, చట్టబద్ధపాలన లేకుండా పోయిందని జేపీ అన్నారు. 'అధికారంలో ఉన్నవాళ్లు ప్రతిపక్షాల మాట వినాలి, విమర్శలను సహేతుకంగా తిప్పికొట్టాలి తప్ప బస్తీమే సవాల్ అనకూడదు' అని పేర్కొన్నారు. విశాఖపట్నంలో జనవాణి కార్యక్రమానికి వెళ్లిన జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్‌ని నిర్బంధించటాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. ఒక పౌరుడిగా, పార్టీ నేతగా ప్రజల వద్దకు వెళ్లే, తన భావాల్ని వ్యక్తం చేసే హక్కు, బాధ్యత కూడా పవన్‌కి ఉన్నాయని, రాజ్యాంగం ఇచ్చిన అధికారంతోనే పాలనా యంత్రాంగం రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తూ ఆయన్ను అడ్డుకోవటం, నిర్బంధించటం గర్హనీయమని అన్నారు. 2017లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఏపీ ప్రత్యేకహోదా కోసం విశాఖపట్నంలో కొన్ని పార్టీలు, సంఘాలు తలపెట్టిన ఆందోళనను అడ్డుకుని నేతల్ని నిర్బంధించినప్పుడు కూడా తాను ఖండించానన్నారు. పాలకులు, అధికారులు ప్రజలకు సేవకులం అని కాకుండా పూర్వకాలంలోని రాజుల్లా వ్యవహరిస్తున్నారని, ప్రజాస్వామ్యానికి, ఆధునిక పాలనకు ప్రాణమైన చట్టబద్ధపాలనను విధిగా అమలు చేయాలని జేపీ స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్: ప్రత్యామ్నాయ రాజకీయ

# ఎజెండా ఉంటేనే ప్రయోజనం

భారత్‌కి స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంలో దేశం గురించి, భవిష్యత్ గురించి పెద్ద లోతైన చర్చలు జరగకపోయినా, ప్రధానమంత్రి ఎర్రకోట ప్రసంగం కూడా చప్పగా ఉన్నా.. పార్టీ రాజకీయాలపరంగా మాత్రం ఈ ఏడాది కొన్ని గణనీయ పరిణామాలు కనిపిస్తాయి. వాటిలో ఒకటి తెలంగాణ రాష్ట్ర సమితి పేరు మార్చుకుని భారత్ రాష్ట్ర సమితిగా జాతీయ స్థాయి పార్టీగా విస్తరించటం. ఆ మార్పు కోసం టీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కె.చంద్రశేఖరరావు 2018 నుంచి మల్లగుల్లాలు పడుతున్నారు. మూడో కూటమి అని కొన్నాళ్లు అన్నారు, ఆ తర్వాత ఫెడరల్ ఫ్రంట్, ప్రత్యామ్నాయ ఎజెండా అన్నారు.. చివరికి జాతీయ పార్టీ ఏర్పాటు చేశారు. దాదాపు వంద పేర్లు చర్చించి భారత్ రాష్ట్ర సమితి పేరు ఖరారు చేసినట్లు చెప్పారు.



75వ స్వాతంత్ర్య వార్షికోత్సవ సంవత్సరాన్నే ఈ ప్రకటనకు కేసీఆర్ ఎంచుకున్నారు. ఈ మైలురాయి వరకూ జరిగిన పాలన వల్ల దేశానికి సరిగా న్యాయం జరగలేదని, ఏడున్నర దశాబ్దాల తర్వాతయినా దేశంలో ఒక గుణాత్మక మార్పు రావాలని తాను టీఆర్ఎస్‌ను విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఇన్నేళ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్‌ను ఏర్పాటు చేసినా.. ప్రధానంగా బీజేపీపైనే కేసీఆర్ గురిపెట్టారు. జాతీయత, దేశభక్తి వంటి అంశాలను బీజేపీ హైజాక్ చేయకుండా ఉండటానికే స్వాతంత్ర్య వజ్రోత్సవాలను ఘనంగా, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన సెప్టెంబర్ 17ను మొట్టమొదటిసారిగా అధికారికంగా, జాతీయ సమైక్యతా దినోత్సవంగా టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించింది.

టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మారుస్తూ దసరా రోజున పార్టీ కార్యాలయంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని పార్టీ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కేసీఆర్ దాదాపు 21 ఏళ్ల క్రితం టీఆర్ఎస్ ప్రస్థానాన్ని ప్రారంభించి, ఆ తర్వాత వ్యూహాత్మక ఎన్నికల రాజకీయాలతో అన్ని పార్టీలనూ తెలంగాణ సాధన క్రమంలో భాగం చేసి, 2014లో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి అప్పటి నుంచీ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. 2014 ఎన్నికల్లో 63 అసెంబ్లీ స్థానాలను, 11 లోక్‌సభ స్థానాలను గెలుచుకోగా, 2018 ఎన్నికల్లో 88 అసెంబ్లీ సీట్లు సాధించారు.

నిజానికి 2018లో ముందస్తు ఎన్నికల్లో కేసీఆర్ గెలుపు కష్టమనే అభిప్రాయం వ్యక్తమైంది. తెలుగుదేశం అధ్యక్షుడు, అప్పటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాంగ్రెస్‌తో కలిసి తెలంగాణ ఎన్నికల్లో ముమ్మరంగా పాల్గొనటంతో దాన్ని తెలంగాణ వ్యతిరేక చర్యగా ప్రొజెక్ట్ చేసి, సెంటిమెంట్‌గా మలిచి కేసీఆర్ గెలిచారని విశ్లేషకులు భావిస్తారు. రెండోసారి కూడా గెలిచినా కేసీఆర్ పాలనలో పెద్ద దిద్దుబాటు లేదని, మొదటిసారి కన్నా నిర్లక్ష్యంగా, ఏకపక్షంగా వ్యవహరించారనే అభిప్రాయాల మధ్య ఆయన గెలుపు మూడోసారి కష్టమనే అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే మరో కొత్త అస్త్రం కోసం వెతుకులాటను ఆయన ప్రారంభించారు. ఈసారి సెంటిమెంట్‌కు పెద్దగా అవకాశం లేకపోవటంతో, సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌ను బలహీనపరిచే వ్యూహానికి మరింత పదును పెట్టటంతోపాటు జాతీయ రాజకీయాల మార్గాన్ని ఎంచుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బీఆర్ఎస్ ఏర్పాటుపై ఆయన అనేకమంది ఆర్థికవేత్తలు, వ్యవసాయం సహా పలు రంగాల్లో నిపుణులు, పాలనా రంగంలో అనుభవం ఉన్న రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, సీనియర్ రాజకీయవేత్తలు, జర్నలిస్టులతో కేసీఆర్ సంప్రదించారు. స్వయంగా కొన్ని రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ కొందరు ముఖ్యమంత్రులు, సీనియర్ నేతలను కలిశారు. కొంతమందిని తెలంగాణకు రప్పించి మాట్లాడారు. ఇందుకోసమయిన ఖర్చంతా కేసీఆరే చెల్లించారట. ఇదంతా పూర్తయి జాతీయ పార్టీని స్థాపించాలని నిర్ణయించాక ప్రకటనలు, ఫీలర్లతో మీడియా ద్వారా ప్రచారం ప్రారంభించారు. అయితే స్పందన అనుకూలంగా రాలేదు. కేసీఆర్ అభిమానులు, శ్రేయోభిలాషులు, టీఆర్ఎస్‌కు సాంప్రదాయ ఓటుబ్యాంకుగా భావించే వర్గాల్లోని సామాన్య ప్రజలు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ పార్టీలోని నేతలు కూడా ఇది అనవసర రిస్కు అనే అభిప్రాయాన్ని ప్రయివేటు సంభాషణల్లో వ్యక్తం చేశారు. చివరికి కేసీఆర్‌తో అంతర్గత చర్చల్లో పాల్గొన్న ఆలోచనాపరులు కూడా ఇది కేసీఆర్ వల్ల అయ్యే పనేనా అని సందేహాల్ని వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. కానీ ఎవరూ సారు ముందు గొంతు

విప్పి తమ వాదనల్ని స్పష్టంగా చెప్పిన దాఖలాల్లేవు. ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో అసంతృప్తుల్ని సొంత సర్వే నివేదికలూ పేర్కొన్నా అవేవీ కేసీఆర్‌ను ఆపలేకపోయాయి. మునుగోడు ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల అయినా కేసీఆర్ జంకలేదు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా విస్తరిస్తున్నట్లు అనుకున్నట్లే అక్టోబర్ 5న, దసరా రోజున ప్రకటించారు. రైతులు, యువత, మహిళలు, సైనికులు మొదలైన వర్గాల మీద ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు, మహారాష్ట్ర, కర్ణాటక మీద తొలుత దృష్టి సారించనున్నట్లు తెలిపారు. తర్వాత హైదరాబాద్‌లో అఖిల భారత దళిత సమ్మేళనం నిర్వహిస్తామన్నారు.

**గుజరాత్, ఢిల్లీ నమూనాలో**

తెలంగాణ పాలన నమూనాను దేశానికి ఆదర్శంగా చూపటం ద్వారా కేసీఆర్ తన పార్టీని జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. రైతుబంధు, దళితబంధు మొదలైన పథకాలు, తాగునీరు, నీటిపారుదల, 24 గంటల విద్యుత్ వంటివి, తలసరి ఆదాయంలో వృద్ధి దేశవ్యాప్తంగా ఆకట్టుకుంటాయని ఆయన అనుకుంటున్నారు. 2014లో గుజరాత్ నమూనాను చూపి మోదీ ఎలాగైతే జాతీయస్థాయిలో నాయకుడిగా ఆవిర్భవించారో అలా ఎదగాలని కేసీఆర్ ఆశిస్తున్నారు. ఈ క్రమంలో గుజరాత్ నమూనాను సైతం తెలంగాణ అధిగమించగలదని విశ్వసిస్తున్నారు. అలాగే ఢిల్లీలో చేసిన అభివృద్ధిని చూపి ఆమ్‌ఆద్మీ పార్టీ పంజాబ్‌లో ఎన్నికలలో గెలిచిన నమూనాను కూడా ఉదహరిస్తున్నారు. గుజరాత్, ఢిల్లీ ముఖ్యమంత్రులకు సాధ్యమయినది తెలంగాణ ముఖ్యమంత్రికి కూడా సాధ్యమవుతుందని లెక్కలు చెబుతున్నారు.






మోదీ, అరవింద్ కేజ్రీవాల్ తరహాలో కేసీఆర్ తెలంగాణ అభివృద్ధి నమూనాను ఒక వ్యూహాత్మక అస్త్రంగా మలచటం ఆచరణీయ ఎత్తుగడ అనటంలో కూడా సందేహం లేదు. అయితే ఒక జాతీయ దృక్పథం, హేతుబద్ధ, ఆచరణసాధ్య నమూనా లేకుండా కేవలం ఆకర్షణీయ సంక్షేమ పథకాలతో ఒక రాష్ట్రం నుండి జాతీయస్థాయిలోకి ఎదగటం ప్రశ్నార్థకం.

**మోదీ వెనక దశాబ్దాల సంస్థాగత నిర్మాణం ఉంది**

నరేంద్రమోదీ జాతీయ నాయకుడిగా ఎదగటం వెనక కేవలం గుజరాత్‌లో ఆయన చేసిన కృషి మాత్రమే కాదు.. వెనక ఆర్ఎస్ఎస్, జనసంఘ్‌ల దశాబ్దాల కృషి, ఆ తర్వాత దిగ్గజాల వంటి నేతల కృషితో జాతీయస్థాయిలో బలంగా ఎదిగిన బీజేపీ ఉన్నాయి. అలాగే మోదీ రాకముందే, ఇంకా చెప్పాలంటే జాతీయోద్యమ కాలం నాటికే గుజరాత్‌కి ప్రగతిశీల చరిత్ర ఉంది. ఆర్థిక కృషిలో మహారాష్ట్ర ప్రాంతంతో పోటీపడుతుండేది. అదేవిధంగా, పంజాబ్, ఢిల్లీల మధ్య సామీప్యత, రాకపోకలు, నివాసాలు ఉండటం, పంజాబ్‌లో కూడా ఢిల్లీలోలా రాజకీయ శూన్యత ఏర్పడటం వల్లే ఆప్ అక్కడ విజయం సాధించింది. కాంగ్రెస్, అకాలీదళ్‌ల పట్ల పంజాబ్ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఆప్‌కి గత ఎన్నికల్లోనే అక్కడ 23.7% ఓట్లు వచ్చాయని కూడా గుర్తించాలి. కానీ అదే ఆప్ మిగతా రాష్ట్రాల్లో ముఖ్యంగా దక్షిణాదిన విజయం సాధించటంలో ఎందుకు వేగంగా ముందుకెళ్లలేకపోతోంది? తెలంగాణలోకి వచ్చి ఆప్ విజయం సాధించగలదా? ఇతర రాష్ట్రాలకు విస్తరించే క్రమంలో అవినీతిపై పోరాటం, సుపరిపాలన వంటి అంశాల్లో తన ఎజెండాను కూడా పణంగా పెడుతూ ఆప్ భావజాల గందరగోళంలో చిక్కుకుంటోంది. ఈ నేపథ్యాన్ని గుర్తించకుండా కేవలం మోదీ, కేజ్రీవాల్‌లకే అంతా ఆపాదించి, మనం కూడా అలా ఓ నమూనా తీసుకెళ్తే, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూనే మోదీ 2014లో దేశవ్యాప్తంగా 100కి పైగా బహిరంగ సభల్లో పాల్గొని ఉద్రూతలూగించినట్లు కేసీఆర్ కూడా చేస్తే.. బీఆర్ఎస్‌ను జాతీయ స్థాయిలో గెలిపిస్తారనుకోవటం పొరపాటు. సొంత విమానాన్ని ఉపయోగించుకుని మోదీ కంటే ఎక్కువసార్లు తిరిగినాసరే. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెప్పినట్లు, ఇతర ప్రభుత్వాలు తెలంగాణలోని పథకాలను

తీసుకున్నా వాటిని తమ పథకాలుగా ముద్ర వేసుకుంటారు తప్ప తెలంగాణపేరు చెప్పరు. ఉదాహరణకి, వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీని ప్రారంభించటానికి మూలం ఎక్కడో ఉంది, తన సొంత పథకంలా ఆయన మొదలుపెట్టారు, ఆ ఆరోగ్యశ్రీని మోదీ ప్రభుత్వం ఆయుష్మాన్‌భారత్‌గా మార్చుకుని తమ పథకమని చెప్పుకుంటోంది. ఇలా రాజకీయం చేస్తారు తప్ప ఒకవేళ కేసీఆర్ పథకాలు గొప్పవి అనుకున్నా, వాటికి క్రెడిట్ ఆయనకివ్వరు.

**తెలుగు రాష్ట్రాల్లోని ఉచితాల స్థాయి ఉత్తరాదినీ ఊపేస్తుందన్న కేసీఆర్ అంచనా, ఉచితాల కట్టడి చర్యలపైనా విమర్శ**

ఉచితాల పథకాల్లో ఉత్తరాది రాష్ట్రాలు తెలుగు రాష్ట్రాలతో పోటీ పడలేవనటంలో సందేహం లేదు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉత్తరాదిన పేద ప్రజల కోసం అందిస్తున్న ఉచిత వంటగ్యాస్, బియ్యం వంటి పథకాలు, స్వల్పస్థాయి నగదు బదిలీలు అక్కడ కొత్తగానీ మన వద్ద కొత్త కాదు. దశాబ్దాల క్రితమే వాటిని మన నేతలు అమలు చేసేశారు. ఈ పథకాల్ని అవినీతికి ఆస్కారం లేకుండా అందించటంలో మోదీ ప్రభుత్వం దృఢసంకల్పంతో వ్యవహరిస్తుండటంతో ప్రజల్లో ఆయన పట్ల ఆదరణ, నమ్మకం పెరిగింది.




ఎన్నికల్లో గెలుపుకి దోహదం చేసింది. తెలంగాణ అమలు చేస్తున్న పథకాల్ని గనక ఉత్తరాదిన, దేశవ్యాప్తంగా అందించే ఏర్పాటు చేస్తే వారిని బీజేపీ కంటే ఘనంగా ఆకట్టుకోవచ్చని కేసీఆర్ భావిస్తుండవచ్చు. ఈ రకమైన అంచనాతోనే మోదీ రాజకీయ ఎత్తుగడగా ఉచితాల కట్టడిపై చర్చ ప్రారంభించారనే విమర్శ కూడా ఉంది. అయితే ప్రజాప్రయోజనాల రీత్యా అప్పులు చేసి మరీ అనుత్పాదక ఉచితాలివ్వటాన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది కాబట్టి, ఏ కారణం చేత చేసినా మోదీ ప్రభుత్వాన్ని ఈ విషయంలో తప్పు పట్టలేం. అలాగే కొవిడ్ సమయంలో నోబెల్ విజేతలు సహా వివిధ దేశాల ఆర్థికవేత్తలు భారీస్థాయి నగదు బదిలీ చేయాలని చెబుతుంటే కేసీఆర్ కూడా సమర్థించారు. హెలికాప్టర్ మనీ పద్ధతిని అమలు చేయాలని ప్రతిపాదించారు. కానీ దేశ దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మోదీ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించింది. ఆ ముందుజాగ్రత్త వల్లే భారత్ ద్రవ్యోల్బణం, ఇతర ఆర్థిక ఒడిదుడుకుల విషయంలో డబ్బు పంచిన చాలా దేశాల కంటే మెరుగ్గా ఉంది. కాబట్టి కేసీఆర్ ప్రతిపాదిస్తున్న ఉచితాలను కూడా వ్యయం దృష్ట్యా పునఃపరిశీలించాల్సి ఉంది.

వీటిని పక్కన ఉంచి మిగిలిన అంశాల్లోకి వచ్చినా కూడా.. కేసీఆర్ ప్రభుత్వ నమూనా దేశానికి ఆదర్శప్రాయమన్నది కూడా చర్చనీయాంశం.

**గుజరాత్, ఢిల్లీ నమూనాలకే ఎక్కువ దీర్ఘకాలిక అభివృద్ధి పునాదులు**

గుజరాత్ మద్యం ద్వారా ఆదాయం లేకుండా, పెద్దగా వర్షపాతం వంటి వనరులు లేకుండానే ఆర్థిక వృద్ధిని సాధించింది. ఉచితాల పంపిణీ లేకుండానే మోదీ ఆ రాష్ట్రంలో గెలిచారు. ప్రజలలో మతపరమైన ఉద్వేగాల్ని రెచ్చగొట్టి మోదీ లబ్ధి పొందారని ఒక పరిధి దాటి వాదన చేసే అవకాశం కేసీఆర్‌కు లేదు. వనరుల కేటాయింపు ప్రాధమ్యాల్ని మార్చి, గుజరాత్‌లో 24 గంటల విద్యుత్ కోసం సంస్కరణల్ని మోదీ తీసుకొచ్చారు. రైతుల్లో వ్యతిరేకత వచ్చే ప్రమాదముందని తెలిసీ మోటార్లకు విద్యుత్ మీటర్లు బిగించారు. వాస్తవాల ఆధారంగా పనిచేస్తూ ఫలితాలను చూపిస్తూ రైతుల మెప్పు పొందారు. కేవలం హైదరాబాద్ ఆదాయం మీద పథకాలు అమలు చేస్తూ, రాష్ట్ర విభజన సమయంలో మిగులుగా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి నమూనా గురించి గుజరాత్‌ను మరీ ఎక్కువ నిలువరించలేదు.

స్పష్టంగా చెప్పాలంటే, తెలంగాణ కంటే గుజరాత్ నమూనాకే దీర్ఘకాలిక అభివృద్ధి పునాదులు బలంగా ఉన్నాయనుకోవచ్చు. అలాగే ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటి అంశాలలో చిత్తశుద్ధితో ప్రయత్నం చేసింది. ముఖ్యంగా ఆరోగ్యంలో కొన్ని ప్రమాణాల్ని నెలకొల్పింది. తెలంగాణలో కొన్ని మంచి కార్యక్రమాలు, పాలనా చర్యలు ఉన్నా అటువంటి సుపరిపాలనాంశాలు కేసీఆర్ అభివృద్ధి నమూనాలో కొరవడ్డాయి. గుజరాత్, ఢిల్లీ నమూనాల్లోని దీర్ఘకాలిక అభివృద్ధి దృక్పథం కూడా తెలంగాణ నమూనాలో కొరవడింది.

**సుపరిపాలన ఎజెండాలో తెలంగాణ పేలవ రికార్డు**

సుపరిపాలన అందించాలంటే, రాజ్యవ్యవస్థ తరపున ప్రభుత్వం తన బాధ్యతను సక్రమంగా నెరవేర్చాలి. రాజ్యం పాత్రలో ప్రజలందరికీ ఎదిగే అవకాశాలు కీలకం. ఇందుకు ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, చట్టబద్ధపాలన, అవినీతిరహిత సేవలు, స్థానిక స్వపరిపాలన, సత్వర న్యాయం కీలకం. వీటన్నిటిలో తెలంగాణ రికార్డు పేలవంగా ఉంది.

హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ స్కూళ్లున్నాయి, కానీ తెలంగాణ రాష్ట్రంలోని 14-18 ఏళ్ల మధ్య విద్యార్థుల్లో సగం మందికి గడియారం చూసి కచ్చితంగా సమయం చెప్పటం రాదు. జాతీయ ఎఛీవ్‌మెంట్ సర్వే-2021 ప్రకారం, రాష్ట్రంలో అన్ని తరగతుల విద్యార్థుల సామర్థ్యాలు దేశంలోని 37 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల మధ్య అట్టడుగున 35, 36వ ర్యాంకులో ఉన్నాయి. ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టి, బి.సి వర్గాలకు చెందిన పిల్లల్లో తరగతివారీ విద్యాసామర్థ్యాలు తక్కువగా ఉన్నాయి. తెలంగాణలో పదో తరగతి విద్యార్థులకు తెలుగులో సరిగా చదవడం, రాయడం రావటం లేదని, ఇంగ్లీషులో

పదాలు, వాక్యాలను సొంతంగా చదవలేకపోతున్నారని సర్వే వెల్లడించింది. విద్యార్థుల సామర్థ్యాల స్కోరు గత నాలుగేళ్ల వ్యవధిలో మరింత తగ్గినట్లు పేర్కొంది. అలాగే 2021 జూన్‌లో తెలంగాణలోని 25 జిల్లాల్లో సామాజిక కార్యకర్తలు నిర్వహించిన సర్వే ప్రకారం 3వ తరగతి నుంచి 6వ తరగతి దాకా చదివే పిల్లలలో 52 శాతం మంది విద్యార్థులు తేలిక పదాలు కూడా రాయలేకపోయారు. 56 శాతం మందికి కూడికలు, తీసివేతలు చేయడం రాలేదు. కేసీఆర్ ఉద్యమ సమయంలో, 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన కేజీ టూ పీజీ నాణ్యమైన ఉచిత విద్య హామీ ఇప్పటికీ నెరవేరలేదు.

అలాగే ఆరోగ్యాన్ని కూడా తీవ్ర నిర్లక్ష్యం చేశారు. విద్యలో చేస్తున్న ఖర్చు సరిపోతున్నా, విద్యాప్రమాణాల పెంపుపై దృష్టి లేకపోవటం వల్ల సర్టిఫికెట్లు తప్ప పరిజ్ఞానం లేకపోవటం సమస్య కాగా.. ఆరోగ్యంలో నిధులు కూడా తగినన్ని కేటాయించటం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన దగ్గర్నుంచి ఇప్పటి వరకు ఏ ఏడాది కూడా వైద్య రంగంపై ఖర్చు బడ్జెట్‌లో 5 శాతం దాటలేదని రిజర్వుబ్యాంకు నివేదిక తెలిపింది. 2014-15లో 4.1 శాతం వెచ్చించగా, ఆ తర్వాత వరుసగా 3.9, 4.1, 4.2, 4.0, 4.3, 3.4 శాతం ఖర్చు జరిగింది. వైద్య రంగంపై అతి తక్కువ వెచ్చిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని నివేదిక పేర్కొంది. ఆ చేస్తున్న వ్యయాన్ని కూడా అసంబద్ధంగా చేస్తు న్నారు. మనకు కావలసినంతమంది వైద్యులు అందుబాటులో ఉన్నా, వారిని ఉపయోగించుకుంటూ బడ్జెట్‌లో కొద్దిపాటి అదనపు కేటాయింపుతో ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జేబుఖర్చు లేకుండా అందించే అవకాశం ఉన్నా, ఆ పని చేయకుండా, జిల్లాకో మెడికల్ కాలేజీని స్థాపించి కొత్తగా డాక్టర్లను తయారుచేయటం వైద్యరంగాన్ని బాగుచేయటమన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.




ఇక చట్టం ఉన్నవాళ్ల చుట్టంలా వ్యవహరిస్తోందని తెలంగాణ రాష్ట్రంలో చాలామందికి తెలుసు. నిజాయతీపరులైన పోలీసు అధికారులు, ఆధునిక సాంకేతికత వినియోగం ఉన్నా కూడా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గాల్సి వస్తోంది. తీవ్రమైన కేసుల్లో సైతం రాజకీయ పెద్దల అనుమతి ఉంటేనే వేగంగా చర్యలు తీసుకోగలుగుతున్నారు. చట్టబద్ధపాలన సామర్థ్యం లేక ప్రజల ఒత్తిడిని తట్టుకోవటానికి కొన్ని తీవ్ర నేరాల్లో ఎన్‌కౌంటర్ల పేరుతో నిందితులను పోలీసులు కాల్చివేయటాన్ని సర్కారే గుట్టుగా ప్రోత్సహిస్తోందనే బలమైన ఆరోపణలున్నాయి. మహిళల భద్రతకు షీ టీమ్‌లను ప్రవేశపెట్టినా, సరైన ఏర్పాట్లు లేకపోవటం వల్ల నేరాలు ఆశించినంత అదుపు కావటం లేదు. మహిళలపై అఘాయిత్యాలను తొలిదశలోనే నివారించటానికి, ఇతర సందర్భాల్లో సామాన్య ప్రజలకు సత్వర న్యాయానికి కీలకమైన గ్రామన్యాయాలయాల చట్టం వచ్చి దాదాపు 14 ఏళ్లవుతున్నా తెలంగాణలో ఇప్పటివరకూ ఒక్క స్థానిక కోర్టు కూడా ఏర్పాటవలేదు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెచ్చరిల్లిపోతున్నా, ఆన్‌లైన్ సేవల్లోనూ చేతివాటం చూపుతున్నా తగిన చర్యలు లేవు. ఉన్నతాధికారులపై కేసుల్ని ముఖ్యమంత్రి కార్యాలయమే తొక్కిపడుతోందన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో సిటిజన్ ఛార్టర్ల అమలుకు తెచ్చిన చట్టాన్ని అమలు చేయకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. నేతలు, అనుచరగణం, వారిని అనుసరించి ప్రభుత్వ యంత్రాంగంలో పెరిగిన అవినీతిని కట్టడి చేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్‌తో కొన్నాళ్లు హడావుడి చేసి తర్వాత పట్టించుకోవటం మానేశారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారుల ఆక్రమణలు, అవినీతిపై రాష్ట్రంలో కథలుకథలుగా చెప్పుకుంటున్నారు. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే సాక్షాత్తూ ముఖ్యమంత్రి, సన్నిహితులకు రూ.20,000 కోట్లపైగా కమీషన్ల లబ్ధి సమకూరిందని కొందరు విశ్వసనీయ రాజకీయ ఉద్యమకారులు కూడా చెబుతున్నారు.

వ్యవసాయరంగం బాగు కోసం సాగునీటి ప్రాజెక్టులపై కేసీఆర్ అనుసరించిన నమూనాపై కూడా సహేతుక విమర్శలున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణకే ఏడాదికి రూ.25,000 కోట్ల రూపాయల దాకా ఖర్చవుతుందని, ఏ రకంగానూ ఆ వ్యయాన్ని తిరిగి పొందేందుకు అవకాశాలు లేవని పలువురు నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏ రూపంలో రైతులకు సాయం అందించినా అది వారి నిజ ఆదాయం అవదు. రైతుబిడ్డలతో సహా పన్ను చెల్లించేవారు కట్టిన డబ్బును అటు మళ్లించటమే అవుతుంది. రైతులకు నిజంగా మెరుగైన ఆదాయం లభించేలా వారిపై ఆంక్షలను తొలగించేందుకు స్వేచ్ఛా మార్కెట్ విధానంతో యూనియన్ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ చట్టాలను ముందు సమర్థించి ఆ తర్వాత కేసీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాజకీయ వర్గాలు, మీడియా శక్తులు రెచ్చగొట్టటంతో ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు ఆందోళనకు దిగితే సమర్థించారు. ఆందోళన సమయంలో ప్రాణాలు కోల్పోయినవారికి నగదు పరిహారాన్ని కూడా కేసీఆర్ ప్రభుత్వం అందించింది. ఈ రకంగా చూస్తే వ్యవసాయంలో రైతుకి, వినియోగదారునికి మేలు చేసే దీర్ఘకాలిక విధానాలు కేసీఆర్ పాలనలో కనిపించవు.

ఇక స్వతంత్ర భారతంలో జరిగిన అతిపెద్ద తప్పిదానికి కేసీఆర్ నిలువెత్తు ప్రతిరూపంగా వ్యవహరిస్తున్నారు. అధికారాన్ని

మొత్తం తన చేతిలో కేంద్రీకరించుకున్నారు. మంత్రుల్నీ దమ్మీల్ని చేశారు. గతంలో ఐఏఎస్ అధికారుల చేతుల్లో కొంత అధికారమన్నా ఉండేది. ఇప్పుడు వారిని కూడా గుమాస్తాల్లా, సమాచార వాహకుల్లా తయారుచేశారు. ప్రజాస్వామ్యానికి పాఠశాలలైన స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాల్ని పట్టించుకోకుండా నిర్వీర్యం చేశారు. మేయర్లని ఉత్సవ విగ్రహాలు చేశారు, సర్పంచ్‌లు అభివృద్ధి పనుల కోసం భిక్షాటన చేసుకోవాల్సిన పరిస్థితి కల్పించారు. ఫెడరలిజం కోసం యూనియన్‌తో కొట్లాడుతున్నామని చెబుతూనే మూడో అంచెలోని స్థానిక ప్రభుత్వాలకు మాత్రం అధికారాలు ఇవ్వకుండా ప్రజల రోజువారీ జీవితాల్ని దుర్భరం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచారు. అంతెందుకు, హైదరాబాద్‌లో వర్షం కురిస్తే సాక్షాత్తూ ముఖ్యమంత్రి నివాసం, క్యాంపు కార్యాలయంగా ఉన్న ప్రగతి భవన్ ముందే వరద ప్రవహిస్తుందంటే స్థానిక పాలన ఎంత అధ్వాన్నంగా ఉందో



అర్థమవుతుంది. రిజర్వేషన్లకు అనుకూలమని, అణగారినవర్గాల సాధికారత లక్ష్యమని, నూతన భారతదేశాన్ని నిర్మిస్తామని చెప్పుకుంటూనే.. మహిళలు, ఎస్.సి, ఎస్.టిలు, బి.సిలకు గరిష్ఠ రిజర్వేషన్లు అమలులో ఉన్న స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు ఇవ్వకుండా నీరుగార్చారు. మహిళా సాధికారత పట్ల భూస్వామ్య, పెత్తందారీ మనస్తత్వంతో వ్యవహరించారు. కేసీఆర్ తొలి మంత్రివర్గంలో మహిళలకు కనీస ప్రాతినిధ్యం లేదు. మహిళా కమిషన్ నియామకాన్ని కూడా ఏళ్ల తరబడి పట్టించుకోలేదు.

మోదీ ప్రభుత్వం తరహాలోనే కేసీఆర్ కూడా వ్యవస్థల్ని బలహీనపరిచారు. ప్రత్యర్థుల కట్టడికి ఉపయోగించారు. నిరసన గళాల పట్ల కూడా తీవ్ర అసహనాన్ని ప్రదర్శించారు. దాన, దండోపాయాలతో మీడియాను చెప్పుచేతల్లో పెట్టుకున్నారు.

భారత ప్రజాస్వామ్యం ఈవేళ ఎదుర్కొంటున్న.. పార్టీ ఫిరాయింపులు, నేర రాజకీయం, ఎన్నికల్లో నోట్లు పంపిణీ, అప్పులు చేసి మరీ ఉచితాలు, వంశపారంపర్య రాజకీయాలు, వ్యక్తిస్వామ్యం, వ్యక్తిగత విశ్వాసాలు-ఉమ్మడి ప్రయోజనాలకు మధ్య గీత చెరిపేయటం, అధ్వాన్న బహిరంగచర్చ ప్రమాణాలు, మీడియాను నియంత్రించటం మొదలైన జాడ్యాల్లో కేసీఆర్ భాగస్వామ్యం కూడా ఉంది. అంతెందుకు, బీఆర్ఎస్‌కు లాంచ్‌ప్యాడ్‌గా భావిస్తూ స్వయంగా కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా మార్చిన మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్ఎస్ సహా పార్టీలు వెదజల్లిన డబ్బు అమెరికా వంటి దేశాల ఎన్నికల్లో కూడా చూడని స్థాయిలో ఉండగా, ఈ ఎన్నికలో ప్రధాన పార్టీలు ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన తీరు ఎప్పుడో సుమారు రెండొందల సంవత్సరాల క్రితం బ్రిటన్‌లోని రాటెన్ బరోస్ నియోజకవర్గాల్లోని వేలంపాటల్ని గుర్తుకుతెస్తుంది.

ఇన్ని మౌలిక లోపాలు పెట్టుకుని ప్రజలకు కాస్త ఎక్కువ డబ్బు పంచే పథకాలను సుపరిపాలనగా పేర్కొంటూ జాతీయస్థాయికి వెళ్లి కేసీఆర్ ఎలా ప్రత్యామ్నాయమవుతారు? భారత్‌లో గుణాత్మక మార్పుని తీసుకురావాలనే సంకల్పాన్ని తీసుకుంటే, కేసీఆర్ ఇంకా లోతైన ఆలోచన చేయాలి.

**ఎమర్జెన్సీ నాటి సమస్యలే ఇప్పటికీ దేశాన్ని పీడిస్తున్నా కాంగ్రెస్ తరహా పథకాలే**

1975లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించటానికి దారితీసిన ఉద్యమాల వెనక కారణాలు పేదరికం, నిరుద్యోగం, అవినీతి. ఇప్పటికీ అవే కారణాలు దేశాన్ని వివిధ రూపాల్లో దేశాన్ని పీడిస్తున్నాయి. గరీబీ హఠావో నినాదం దగ్గర్నుంచి ఇప్పటి వరకూ తాయిలాలు, ఉచితాల పథకాల్ని కొనసాగిస్తున్నా ఎందుకు పేదరికం కొనసాగుతుందో ఆలోచించకుండా, దేశ జనాభాలో ఇప్పటికీ 25 శాతానికిపైగా బహువిధ పేదరికంతో ఎందుకు నలిగిపోతున్నారో గుర్తించకుండా.. వాటినే కొంత స్థాయి పెంచి కొనసాగిస్తే పరిష్కారం ఎలా వస్తుందో, అది ప్రత్యామ్నాయం ఎలా అవుతుందో కేసీఆర్ సమీక్షించుకోవాలి. కేసీఆర్ చేస్తున్న తరహాలో పథకాలను అమలు చేయటంలో కాంగ్రెస్‌కు ఘనచరిత్ర ఉంది. గరీబీ హఠావోకి పంచుడే పరిష్కారమని కాంగ్రెస్ భావించింది. లైసెన్స్-పర్మిట్ రాజ్యాన్ని తొలగించటానికి శ్రీకారం చుట్టి కొన్ని ఫలితాల్ని సాధించాక కూడా వ్యవసాయ రుణమాఫీలు సహా అలాంటి స్కీముల్ని ఎడాపెడా అమలు చేసిందా పార్టీ. నిస్సహాయులకు మాత్రమే పరిమితమవ్వాల్సిన సహాయాల్ని అనర్హులకూ అందిస్తూ అవినీతిని, దళారీలను పెంచి పోషించింది, ప్రజాధనాన్ని అపారంగా దుర్వినియోగం చేసింది. కాంగ్రెస్‌కు బలమైన నాయకత్వం లేని మాట వాస్తవమేగానీ, ప్రజలు కేవలం పథకాలనే ఆశిస్తే కాంగ్రెస్‌కు ఓటమి ఉండకూడదు. నరేంద్రమోదీకి ప్రత్యామ్నాయం కావాలని ప్రజల్లో గణనీయ శాతం కోరుకుంటున్నా, చివరకు మోదీ నోట కూడా బలమైన ప్రతిపక్షం ఉండాలన్న మాట వినిపించినా, కాంగ్రెస్‌కు పట్టం కట్టటానికి ప్రజలు సిద్ధపడటం లేదంటే వారి సందేశాన్ని మనం

జాగ్రత్తగా ఆలకించాలి.

**పందేరం మోదీ చేయలేరా?**

మోదీ ప్రభుత్వం ప్రస్తుతం ఉచితాల వైపు మరీ అంత మొగ్గు చూపకపోయినా, రేపు తప్పదు అనుకుంటే, వాటి ద్వారానే ఓట్లు వస్తాయి అనుకుంటే వాటిని కేసీఆర్ కంటే ఘనంగా అమలు చేయలేదా? బటన్ నొక్కి ప్రజల డబ్బును పంపిణీ చేయటానికి ఏం తెలివితేటలు, ప్రయత్నం కావాలి? ప్రజల పన్నుని దీర్ఘకాలిక పెట్టుబడులుగా మలిచి అభివృద్ధి ఫలాల్ని సాధించే నాయకత్వం అందించటం కష్టంగానీ.. వచ్చిన పన్నుల డబ్బుని పంచటంలో కష్టమేముంటుంది? ఒక్కసారిగా ఆదాయం పడిపోయి హఠాత్తుగా శ్రీలంకలాంటి పరిస్థితులు వచ్చాక చేసేదేముంటుంది? సంక్షేమం పేరుతో పథకాల వ్యయానికి తగ్గ ఆదాయం లేదని కాస్త అప్పుల్ని నియంత్రించగానే తెలంగాణలో తేటతెల్లమైంది, ఉద్యోగులకు నెలవారీ జీతాల చెల్లింపుకే కటకటపడాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా కూడా ఇదే తీరు చేస్తామంటే ఆ పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.

**డబ్బు పంచటం ద్వారా పేదరికాన్ని పోగొట్టిన ఒక్క ఉదాహరణ మొత్తం ప్రపంచంలో చూపండి**

దేశమంటే మట్టి కాదు, మనుషులని గురజాడ చెప్పిన మాటలు కేసీఆర్ కూడా కోట్ చేస్తుంటారు. మానవ వనరుల అభివృద్ధికి దళితబంధు వంటి పథకాల ద్వారా డబ్బు పంచటం మార్గమని ప్రపంచంలో ఏ దేశంలోనైనా రుజువైందేమో చెప్పండి. పంచటం పేదరిక నిర్మూలనకు మార్గం కాదు. ఉచితాల మీద ఆధారపడే ధోరణి పేదరికాన్ని తరాలపాటు కొనసాగిస్తుంది. తాత్కాలిక తాయిలాలు ఆర్థిక అసమానతల్ని కొనసాగిస్తాయి.

ప్రపంచంలో పేదరికం ఎక్కడ పోయినా, నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం ఎజెండాతోనే సాధ్యమైంది. ఆర్థిక అసమానతల్ని నూటికి నూరుపాళ్లూ తొలగించటం సాధ్యం కాకపోవచ్చు, కానీ సమానావకాశాల్ని అందించటం మన చేతుల్లోనే ఉన్న పని. అప్పుడు ఆర్థిక అసమానతల్లో ఇప్పుడున్న తీవ్రతలు పోతాయి, తన సమస్యకు ఎవరో కారణమని ఆరోపించే ద్వేషం తొలగి ప్రతి వ్యక్తీ తన జీవితంలో తానే హీరోలా జీవిస్తాడు. సామరస్యంతో మానవ సమాజం ఎదుగుతుంది. తెలంగాణలోనే కేసీఆర్ ఈ లక్ష్యాన్ని సాధించలేకపోయారు. దళితబంధు వంటి పథకాల రూపంలో ప్రజల్ని ఆకర్షించాలని చూస్తున్నారుగానీ, అదే డబ్బుని వారి జీవితాల్లో నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటి ఏర్పాట్ల ద్వారా ఎదిగే అవకాశాలను కల్పించటానికి వినియోగించటం లేదు. సాంకేతికత, ప్రయివేటు రంగంలోని చొరవ వల్ల జరుగుతున్న అభివృద్ధిని తన రాజకీయ ప్రతిభాపాటవాల వల్ల జరుగుతున్న అభివృద్ధిగా భ్రమించకూడదు. హైదరాబాద్ మినహాయిస్తే మిగిలిన తెలంగాణలో అభివృద్ధి ఏమేరకు దేశానికి నమూనాగా పనిచేస్తుంది?

**ఎన్నికల రాజకీయ కోణంలోనూ అంత సులభం కాదు**

ఎన్నికల రాజకీయ కోణంలో ఆలోచించినా బీజేపీని ఎదుర్కోవటం అంత సులభం కాదు. బీజేపీకి దక్షిణాది ఇంకా కొరుకుడు పడటం లేదన్నది వాస్తవం. అందుకే బీజేపీకి వ్యతిరేక స్పేస్ ఇక్కడ ఎక్కువగా ఉంది. 2019లో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ దక్షిణాది నుంచి పోటీ చేసి గెలవటం, కాంగ్రెస్ తన భారత్ జోడో యాత్రను దక్షిణాది నుంచి మొదలు పెట్టటం, ఆ పార్టీకి ఎన్నికైన అధ్యక్షుడు కూడా దక్షిణాదికి చెందినవారే కావటం ఈ సందర్భంగా గమనించాల్సిన ఆసక్తికర అంశాలు. దక్షిణాదిలో పూర్వ హైదరాబాద్ సంస్థానంలో భాగమైన మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలలో కూడా తనకు సానుకూల అవకాశాలు ఉంటాయని కేసీఆర్ భావిస్తున్నారు. బీజేపీని కాంగ్రెస్ కంటే సమర్థంగా ప్రాంతీయ పార్టీలు ఎదుర్కోగలుగుతున్నాయి. బీజేపీ, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా అలాంటి ప్రాంతీయ పార్టీలతో కలిసి వెళ్లాలని కేసీఆర్ అనుకున్నా, లోక్‌సభ స్థానాలకే పరిమితమైనా ఆ పార్టీలు ఏ మేరకు సిద్ధపడతాయన్నది సందేహాస్పదం. జేడీ-ఎస్ లాంటి పార్టీలు కొన్ని సీట్లు ఇవ్వటానికి సిద్ధపడినా షరతులు వర్తిస్తాయి. సరిహద్దు స్థానాలకే బీఆర్ఎస్ పరిమితమవ్వొచ్చు. కర్ణాటకలోని కొన్ని గ్రామాలవారు తమను తెలంగాణలో కలపాలని అడగటం, మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకాలోని కొన్ని గ్రామాల సర్పంచ్‌లు బీఆర్ఎస్‌లో చేరటానికి ముందుకు రావటం చాలదు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు నష్టం చేసిన అసలు విలన్లు ఎవరైనా, రాష్ట్ర విభజన ఉపద్రవం కాకపోయినా.. అది జరిగిన తీరు, కేసీఆర్ తాత్కాలిక రాజకీయ ప్రయోజనం కోసం ఉపయోగించిన భాష వల్ల అక్కడ బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో గెలిచేంత లాభం ఉండకపోవచ్చు. తెలుగుదేశంలోని తన మిత్రులను లాక్కోవటం, జనసేన వంటి పార్టీలతో సయోధ్య, హైదరాబాద్‌లో ఆర్థిక అవసరాలున్నవారిని కట్టడి చేయటం వంటి వ్యూహాలు అమలు చేసినా మరీ ఎక్కువ ఫలితాన్ని ఆశించలేరు. దేశంలో ముస్లింలు



కేసీఆర్ ప్రధాని కావాలని కోరిక... కోళ్లు, మద్యం పంపిణీ

దాదాపు 14.2 శాతం ఉన్నారు కాబట్టి, వారిలో అత్యధికులు బీజేపీకి వ్యతిరేకం కాబట్టి, టీఆర్ఎస్ పట్ల ముస్లింలలో సానుకూలత ఉంది కాబట్టి, ఎంఐఎంతో సత్సంబంధాలు ఉన్నాయి కాబట్టి, ముస్లింల ఓట్లు అత్యధికం లాక్కునే అవకాశం ఉందని కేసీఆర్ భావిస్తూండవచ్చు. అలాగే రైతులు, ఆయా రాష్ట్రాల్లోని తెలుగువారి నుండి ఆశిస్తుండవచ్చు. కానీ స్థానిక సమీకరణాలు, బలమైన ప్రాంతీయ పార్టీల మధ్య ఈ సానుకూలతలకూ పరిమితులున్నాయి.

బీజేపీ ప్రస్తుతం పదిహేడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నా అందులో దాదాపు ఎనిమిది రాష్ట్రాల్లో విపక్షాలను బలహీనం చేసి, ఎమ్మెల్యేలను కొని అధికారాన్ని అందుకుంది. ఇలా ఇతర పార్టీల నుంచి లాక్కుని ఇతర రాష్ట్రాల్లో బలపడే అవకాశాలు బీఆర్ఎస్‌కు తక్కువే. పైగా ఏదైనా ప్రాంతీయ పార్టీ మరో రాష్ట్రానికి విస్తరించి కొద్దిమంది ఎమ్మెల్యేల్ని గెలిపించుకున్నా తాను లాగేసుకుంటానని బీజేపీ బాహాటంగానే సంకేతమిస్తోంది. చివరికి కాంగ్రెస్ కూడా ఈ దెబ్బకి విలవిలలాడిపోతోంది. ఈడీ, సీబీఐలు కేవలం తమ పార్టీ సంస్థలన్నట్లు లజ్జారహితంగా విపక్షాలపై ప్రయోగిస్తోంది.


ABN ఆంధ్రజ్యోతి
మనీగోడు!
మునుగోడులో డబ్బు టు ది పవరాఫ్ డబ్బు

మన దేశంలో రాజకీయానికి రాష్ట్రం యూనిట్ కాబట్టి.. అక్కడ బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య పోటీ ఉన్నా వాటి మధ్య చొరబడటం కూడా బీఆర్ఎస్‌కు సవాలే. ఎందుకంటే, మూడో రాజకీయ పార్టీకి ఓటు వేయటం వేస్టు అని ఓటర్లు భావించే ఎన్నికల వ్యవస్థ మనది. కాబట్టి తెలంగాణకు ఆవల ఇతర రాష్ట్రాల్లో మూడో స్థానానికో, ఆ దిగువ నుంచో పోటీ పడుతూ కేసీఆర్ పార్టీ బలాన్ని సంపాదించటం అంత తేలిక కాదు.

**డబ్బుతోనే గెలవలేరు**

జాతీయస్థాయిలో నిజమైన కృషి చేసి, ఫెడరలిజాన్ని విస్తరించటంలో కీలక పాత్ర పోషించి, కాశ్మీర్ దాకా ప్రజల్లో పేరు సంపాదించుకున్న తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్.టి రామారావు కూడా జాతీయ పార్టీ పెట్టే ప్రయత్నం సాహసం చేయలేకపోయారు. భారతదేశం పార్టీ పెడతానని ఊగిసలాడి ఆ తర్వాత వెనక్కి తగ్గారు. అప్పటికి ఇప్పటికి సాంకేతికత, డబ్బు ప్రభావం పెరగటం తప్ప మిగిలిన విషయాల్లో పెద్ద మార్పేమీ లేదు. కేసీఆర్ హిందీ అనర్గళంగా మాట్లాడగలగటం జాతీయస్థాయిలో కలిసొచ్చే అంశమే అయినా, లక్ష్యం స్థాయితో పోలిస్తే అదేమీ ఆనదు. అలాగే ఆయన డబ్బుతో కొండ మీద కోతినైనా కిందకు దించవచ్చు అని భావిస్తున్నట్లుంది. నిజానికి తెలంగాణ నమూనా, బీఆర్ఎస్‌కు సంబంధించి జాతీయస్థాయిలో వచ్చిన ప్రచారం వెనక డబ్బు ప్రభావం ఎక్కువగా ఉందనే అభిప్రాయమూ ఉంది. ప్రచారంలో డబ్బుతో మీడియాని కొనేయచ్చని, ఎన్నికల్లో పెట్టుబడికి డబ్బులివ్వటం ద్వారా పార్టీల్ని, కొందరు నేతల్ని, కొన్ని సంఘాల్ని ఆకట్టుకోవచ్చని కేసీఆర్ భావించవచ్చు గానీ.. ఈ విద్యల్లో బీజేపీ ఇప్పటికే ఆరితేరిపోయింది. బీజేపీ సగం విజయరహస్యం శక్తిమంతమైన మీడియా సంస్థల్ని సమర్థవంతంగా నియంత్రిస్తూ, సోషల్ మీడియాను పదునుగా వినియోగించుకోవటంలోనే ఉంది. ఇప్పటికే జాతీయస్థాయిలో బలంగా ఉన్న బీజేపీతో ఈ విషయంలో పోటీపడటం కేసీఆర్‌కు సాధ్యం కాకపోవచ్చు. తెలుగు రాష్ట్రాలతో పోలిస్తే దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల వ్యయం ఇంకా తక్కువగానే ఉంది కాబట్టి.. తనకున్న మనీపవర్‌తో కొన్ని సీట్లన్నా గెలవగలను అని కేసీఆర్ అనుకోవచ్చు గానీ.. ఇంతకుముందే అనుకున్నట్లు మన ఎన్నికల వ్యవస్థలో మూడో స్థానంలో, ఆ దిగువన ఉండే పార్టీలకు అది కూడా అంత సులభం కాదు. జేపీ చెప్పినట్లు, ఎన్నికల్లో మనీపవర్ ఎంట్రీపాయింటే గానీ, గెలుపుకి గ్యారంటీ కాదు. డబ్బు ఖర్చు పెట్టకపోతే అరుదైన సందర్భాల్లో తప్ప ఓడిపోవటం ఖాయం.. డబ్బు ఖర్చు పెడితేనే కనీసం బరిలో ఉంటారు, అయితే గెలుస్తారన్న గ్యారంటీ మాత్రం ఉండదు.

**కేసీఆర్ పాలన నమూనా అంత అద్భుతమైతే మునుగోడులో ఎందుకంత మోహరింపు**

టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చటం ద్వారా ఏ రకంగా గెలవాలనుకుంటున్నారో ఆ పార్టీ నేతలు, శ్రేణుల్లో కూడా అత్యధికులకు అర్థం కావటం లేదు. కేసీఆర్ పట్ల వ్యతిరేకత బలంగా ఉందని మునుగోడు ఉప ఎన్నికలో ఆయన మోహరించిన తీరుని చూస్తే అర్థమవుతుంది. కేసీఆర్ అభివృద్ధి నమూనాకు తెలంగాణలోనే బలమైన వ్యతిరేకత ఉందని స్పష్టమవుతోంది. తాను ముఖ్యమంత్రి అయిన 2014లోనే ప్రధానమంత్రి అయిన నరేంద్ర మోదీ పట్ల వ్యతిరేకతను ఉపయోగించుకుని కేసీఆర్ గెలవాలనుకుంటున్నారా?.. కానీ గులాబీ రంగు అంటే తెలంగాణ అనే స్థాయిలో టీఆర్ఎస్ జెండా రంగు ప్రజల్లోకి వెళ్లిపోయిన నేపథ్యంలో.. పార్టీ పేరులో తెలంగాణ పదాన్ని తొలగించటం వల్ల అంతకంటే ఎక్కువ డ్యామేజీ జరుగుతుందంటున్నవారూ ఉన్నారు.

### కేసీఆర్ మదిలో పెద్ద ఆలోచనే ఉండొచ్చు

బీఆర్ఎస్‌లో పైకి చెబుతున్న లక్ష్యాలకు, ఆచరణకి మధ్య అంతరం ఎంత ఉండే అవకాశముందే కేసీఆర్‌కి తెలియనిది కాదు. ఆయన మనసులో చాలా పెద్ద ఆలోచనే ఉండి ఉండొచ్చు. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న లక్ష్యాలను సాధించటంలో తన పాలన, రాజకీయం ఇంకా యోజనాల వెనుక ఉన్నా.. రాజ్యాంగాన్నే తీసిపారేసి కొత్తది తేవాలని వాదించిన ముఖ్యమంత్రి ఆయన. కానీ తీవ్ర వ్యతిరేకత రావటం, ఒక్కటంటే ఒక్క సహేతుక కారణం కూడా చెప్పలేకపోవటంతో చివరకు వెనక్కు తగ్గారు. నూతన సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరును సైతం పెట్టారు. దక్షిణాది ప్రాధాన్యత పెంచాల్సిన అవసరం రీత్యా, రాబోయే కాలంలో హైదరాబాద్‌ను దేశానికి రెండవ రాజధానిగా ప్రకటించాలనే డిమాండ్ దాకా కేసీఆర్ వెళ్లినా ఆశ్చర్యపోనక్కర్లేదు. పార్టీ పేరులో తెలంగాణను తొలగించి భారత్ అని పెట్టాక, అదేమీ అసాధ్యం కాదు. ఉద్యమ సమయంలో తెలంగాణను కాశ్మీర్‌తో పోల్చటం నుంచి బీజేపీ బయటి పార్టీ, టీఆర్ఎస్ ఇంటి పార్టీ అని ఇటీవలి కాలం వరకూ చెప్పుకొచ్చిన ధోరణికి పూర్తి భిన్నంగా కేసీఆర్ ఇప్పుడు వ్యవహరిస్తున్నారు. అయితే, జేపీ అన్నట్లు, రాజకీయ కృషిని ఒక పరిమిత ప్రాంతానికి కాకుండా ఒక దేశానికి విస్తరింపచేయటం స్వాగతించదగ్గ పరిణామమే. ఆ మేరకు విశాల దృక్పథాన్ని ప్రదర్శించటం అభినందనీయమే. రాష్ట్ర విభజన జరిగాక కూడా హైదరాబాద్ విషయంలో కేసీఆర్ రెచ్చగొట్టే ధోరణిని అవలంబించకుండా సంయమనంతో వ్యవహరించారు. ఇందుకు ప్రత్యేకించి ఆయన్ను అభినందించాలి. సంశయలాభాన్ని కేసీఆర్‌కే ఇస్తూ.. ఈ రకమైన పరిణతికి కొనసాగింపుగానే జాతీయ స్థాయి రాజకీయ ప్రయత్నాల్ని కూడా పరిగణిద్దాం. కానీ ఈ మధ్యలో ప్రజల్ని ఎంత రెచ్చగొట్టారు, ఎన్ని ప్రాణాలతో చెలగాటమాడారు, ఎన్ని భ్రమల్ని వారిలో నింపారు! మన జీవితాల కంటే రాజకీయం ఎక్కువనుకుంటూ పూనకాలు వచ్చినట్లు ఊగిపోతూ, రాజకీయ పార్టీలకు బానిసలుగా వ్యవహరించటం ఎంత తప్పిదమో ప్రజలకు తెలియచేప్పే పరిణామమిది.

ఎవరి జీవితంలో వారే హీరోలు. హేతుబద్ధత, వాస్తవాలు, సాక్ష్యాధారాలే మార్గదర్శక దివ్వెలు. మన ఆకాంక్షల్ని వీటి ఆధారంగా, ప్రజాస్వామ్యయుతంగా, రాజ్యాంగబద్ధంగా నెరవేర్చుకోవాలే తప్ప భావోద్వేగాలు, నిందారోపణలతో కాదని ఇప్పటికైనా గుర్తిద్దాం.

### తెలంగాణలో శాశ్వత గుర్తింపు, వంశపారంపర్యమే ప్రధాన లక్ష్యం

ఒక విషయమైతే చాలా స్పష్టం. తన కుమారుడు కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని కేసీఆర్ పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో తాను క్రమంగా జాతీయస్థాయికి మళ్లటం ఒక వ్యూహమై ఉండొచ్చు. అందుకు కావలసిన డబ్బు ఉందనే అభిప్రాయంలో ఉండొచ్చు, తెలంగాణను అభివృద్ధి చేసేశాను, అది దేశానికే అభివృద్ధి నమూనా అవుతుందనే నమ్మకం ఉండొచ్చు, తన స్థాయికి ఇక తెలంగాణ చిన్నది, భారతదేశం స్థాయిలోనే పోటీ పడాలని ఆయన మనసులో బలంగా అనుకుంటుండొచ్చు. ఏమైనా, తన కుమారుడికి రాజకీయ భవిష్యత్తు, తెలంగాణ తెచ్చిన నాయకుడిగా, తెలంగాణ ఉద్యమ లక్ష్యాలుగా ప్రచారం చేసిన నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో గణనీయ ఫలితాల్ని చూపించిన ముఖ్యమంత్రిగా తన పేరు శాశ్వతంగా నిలిచిపోవటం మాత్రమే కేసీఆర్‌కు ప్రధాన లక్ష్యాలు. మిగిలినవన్నీ అందుబాటులోని అవకాశాల్ని బట్టి.

### ప్రత్యామ్నాయ రాజకీయ ఎజెండాయే శక్తి

తనకు నిజంగా రాజకీయ ప్రయోజనం వస్తుందన్న అంచనాతో చేసినా, లేదా కొందరు ఆరోపిస్తున్నట్లు బీజేపీకి మేలు చేసేట్లు కాంగ్రెస్‌ను బలహీనపరిచే వ్యూహంతో చేసినా, లేదా కేసీఆర్ తన మానసికావసరం రీత్యానే చేసినా.. బీఆర్ఎస్‌కు ఇప్పటివరకు చెప్పుకోదగ్గ స్థాయి అవకాశాలు కనిపించటం లేదు. గుర్రం ఎగరావచ్చు అని ఇంత రిస్కు తీసుకున్నా కేవలం తెలంగాణ అభివృద్ధి నమూనా వల్ల పెద్ద ప్రయోజనముండదు. ఆర్థికాభివృద్ధిని 7–8 శాతానికి తగ్గకుండా కొనసాగిస్తూ ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ఉపాధి నైపుణ్యాలు, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం ఎటువంటి జేబుఖర్చు లేకుండా అందించటం, అధికారాన్ని, నిధులను స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో వికేంద్రీకరించటం, పర్యావరణహిత మౌలిక సదుపాయాల నిర్మాణంపై భారీ పెట్టుబడులు, వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా స్వేచ్ఛా మార్కెట్ విధానాల్ని తీసుకురావటం, గ్రామీణ–పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గిస్తూ వలస కష్టాల్ని నివారిస్తూ చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటం, నగరాల అభివృద్ధిని ప్రణాళికాబద్ధం చేయటం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేకుండా నాణ్యమైన సేవలు అందించేలా పటిష్ఠ ఏర్పాట్లతో పాలనా సామర్థ్యాన్ని పెంపొందించటం, చట్టబద్ధపాలన సవ్యంగా అమలు, న్యాయం సత్వరంగా, ఖర్చు లేకుండా అందించటం, పాలనలో ఎమ్మెల్యేలు, వారి అనుచరుల జోక్యం, మధ్యవర్తిత్వం, ఎన్నికల్లో డబ్బు పంపిణీతో అంతలంతలవుతున్న ధన రాజకీయాల్ని కట్టడి చేసేందుకు ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి మొదలైన మార్పుల కోసం కృషి చేస్తేనే దేశానికి ఒక నమూనాను బీఆర్ఎస్ అందించగలుగుతుంది.

2014లో ప్రజలిచ్చిన చరిత్రాత్మక తీర్పుతో పోలిస్తే మోదీ ప్రభుత్వం సాధించింది స్వల్పం. ప్రజాస్వామిక దృక్పథం కొరవడటంతో కొన్ని మంచి నిర్ణయాలు కూడా అమలుకు నోచుకోలేదు. గుజరాత్ అభివృద్ధి నమూనానే మోదీ జాతీయ స్థాయి పాలనలోనూ అనుసరించారనుకుంటే, గుజరాత్ నమూనా పరిమితుల్ని కూడా మనం గుర్తించాలి. ఈ నేపథ్యంలో, కేసీఆర్ గనక పైన పేర్కొన్న ఎజెండా కోసం నిలబడితే ఒక ప్రత్యామ్నాయ రాజకీయం అందించి దేశంలో నిజమైన మార్పుకి దోహదం చేసినవారవుతారు.

భారతదేశాన్ని మెజారిటీ, మైనారిటీ, కులం, మతం వంటి గీటురాళ్లతో కాకుండా మౌలికంగా ఒక రాజ్యాంగబద్ధ, హేతుబద్ధ విధానాల దేశంగా ప్రజలంతా భావించే దిశగా కేసీఆర్ ఎజెండా ఉండాలి. భూస్వామ్య, పెత్తందారీ సంస్కృతి లేకుండా పాలన, రాజకీయం నిర్మించాలి. యువ జనాభా అత్యధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఏడాదీ భారత్‌కు విలువైనదే, తాత్కాలిక పరిష్కారాలకు చోటు లేదు. అందువల్ల పూర్తిస్థాయి బాధ్యతాయుత ఆలోచన చేయాలి. రాజకీయాలు సరైన నియమాలున్న ఆట కావాలి తప్ప అర్థరహిత, అరాచక క్రీడ కాకూడదు.

ప్రత్యామ్నాయ ఎజెండాతో ఫెడరల్ ఫ్రంట్ ద్వారా కృషి చేస్తే కేసీఆర్ ఎక్కువ ప్రయోజనం సాధించే అవకాశముందన్న అభిప్రాయం ఆచరణసాధ్యమైనది. భారత్‌కి ఒక ప్రత్యామ్నాయ రాజకీయం కావాలని, మెరుగైన రాజకీయం కావాలని ప్రజలే కాదు.. బీజేపీ, కాంగ్రెస్ వారు కూడా కోరుకుంటున్నారు. కానీ వాటిని కాలక్రమంలో తప్ప రావాల్సినంత వేగంగా తేవటానికి పార్టీలు ప్రయత్నించకపోవటంతో ప్రజలు నిస్సహాయులుగా మిగిలిపోయారు. ఈ పని కేసీఆర్ పార్టీ చేయకుంటే, మరొకరు చేస్తారు. లేదంటే చిట్టచివరికి ఇప్పుడున్న పార్టీలే ఆ రకంగా మారతాయి. ఈ మార్పయితే అనివార్యం. అయితే ఎంత వేగంగా జరుగుతుందన్నదే ప్రశ్న. ఇప్పటికే లోక్‌సత్తా ఇందుకు పునాది వేసింది. కానీ ఈ సమగ్ర మార్పు ప్రక్రియ వచ్చే పాతికేళ్లలోపయినా పూర్తికాకపోతే భారత్‌కు ఎదిగే అవకాశాలు కష్టమవుతాయి, మనందరం కలలు కంటున్న ఉజ్వల దేశంగా కాకుండా కేవలం మధ్యాదాయ దేశంగా ఇండియా మిగిలిపోతుంది.

కేసీఆర్ ఇప్పటి వరకూ బీఆర్ఎస్ ఎజెండాని స్పష్టంగా వెల్లడించలేదు. అన్ని వివరాలూ డిసెంబర్‌లో ప్రకటిస్తామంటున్నారు. అంతర్జాతీయ మీడియాతోనూ సమావేశాలు జరుపుతున్నారట.

ప్రధానంగా బీజేపీ మత, పాలనాపరమైన మితవాద ధోరణులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాటం ఉంటుందని కేసీఆర్ సంకేతాలిస్తున్నారు. కొంతమంది అంచనా వేస్తున్నట్లు కేసీఆర్ రాబోయే కాలంలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేసే అవకాశం ఉండొచ్చేమో గానీ.. ప్రస్తుతానికి జాతీయ పార్టీగా బీజేపీని ఎదుర్కోవటంలో కాంగ్రెస్ విఫలమవటంతో ఆ స్థానాన్ని భర్తీ చేయాలనే వైఖరి కనిపిస్తోంది. ఈ విషయంలో 'ఆప్' విజయాల నమూనా కూడా కొంతమేర కేసీఆర్‌ను ఊరిస్తోందనుకోవచ్చు. తెలంగాణలో కాంగ్రెస్ తరహాలోనే తన ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ నమూనాను, మైనారిటీలు, రిజర్వేషన్లు వంటి అంశాల పట్ల వైఖరిని జాతీయ స్థాయిలోకి కూడా తీసుకెళ్లటం వల్ల ప్రయోజనముంటుందని కేసీఆర్ భావిస్తుండవచ్చు. కేవలం నాయకత్వ వైఫల్యం వల్ల తప్ప ఎజెండా, రాజకీయ సంస్కృతి పరంగా కాంగ్రెస్ విఫలమవటం లేదని, బీజేపీకి ప్రత్యామ్నాయ ఎజెండా కోసం కాంగ్రెస్‌లో విధానరమైన పునస్సమీక్ష అవసరం

## ఈ విద్యాప్రమాణాలు దేశానికి నమూనా ఎలా అవుతాయి?

జాతీయ ఎచీవ్‌మెంట్ సర్వే 2021 తెలంగాణ రాష్ట్రంలో 3,5 తరగతుల విద్యార్థులకు భాషలు, గణితం, పర్యావరణం, 8వ తరగతి విద్యార్థులకు గణితం, సోషల్ సైన్సెస్, సైన్స్, భాషలు, పదో తరగతి విద్యార్థులకు మోడ్రన్ లాంగ్వేజి, గణితం, సైన్స్, సోషల్ సైన్సెస్, ఇంగ్లీషు భాషపై అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసింది. జాతీయ సగటుతో పోలిస్తే ఒకటి రెండు జిల్లాలు మినహా మిగతా జిల్లాల్లోని విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తక్కువగా ఉన్నాయి.

భాషలు, గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లీషు, పర్యావరణం సబ్జెక్టుల్లో 70 శాతం మంది అవగాహనా స్థాయి సాధారణం, అంతకన్నా తక్కువగా ఉంది. జాతీయ స్థాయి సగటుతో పోలిస్తే రాష్ట్ర విద్యార్థుల సగటు తక్కువగా నమోదైంది. సర్వేలో విద్యార్థులను అడిగిన ప్రశ్నలకు వచ్చిన సమాధానాల్లో సగటున 45 శాతమే సరైనవిగా నమోదయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మరీ తక్కువగా ఉన్నాయి.

**మూడో తరగతి:** విద్యార్థులు చిన్న పదాలు, తరగతి గదుల్లోని గోడలపై పోస్టర్ల అంశాలు, గేయాలు చెప్పలేకపోయినట్లు వెల్లడైంది. గణితంలో మూడంకెల విలువల్ని వాటి స్థానాల ఆధారంగా గుర్తించడంలో ఇబ్బంది పడ్డారు. కూడికలు, తీసివేతలు, భాగాహారాలు చేయలేకపోయారు. పక్షులు, ఆహారం, జంతువులను గుర్తించడంలో విఫలమయ్యారు.

**అయిదో తరగతి:** రోజువారీ జీవితంలో భాగమైన సంఖ్యలను వినియోగించలేకపోయారు. త్రిభుజం, చతురస్రం, దీర్ఘచతురస్రం చుట్టుకొలత, వైశాల్యం గణించలేకపోయారు. సంఖ్యలను చదవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిశుభ్రత, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, విపత్తులపై అవగాహన కొరవడింది.

**ఎనిమిదో తరగతి:** తరగతి గదిలోని వస్తువులు, చతురస్ర, దీర్ఘచతురస్ర వస్తువులు, గది నేల, చాక్‌పీస్ బాక్సు చుట్టుకొలత, వైశాల్యం లెక్కించలేకపోయారు. భాగాహారాలలో వెనుకబడ్డారు. దైనందిన జీవితానికి సంబంధించిన ఆకర్షణీయ సంఖ్యల సమస్యలకు సమాధానాలివ్వలేదు. పటాలపై చారిత్రక ప్రదేశాలు, ప్రాంతాలను గుర్తించలేకపోయారు. 1857 సిపాయిల తిరుగుబాటుపై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయారు.

లేదని ఆయన అభిప్రాయపడుతూండవచ్చు. కానీ ఈవేళ కాంగ్రెస్ మనుగడ సాగించాలంటే తన ఎజెండాను సమూలంగా మార్చుకోవటంతోపాటు బీజేపీని కూడా దాటి దీర్ఘదృష్టిని ప్రదర్శించాల్సిన అవసరముంది. కాబట్టి కేసీఆర్ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, పర్యావరణహిత మౌలిక వసతులు, స్వేచ్ఛా మార్కెట్ సంస్కరణలతో రైతుకు ఆదాయం పెంపు, స్థానిక సాధికారత మొదలైన అంశాలతో కూడిన పై ఎజెండాను పరిగణలోకి తీసుకుని దేశానికి స్వతంత్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే 2047 లక్ష్యంగా బీఆర్ఎస్‌కు విధానాలను ప్రకటిస్తే, కచ్చితంగా భారతదేశానికి ఒక ప్రత్యామ్నాయ జాతీయ దృక్పథమున్న రాజకీయాన్ని అందించినవారవుతారు. తన టార్గెట్ గ్రూపులైన యువత, మహిళలు, రైతుల్ని బీజేపీ కంటే మెరుగైన రీతిలో ఆకట్టుకోగలుగుతారు. ఈ ఎజెండాతో అందరికీ ఎదిగే అవకాశాలను అందించటం, నివారించదగ్గ బాధల్ని తొలగించటం ఇప్పుడున్న సాంకేతిక యుగంలో పూర్తిగా సాధ్యం. విద్య, ఉపాధి నైపుణ్యాలు, ఆరోగ్యం, చట్టబద్ధపాలనకు ఓట్లు ఉన్నాయని ఇప్పటికే రుజువైంది. వాస్తవాల్ని ప్రజలకు వివరిస్తే, టీఆర్ఎస్ పేరు మార్పుపై అయోమయంలో ఉన్న పార్టీ శ్రేణులు, అస్పష్టతలో ఉన్న ప్రజలు కూడా మరింత బలమైన మద్దతును అందిస్తారు. ఎమ్మెల్యేల ద్వారా కాకుండా ప్రజల నుంచి ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, ఓటు వృధా అవుతుంది అనుకుంటూ ముక్కు మూసుకుని నచ్చని అభ్యర్థులు, పార్టీలకు ఓటు వేయాల్సిన అవసరం లేకుండా ప్రతి ఓటుకూ విలువ ఉండేలా దామాషా ఎన్నికల పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల్ని తీసుకురావటంలో భాగమైతే ఈ మార్పు మరింత వేగంగా జరుగుతుంది. ఇవి లేకుండా జమిలి ఎన్నికల వల్ల ఏమీ ప్రయోజనముండదు. భారతదేశం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల్ని అధ్యయనం చేసి సమగ్ర పరిష్కారాల్ని రూపొందించటంతోపాటు వాటిని సాధించేందుకు దశాబ్దాలుగా పోరాడుతున్న లోక్‌సత్తా జేపీ లాంటి వారి సేవల్ని వినియోగించుకోవటం మేలు. కేసీఆర్ వినటానికి సిద్ధమైతే పరిష్కారాలపై నచ్చచెప్పటానికి తాను సిద్ధమని జయప్రకాష్ నారాయణ్ ఇప్పటికే ప్రకటించారు. అలాంటివారి లోతైన కృషితో రూపొందిన ఈ ఎజెండాతో వెళ్తే, మిగిలిన రాష్ట్రాల్లో బీఆర్ఎస్ తక్షణ గెలుపోటములు ఎలా ఉన్నా విస్తృత చర్చను లేవనెత్తుతూ తెలంగాణలో బలాన్ని కాపాడుకుంటూ భారత్‌ను గెలిపించే చరిత్రాత్మక రాజకీయంలో కేసీఆర్ భాగమవగలుగుతారు. స్వతంత్రం వచ్చిన వందేళ్లనాటికైనా భారత్ నుండి పరాధీన, యాచక ప్రవృత్తిని పారదోలి తలెత్తుకుని బతికే తరం రూపొందటానికి దోహదం చేసినవారవుతారు. నినాదంగా, రాజకీయ ఎత్తుగడగా మిగిలిపోకూడదనుకుంటే, ఒక దీర్ఘకాలిక కృషి, ప్రత్యామ్నాయ జాతీయ రాజకీయ దృక్పథం బీఆర్ఎస్‌కు అవసరం.

(బీఆర్ఎస్‌పై జేపీ ఫస్ట్ రియాక్షన్‌ను
JP LOKSATTA యూట్యూబ్ చానల్‌లో చూడండి)

# పాన్ ఇండియా కంటెంట్ బలం ఉందా?

**పాన్ ఇండియా సినిమాలాగా కంటెంట్ బలంతో బీఆర్ఎస్ హిట్ అవుతుందని మంత్రి కేటీఆర్ అంటున్నారు. తెలంగాణ అభివృద్ధి నమూనాను ఇతర రాష్ట్రాల్లో ఎలా రిసీవ్ చేసుకుంటారన్న అంశాన్ని అలా ఉంచితే.. ఆ కంటెంటే సక్రమంగా లేదన్నది అసలు విషయం. వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు, నివారించదగ్గ క్లేశాల్ని తొలగించేందుకు కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందరికీ అందించకుండా, అవినీతిని అంతం చేసే నిర్దిష్ట ఏర్పాటు లేకుండా, వ్యవసాయాన్ని లాభసాటి చేయకుండా, చిన్న పట్టణాలను అభివృద్ధి చేయకుండా, ప్రభుత్వోద్యోగులకు-సామాన్య ప్రజలకు మధ్య అంతరం తగ్గించకుండా, అధికారాన్ని స్థానిక ప్రభుత్వాలకు వికేంద్రీకరించకుండా, చట్టం అందరికీ సమానంగా వర్తింపచేయకుండా, వేగంగా, చౌకగా ప్రజలకు న్యాయం అందించే ఏర్పాటు చేయకుండా ఏమి కంటెంట్ ఉన్నట్లు? హుజూరాబాద్, మునుగోడుల్లోలా డబ్బు ఖర్చు పెట్టి ఓట్లు కొనుగోలు చేయటమా కంటెంట్ ఉండటమంటే? దేశంలో అత్యధిక జనాభా వ్యవసాయంలోనే కొనసాగటం, లాభసాటి ఆదాయం లేకుండా గతంలో లాగానే వ్యవసాయం చేయటం, వ్యవసాయం మీద ఆదాయంతో సంబంధం లేకుండానే సాగునీరు అందించేందుకు భారీ ఎత్తిపోతల పథకాలను నిర్మించటమా కంటెంట్ ఉండటమంటే? ముఖ్యమంత్రి సెక్రటేరియట్‌కు వెళ్లకుండా కూడా, ప్రజలకు అందుబాటులో లేకుండా ఉన్న స్థాయిలో అధికార కేంద్రీకరణ చేయటమా కంటెంట్ ఉండటమంటే? ఒక్క మహిళ కూడా మంత్రిమండలిలో లేకుండా ఐదేళ్లపాటు పాలించటం, మహిళా కమిషన్ నియామకాన్ని కూడా ఏళ్ల తరబడి వాయిదా వేయటమా కంటెంట్ ఉండటమంటే? గుజరాత్ నమూనాతోపాటు ఆప్ ఢిల్లీ నమూనాను పంజాబ్‌లో ప్రచారం చేసి గెలుపొందినట్లు తెలంగాణ అభివృద్ధి నమూనాతో వెళ్తామని చెబుతున్నారు. ఆప్ విద్య, ఆరోగ్యంలో కొంత గట్టి ప్రయత్నం చేసింది గదా! మరి తెలంగాణలో ఆ దిశగా టీఆర్ఎస్ ప్రభుత్వం ఏం ప్రయత్నాలు చేసింది?**

# 'పార్టీ టైమ్... కామెడీ-సీరియస్!

**- సరికొండ చలపతి**

'జనం కమేడియన్లని సీరియస్‌గా, పొలిటీషియన్లని కామెడీగా తీసుకుం టున్నారని..' .... ఓ అమెరికా పెద్దమనిషి చెప్పి దాదాపు వందేళ్ల య్యింది.. ఇంకా అదే ట్రెండ్ కొనసాగుతున్నట్టుంది... ఇది చూడండి..

....

ముందస్తు అరెస్టులు, హైటెక్ సిటీ చుట్టుపక్కల ప్రాంతాల్లో బందో బస్తు.. 100 మంది అదుపులోకి.. 3 గంటల పాటు ఉద్రిక్తత.. 1,500 మంది పోలీసుల మోహరింపు.. బారికేడ్లు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు...

**కామెడీ షో ప్రశాంతంగా పూర్తయింది..**

- ఇదీ హైదరాబాద్‌లో జరిగిన మునావర్ స్టాండప్ కామెడీ షో తీరు.

....

అక్టోబర్ 5న జాతీయ పార్టీ ప్రకటన గురించి ఐక్యరాజ్యసమితి అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది.. ట్రంప్, పుతిన్, కిమ్ లాంటి వాళ్లు కేసీఆర్ బ్యాచ్‌తో టచ్‌లో ఉన్నారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ 'ప్రపంచ రాష్ట్ర సమితి' (పీఆర్ఎస్) పార్టీ పెడితే మన పరిస్థితి ఏమిటీ అని పలువురు దేశాధినేతలు తర్జన భర్జన పడుతున్నారు.. పీఆర్ఎస్‌లో ఉండడమా, స్వతంత్రంగా ఉండడమా అనే దానిపై చర్చలు జరుగుతున్నాయి.

- ఇదీ కేసీఆర్ జాతీయ పార్టీ బీఆర్ఎస్ ప్రకటన తర్వాత సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న మెసేజ్.

**ఇట్లా.. కామెడీ సీరియస్‌గా.. పొలిటిక్స్ కామెడీగా!**

**'మన వాళ్లు వట్టి వెధవాయిలు..'**

ఇందిరమ్మ సృష్టించిన ఎమర్జెన్సీ చీకట్లలో ఉదయించిన 'జనతా'లాగా.. పంచమ స్వరాన్ని దళిత శంఖారావంలా దేశవ్యాప్తం చేయ ప్రయత్నించిన కాన్షీరాం బీఎస్పీ లాగా...

చాలాకాలం తర్వాత అలా దేశవ్యాప్త సంచలనం..

మోదీ సామ్రాజ్యాన్ని కూలదోయడానికి విజయ దశమి నాడు గాండీవం ఎత్తిన కేసీఆర్ జాతీయ పార్టీ ప్రకటన..

మన తెలుగు ఎన్టీయార్ కల 'భారతదేశం' పార్టీ భావనను ఆయన వీరాభిమాని కేసీఆర్ దేశవ్యాప్తం చేసే అద్భుత సన్నివేశం..

దీన్ని కొంతమంది.. అదీ తెలుగువాళ్లు.. మరీ తెలంగాణ బిడ్డలు.. ఇలా ట్రోల్ చేయడం ఆశ్చర్యమే మరి! జాతీయ పార్టీలు చిన్న మునుగోడు పైనే పడుతుంటే.. జాతీయవాదాన్ని ఎత్తుకున్న తెలుగోడిని మరో తెలుగోడు ప్రశంసించడం మాని.. పరిహసించడమా!

**'ముందుకు పోతానంటే ఎందుకు నీ విరగబాటు ఇటనే నిలుచో మందురు..'** అని శ్రీశ్రీ..

**'మన వాళ్లు వట్టి వెధవాయిలోయ్'** అని గురజాడ గిరీశం ఊరికే అన్నారా...

**పునర్భూదోషం...**

జ్యోతిష్యులు కూడా దీన్ని వదలకపోవడం మరింత చిత్రం.. తెలుగు నేలపై ఆధ్యాత్మిక వైభవానికి కేసీఆర్ ఎంత చేస్తున్నారో మనకు తెలుసుగా.. శుభం పలకవచ్చుగా!

ధనర్లగ్నంలోనే పార్టీ ప్రకటన జరిగిందట... ఇది అచ్చంగా రాజులు మరో సామ్రాజ్యంపై దాడి చేసేటప్పుడు పెట్టే ముహూర్తం... యుద్ధానికి ప్రతీక, విజయానికి సూచిక.. తిరుగులేదు అంటూనే.. కాస్త లో-వాయిస్‌లో కొర్రీలు చూపుతున్నారు.

**దుర్ముహూర్త స్పర్శా దోషం ఉంది., పునర్భూదోషం ఉంది. పలుమార్లు శ్రమించాల్సిందే, నల్లేరుపై నడక కాదు కష్టపడాల్సిందే..** అంటున్నారు.

శాల్.. అదేమీ లేదు వ్యక్తిగత జాతకం అద్భుతం అని కాస్త హై-వాయిస్‌లో దబాయిస్తున్న ప్రో-జోస్యులూ ఉన్నారనుకోండి!

**ఇదో 'స్టార్టప్' తరహా...**

ఇక సామాజిక మాధ్యమాల్లో తిష్టవేసిన విశ్లేషకుల ముచ్చట్లు రకరకాలు.. మచ్చుకు ఒకటి..

- మన దగ్గర ఒక్క పార్లమెంట్ ఎన్నికకయ్యే ఖర్చులో బయటి రాష్ట్రాల్లో నాలుగైదు పార్లమెంట్ నియోజకవర్గాలు లాగించవచ్చు. బాగా వనరు లున్న పార్టీ కనుక చిన్నా చితకా పార్టీలను ఆకర్షించవచ్చు. వారికి ఆర్థిక సాయం చేయవచ్చు. ఇదో స్టార్టప్ తరహా వ్యవహారం.. ఇది స్టార్టప్‌ల కాలం కదా.. చూద్దాం ఇది సక్సెస్ అవుతుందో లేదో.. అని విశ్లేషణ.

**బాల 'పిట్టకథ'**

ఇంకాస్త కరడు గట్టిన తెలంగాణ వాదులు ఓ పిట్ట కథ చెబుతున్నారు. ఓ పిల్లాడిని తల్లి పిలిచి సీసా మూత తియ్యరా అంది. పలుమార్లు ప్రయత్నించాడు. అక్కడే ఉన్న అన్న, దాన్ని తీసుకుని ఓ రెండుమార్లు ప్రయత్నించి మూత తీసి హీరోలా తమ్ముడి వైపు చూసి వెళ్లాడు. తమ్ముడు తల్లిని అడిగాడు, అన్న ఎలా తీయగలిగాడు అని.. నువ్వు చాలా చాలా సార్లు ప్రయత్నించినప్పుడే అది లూజయింది. మరోమారు నువ్వు ప్రయత్నించినా వచ్చేది అని నవ్విందట!

కేసీఆర్‌దీ ఇదే తంతు. ఎన్నో దశాబ్దాల తరబడి జరిగిన తెలంగాణ ఉద్య మం కీలక దశలో జొరబడి పేరు కొట్టేశాడు అంటూ వెటకారం చేస్తూ... ప్రతిసారీ అన్ని సీసాల మూత తియ్యడం సాధ్యం కాదు... అని నర్మగర్భం గా, కాస్త వ్యంగ్యంగా.. పక్కోడి ప్రయత్నాలు, ఉద్యమాలు, ఆత్మబలిదా నాలు లేకుండా సాధ్యం కాదని సీరియస్‌గా వ్యాఖ్యలు చేస్తున్నారు..

**నామ్‌కే వాస్తే..**

ఈ సీసాల గొడవ ఇలా ఉండగా..

టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌కు పేరు మార్పుపై.

**'.. సీసా లేబుల్ మార్చేస్తే సారా బ్రాందీ అగునే సిరి సిరి మువ్వా..'**

శ్రీశ్రీ పాటేసుకుంటున్నారు..

....

**గౌర్రెలెలా?**

కొందరు ఇంకాస్త ముందుకెళ్లి ఇలా డౌటేస్తున్నారు...

ఫర్ సపోజ్... మన బీఆర్ఎస్ ఢిల్లీ పీఠం ఎక్కిందనుకుందాం...

+ రైతులందరికీ ఉచిత విద్యుత్ ఇచ్చుకుంటాం.

+ కమీషన్లకు కక్కుర్తి పడకుండా కార్పొరేట్లకు రుణ మాఫీ రద్దు చేసి.. దానికి బదులు దేశమంతటా దళితబంధు, రైతుబంధు ఇచ్చుకుందాం.

+ రాష్ట్రానికో కాళేశ్వరం కట్టుకుందాం.. ఊర్లన్నీ పచ్చగ చేసుకుందాం..

.. కానీ, మన గొర్రెల పథకం ఉందిగా.. దేశమంతా గొర్రెలెలా పంచడం? ఇక్కడ మనకు సరిపోకే పక్క రాష్ట్రాల నుంచి తెస్తున్నామాయే!

**(కర్టెసీ: సాక్షి)**

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## ఓట్ జుగాడ్: నవంబర్ 2022

### ఓటర్లకు కనిపించని నిజాలు -1

ప్రశ్న: "ఎన్నికల వ్యయాన్ని నియంత్రించవలసిన ఎన్నికల కమిషన్ బాధ్యతను విస్మరించి" మునుగోడు (MLA) నియోజకవర్గం ఉపఎన్నికలో పోటీచేసే ప్రతీఅభ్యర్థికీ, ఖర్చులపరిమితిని రూ.28 లక్షలనుండి రూ.40 లక్షలకు పెంచడం అవసరమా?

జుగాడ్ఓటరుగా నా సమాధానం: ఎంతమాత్రమూ పెంచవలసిన అవసరం లేదు!ఎందుకంటే, మొత్తం 47 మంది అభ్యర్థులలో గుర్తింపు పొందిన నాలుగో ఐదో పార్టీలు మినహా మిగిలిన వారంతా స్వతంత్ర అభ్యర్థులే. మొత్తం అభ్యర్థుల పేరిట కేటాయించబడిన డబ్బు రూ. 47 X 40 లక్షలు = 1880 లక్షలు (రూ. 20 కోట్లనుకుందాం)

ఒక స్వతంత్ర అభ్యర్థికి ఆ నియోజకవర్గంలో నమోదయి ఉన్న 10 మంది ఓటర్ల ప్రతిపాదన ఉండితీరాలి. అనగా, ఐదారుగురు స్వతంత్ర అభ్యర్థులు తమకు మద్దతు ప్రకటించిన ఓటర్లకు భాగస్వామ్యం కలిగించి వారిని వాహకులుగా ఉపయోగించుకుంటూ, అత్యంత గోప్యంగా, నిఘావ్యవస్థల కన్నుగప్పి, ప్రముఖ పార్టీల ఓట్ల వ్యాపారంలో "సహాయం" చేసే వీరంతా 'మనోళ్లే' (ఓటర్లే) అని గుర్తిస్తే చాలు!!! ఒకేసారి రూపాయలు 2వేలు/5వేలు లేదా 10వేల స్వంత విరాళాలతో మన పార్టీ నిర్మాణమే సకల జన రక్ష!

21వ శతాబ్దపు రాజకీయ వైతాళికుడిగా అభివర్ణించదగిన ఒక ఓటర్ మహానుభావుడికి "రాజకీయం అంటే ఒక పవిత్రమైన వ్యాసంగం" అయితే, మరికొందరి ఓటర్లకు "రాజకీయం అంటే ఒక లక్ష రూపాయిల పెట్టుబడితో కోటిరూపాయలు సంపాదించే లాభసాటి వ్యాపారం". కానీ మనదేశంలోని దాదాపు 50 కోట్లమంది సామాన్య పేద-మధ్యతరగతి-రెక్కాడితేగానీ డొక్కాడని ఓటర్లు నిత్య జీవితంలో చేసే జీవన్మరణ వ్యాయామం పేరే జుగాడ్ రాజకీయం!

**రండి! జుగాడ్ ఓటర్ల స్వచ్ఛ రాజకీయానికి స్వాగతం పలకండి!**

Please contact: (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your Contact. Cell No:

పదివేల రూ.. విరాళమిచ్చిన భావిభారత భాగ్య విధాతలు: M.Parthasarathy (A Jugaad Voter and Karyakarta) (2) K.Subrahmanyam (3) Col.P.V.Ramanarao (4) U.Subba Rao (5) C.K.Murthy (6) Syed Ansari (7) Smt.D.Kasturi (8) K.Srinivas Murthy (9) Dr.Vamsi Raj (10) Dr. G.Abbaiah

ADVT

# మునుగోడు సమస్యలపై చర్చ ఏదీ?

మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికలో చట్టవిరుద్ధంగా డబ్బు ప్రవాహం, దూషణలు తప్ప సమస్యల ప్రస్తావన-పరిష్కారాల చర్చలేదని, ఇలాంటి ఎన్నికల వల్ల ఒరిగేదేమిటని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు ప్రశ్నించారు. సమస్యల పరిష్కారాలు చెప్పాకే పార్టీలు, అభ్యర్థులు ఓట్లు అడగాలన్నారు. లోక్‌సత్తా పార్టీ రూపొందించిన మునుగోడు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సంబంధించిన ప్రజాప్రణాళికను ఆయన హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. చౌటుప్పల్, చండూరుల్లో ఫ్యామిలీ డాక్టర్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పోడు రైతులకు పట్టాలివ్వాలని, చర్లగూడెం-కిష్టరాంపల్లి భూనిర్వాసితులకు తక్షణమే పరిహారం చెల్లించాలని, ఫ్లోరైడ్ నివారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మల్కాపురం జౌళి పరిశ్రమను విస్తరించి అన్ని మండలాల్లో చేనేత క్లస్టర్ల ఏర్పాటు, చండూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని, అసంపూర్తిగా ఉన్న వంతెనలు, రోడ్లను, పంచాయతీ





భవనాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, మంచి ప్రమాణాలతో విద్యను అందించాలని అన్నారు. విచ్చలవిడిగా డబ్బులు, మద్యం, బహుమతులు, పదవులు పంచుతూ ప్రచారం చేయటం ఎన్నికల వ్యవస్థను అపహాస్యం చేయటమేనన్నారు. వివిధ మాధ్యమాల ద్వారా ఓటుహక్కు సద్వినియోగంపై చైతన్యం కల్పిస్తామన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్, ఉమ్మడి నల్గొండ ఇంఛార్జి తీగలపల్లి రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి మొండి వైఖరి వీడాలి

హైకోర్టు తీర్పును, రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అమరావతిని రాజధానిగా ప్రకటించాలని, కొన్ని కార్యాలయాలను వివిధ జిల్లాలకు వికేంద్రీకరించాలని, అసలైన వికేంద్రీకరణ కోసం జిల్లా, స్థానిక ప్రభుత్వాలకు అధికారాన్ని బదిలీ చేయాలని, ఇప్పటికే భూసమీకరణ జరిగినందున అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీ అభివృద్ధి చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన విలువైన సూచనను పాటించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజ్ఞప్తి చేశారు. సీఎం మొండి వైఖరి వీడాలన్నారు. అమరావతి రైతుల పాదయాత్ర పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సక్రమంగా లేదని, ముఖ్యమంత్రి సరైన సంకేతాలనివ్వకపోవటంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పాదయాత్ర చేస్తున్న రైతులను బాబ్జీ రాజమహేంద్రవరం కొవ్వూరు వద్ద కలిసి వారి వాదనలకు సంఘీభావం తెలిపారు.

**ముంపు ప్రాంతాల్లో చర్యలకు కదిలిన మునిసిపల్ యంత్రాంగం**

ఇటీవల అనంతపురం జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు రాయదుర్గం పట్టణంలో కూడా పలు ప్రాంతాలు ముంపుకి గురయ్యాయని, జనజీవనం అస్తవ్యస్తమైందని, పలు దుకాణాల్లో సరకులు, ఇళ్లలోని ఆహారధాన్యాలు, చుట్టుపక్కల పంటపొలాలు దెబ్బతిన్నాయని లోక్‌సత్తా పార్టీ నేత వెంకటరమణ బాబు అన్నారు. వర్షపు నీటిని మళ్లించేందుకు, ఇక మీదట వరదనీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం అమలు చేయాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఎంఆర్‌వోను కలిసి విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం పట్టణంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, సీనియర్ సిటిజన్లు, న్యాయవాదులు, వివిధ రంగాల పట్టణ ప్రముఖులతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలతో మునిసిపల్ యంత్రాంగం పట్టణంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించింది. కలెక్టర్ స్పందనకి ధన్యవాదాలని, తాత్కాలిక చర్యలతోపాటు శాశ్వత పరిష్కారం కోసం ఏర్పాట్లు చేయాలని బాబు కోరారు.

**మీటర్ రీడింగ్‌పై వినియోగదారులు కూడా ఫిర్యాదు చేయాలి**

విద్యుత్ మీటర్ రీడింగ్ సకాలంలో తీయకపోవటం వల్ల వినియోగదారులు రెట్టింపు ధర విద్యుత్ శాఖకు చెల్లించాల్సి వస్తోందని పల్నాడు జిల్లా లోక్‌సత్తా పార్టీ నేత, వినియోగదారుల సంఘం ఇంఛార్జి మురికిపూడి ప్రసాద్ అన్నారు. వంద యూనిట్లకు 30 రోజులలోపు తీస్తే రూ.3.60 చొప్పున ఉంటుందని, ఆలస్యంగా తీయటం వల్ల ఒకరోజుకు 2 యూనిట్లు పెరిగినప్పటికీ విద్యుత్ ధరల శ్లాబ్ రూ.6.90కి మారుతోందని చెప్పారు. సమస్యను విద్యుత్ శాఖ ఏడీ ఆఫీసులో తెలియచేశామని, వినియోగదారులు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు.

# మరింత లోతైన.. బలమైన చట్టాలు కావాలి

## డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌తో పద్మనాభరెడ్డి ముఖాముఖి (రెండో భాగం)

**ప్రశ్న: రాజ్యాంగంలో గ్రామ సభల గురించి పేర్కొన్నారు. ఆ గ్రామానికి ఏం కావాలనేది ఆ గ్రామంలోని వాళ్లందరూ కూర్చుని చర్చించాలి. అవసరమైన పనులకు ప్రభుత్వం నిధులు ఇవ్వాలి..కానీ ఈ రోజు అధికారాలన్నీ కత్తిరించేశారు..నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తున్నారు. దీన్ని ఎలా చూడాలి?**

**జేపీ:** గ్రామ సర్పంచ్ లేదా మున్సిపల్ చైర్మన్‌ను మీ ఆధీనంలో ఉన్న మనిషిలాగా చూస్తే అది స్థానిక ప్రభుత్వం ఎలా అవుతుంది. ప్రకాశం పంతులు రాజమండ్రి మున్సిపల్ చైర్మన్‌గా, తమిళనాడులో రాజగోపాలాచారి సేలం మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ఉత్తరాదిన సర్దార్ పటేల్ అహ్మదాబాద్ మున్సిపల్ చైర్మన్, నెహ్రూ అలహాబాద్ మున్సిపల్ చైర్మన్, చిత్తరంజన్ దాస్, సుభాష్‌చంద్రబోస్ కలకత్తా మేయర్‌లుగా పనిచేశారు. అందరూ అక్కడి నుంచి వచ్చిన వారే. నాయకత్వం ఇస్తున్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధంగా ఇదంతా చేస్తున్నారు. దీంతో ప్రజలు కూడా పనులన్నీ హైదరాబాద్ నుంచే జరుగుతున్నాయి.. ఎమ్మెల్యేనే రాజు అనే భావనలోకి వచ్చేశారు. నేను కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా ఉండగా కార్పొరేషన్ సమావేశాలకు వెళ్లేవాడ్ని కాదు. స్థానిక సంస్థల వ్యవహారంలో ఎమ్మెల్యే జోక్యం ఎందుకు? సమావేశాలకు వెళితే ఎమ్మెల్యే పెత్తనమే ఉంటుంది..ఇది సరికాదు..వాళ్లకు ఏం కావాలో వాళ్లు నిర్ణయించి ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటి గురించి ఎమ్మెల్యేలను అడిగితే వారు చట్టబద్ధంగా వాటి కోసం ప్రయత్నం చేయాలనేది నా భావన. అందుకే అప్పుడు మేయర్ ప్రత్యేకంగా ఆహ్వానించినా ఈ కారణాన్ని వివరించి సమావేశాలకు దూరంగా ఉండేవాడ్ని. ఈ వేళ గ్రామసభ పేరుకే ఉంది. ప్రభుత్వం గ్రామాల్లో ఏదో ఒక కార్యక్రమం నిర్వహించినా, మున్సిపాలిటీ నడిచినా కానీ, ఎమ్మెల్యే పెత్తనం




రావాలి. మీ ప్రభుత్వం ఎలా ఉందో.. అలా వాళ్లంతా హుందాతనంతో, గౌరవంతో సంతోషంగా ప్రభుత్వం నిర్వహించాలి. అనుభవం పొందాలి ప్రజలకు సేవలు అందించాలి. ఆ రకమైన ఏర్పాట్లు కావాలి. అంతే కానీ మేం ఆర్డర్స్ ఇస్తే నువ్వు చేసే వాడివి అనే భావనలో రాష్ట్రాలు ఉంటే, మేం ఢిల్లీ నుంచి ఆర్డర్స్ ఇస్తాం మీరు అమలు చేయండి అని కేంద్రం అంటే అది సాధ్యం అవుతుందా? ఇదీ అంతే. స్థానిక సంస్థలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. ఢిల్లీ నుంచి వచ్చే నిధులు తప్ప రాష్ట్రాలు నిధులు ఇవ్వడం లేదు. ఆ నిధులను కూడా కొన్ని రాష్ట్రాలు కలిపేసుకుంటున్నాయి. గ్రామాల్లో ఏం పనులు చేయాలో వారే నిర్ణయించి నిధులు లేకుండా, ఆయన ఆశీస్సులు లేకుండా, ఆయన ఆదేశం లేకుండా చీమ చిటుక్కుమనేది లేదు. కాబట్టి రాజ్యం ఎమ్మెల్యేలది. గ్రామ సభలు, మున్సిపాలిటీలు కేవలం ఉత్సవ విగ్రహాలు. హైదరాబాద్ నగరంలో ఒకప్పుడు ప్రత్యక్ష ఎన్నికల్లో దేశంలో అతిపెద్ద ఎన్నిక హైదరాబాద్ మేయర్ ఎన్నిక. ప్రత్యక్షంగా మేయర్‌ను ఎన్నుకున్నాం. ప్రధానమంత్రి వస్తే నల్లగౌను వేసుకుని ఆహ్వానించడం తప్ప ఏ విధమైన అధికారం లేదు. అలా కాకుండ బాధ్యత, అధికారం ఇవ్వండి.

**ప్రశ్న: చిన్న చిన్న కారణాలతో ఈ రోజు సర్పంచ్‌ను పదవి నుంచి తొలగిస్తున్నారు. ఈ విధానం సరైందేనా?**

**జేపీ:** తప్పు చేస్తే దండించే అధికారం ఉండొచ్చు కానీ

రాజకీయ కారణాల వల్ల దండిస్తే ఎన్నికైన ప్రభుత్వం ఎందుకు ? ఢిల్లీలో కూర్చున్న వాళ్లు మీ ఎమ్మెల్యేలు, మంత్రులను తీసిపారేస్తానంటే మీ ప్రభుత్వం నడుస్తుందా? నేను తూర్పుగోదావరి జిల్లాలో కలెక్టర్‌గా ఉండగా కొత్తపేట గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు. అప్పుడు రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉంది. చిన్న చిన్న కారణాలతో అతడ్ని పదవి నుంచి తప్పించేందుకు నా పై ఒత్తిడి తెచ్చారు. దాంతో వాళ్లపై నేను కోప్పడ్డాను..ఎన్నికైన ప్రజాప్రతినిధిని తప్పించమని అడుగుతున్నారు..ఈ రోజు ఈ పార్టీ ఉండొచ్చు.. రేపు మరో పార్టీ ఉండొచ్చు..ఇది ప్రజాస్వామ్యం కాదని బుద్ధిచెబితే అప్పుడు ఊరుకున్నారు. ఏదో ఒక రకంగా ఉన్న అధికారాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడడమే తప్ప ప్రజా ప్రయోజనాల కోసం సార్థకం చేద్దామని లేదు. స్థానిక ప్రభుత్వాలు ఊరికే కాగితం మీద తప్ప దాన్ని ఎలా అమలు చేద్దామనేది లేదు. రాజ్యాంగంలో అధికారం మాత్రం నిర్వచించకుండా వదిలేశారు. రాష్ట్రాలు చచ్చినా ఇవ్వమని భీష్మించుకుని కూర్చున్నాయి.

**ప్రశ్న: హైదరాబాద్ కార్పొరేషన్ పాలకవర్గం మూడేళ్ల క్రితం ఎన్నికైంది. ఇప్పటి వరకు వార్డు కమిటీలు ఏర్పాటు చేయలేదు. వార్డు కమిటీలు ఉంటే నగర ప్రజలకు ఇంత ఇబ్బంది ఉండేది కాదు. ప్రజల సహకారం లేకుండానే పనులు చేస్తున్నారు. వార్డు కమిటీలకు ఉన్న ప్రాధాన్యం ఏంటి?**

**జేపీ:** మూడు లక్షల జనాభా దాటిన మున్సిపాల్టీల్లో వార్డు కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. 30 లేదా 40 వేల జనాభాకు ఓ వార్డు కమిటీ ఉండాలని పేర్కొన్నారు. అయితే బొంబాయిలో గతంలో 15 లక్షల జనాభాకు ఓ వార్డు కమిటీ పెట్టారు. రాజ్యాంగం చెప్పింది కాబట్టి కాగితం మీద నామమాత్రంగా ఏర్పాటు చేశారు. ఈ వార్డు కమిటీల్లో కూడా ఇష్టం వచ్చిన వ్యక్తులను నియమిస్తున్నారు. ఏమీ ఆశించకుండా సమాజం కోసం మంచి చేసే వాళ్లు, పరిష్కారంలో భాగం అయ్యేవారు సమాజంలో చాలా మంది ఉన్నారు..వారందరినీ ఈ కమిటీల్లో భాగస్వాముల్ని చేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయి. మీ ఏరియాలో మ్యాన్‌హోల్స్ కావొచ్చు..రోడ్ల మైనర్ రిపేర్లు, తాగునీటి సరఫరా కావొచ్చు..ఇలా ఏది ముఖ్యమో మీ కమిటీ నిర్ణయించి మేం ఇచ్చే నిధులతో ఆ పనులు చేసుకోండని చెబితే సంతోషంగా చేస్తారు. పదిరూపాయలు ఇస్తే మన పని అనుకున్న తర్వాత జేబులోనుంచి మరో పది రూపాయలు తీసి ఖర్చు పెడతారు. పని నిజాయితీగా, బాగా జరుగుతుందని నమ్మకం ఉన్న తర్వాత సమాజం కూడా ముందుకు వస్తుంది. నేను డబ్బులు ఇందుకు కడుతున్నాను..ఆయన్ను ఇందుకోసం ఎన్నుకున్నాను. జరగకపోతే బాధ్యత ఆయనది. జరక్కపోతే నష్టం నాకు అని అర్థం అయితే అప్పుడు ప్రజాస్వామ్యం పనిచేస్తుంది..ఓటు సరిగ్గా వేస్తాం. అది లేకపోతే డబ్బులకు అమ్ముడుపోతాను..తాయిలాల కోసం ఓటు ఇచ్చేస్తాను. ఈ దేశంలో జరుగుతోంది..అదే. అధికారాన్ని ప్రజలకు దగ్గరలో పెట్టి ప్రజల ఓటుకి, జరిగే పనికి సంబంధం లేకుండా తెగ్గొట్టడం వల్ల ప్రజాస్వామ్యాన్ని నామమాత్రం చేశాం. కాబట్టి మనకు పనులు జరగాలన్నా అధికార యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నా, ప్రజాస్వామ్యంలో ప్రజలకు పౌరసత్వం అంటే అర్థం కావాలన్నా, ఎన్నికల్లో ధన ప్రభావం తగ్గాలన్నా , అధికారం జనం చేతిలో పెట్టడం మినహా మరో మార్గం లేదు. గాంధీగారి పేరు చెబుతాం. ఆయన ఫొటోకు దండ వేస్తాం తప్ప ఆయన ఎలాంటి దాన్ని కోరారో పూర్తిగా మర్చిపోయాం. స్వరాజ్యం అంటే కొద్ది మంది పెద్దలు గద్దెనెక్కడం కాదు..సామాన్యులకు తన జీవితం మీద అధికారం రావాలన్నారు. సామాన్యులతో సంబంధం లేని రాజకీయాలు నడుపుతున్నాం. కాబట్టి మూడో అంచె ప్రభుత్వాలను సరిగ్గా ఏర్పాటు చేస్తే తప్పు జరిగితే బాగు చేసుకుంటారు..జనం నిలబడతారు..మిమ్మల్ని ఎన్నుకున్నప్పుడు గొప్పోళ్లయితే..స్థానిక సంస్థల ప్రతినిధులను ఎన్నుకుంటే చెడ్డొళ్లు ఎందుకు అవుతారు..ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిని ఎన్నుకుంటే చాలా విజ్ఞులా? పంచాయతీలో నాయకుడ్ని ఎన్నుకుంటే దుర్మార్గులా? ఇదేమి విడ్డూరమైన ఆలోచన.

**ప్రశ్న: లోక్‌పాల్ కోసం దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది..లోక్‌పాల్‌ను ఏర్పాటు చేశారు. దానివల్ల ఎంతవరకు ప్రయోజనం చేకూరింది?**

**జేపీ:** రంగు, రుచి, వాసన లేని లోక్‌పాల్ అమల్లోకి వచ్చింది. చాలా ఏళ్ల పాటు లోక్‌పాల్ నియామకం జరగలేదు. చివరికి సుప్రీంకోర్టు ఓ గడువు పెడితే అప్పుడు నియామకం చేశారు. ఆ చట్టం కోసం నేను పోరాడాను..చట్టాన్ని రూపకల్పన చేశాను.. 2జీ స్పెక్ట్రంలో పోరాడి విజయం సాధించాను, అవినీతి వ్యతిరేక ఉద్యమంలో నా పాత్ర కొంత ఉంది..అలాంటి నాకే..ఈ రోజు లోక్‌పాల్ ఎవరో తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉత్సవ విగ్రహంగా మార్చేశాం. లోక్‌పాల్ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేశారు..అలాగే దేశంలో అనేక ఉద్యమాలు జరిగాయి..అయితే అవి ఎందుకు చేస్తున్నామో తెలియకుండా నినాదాలు ఇవ్వడం, రాస్తారోకోలు చేయడం, అరుపులు, పెడబొబ్బలు, తిట్లు శాపనార్థాలు తప్ప ఆచరణ సాధ్యంగా ఫలితాల్ని ఇచ్చే రీతిలో , ముందు చూపుతో, విచక్షణతో ప్రయత్నం చేయడం లేదు. అయితే చేసిన నాడు ఫలితాలు వస్తున్నాయి. లోక్‌పాల్ వల్ల దేశానికి వచ్చిన ఏకైక ఫలితం స్పెక్ట్రమ్ కేటాయింపుల్లో కాంపిటిటీవ్ బిడ్డింగ్. స్పెక్ట్రమ్ కేటాయింపులు అవినీతి లేకుండా జరుగుతున్నాయి. అదొక్కటే ఫలితం తప్ప అవినీతి పోయే ఏర్పాటు ఇంకా జరగలేదు. రాజకీయ సంకల్పం లేకుండా కొంచెం ఇంగిత జ్ఞానం, ముందు చూపు లేకుండా వ్యవస్థల నిర్మాణంలో కానీ దాని ఉపయోగంలో కానీ ఫలితాలు రావు. నా దృష్టిలో దీనికి కారణం కూడా చెబుతాను. నేను ఆనాడే ప్రధానమంత్రి గారికి చెప్పాను..దేశానికి

చెప్పాను..పరిపాలనా సంస్కరణల సంఘంలో లోక్‌పాల్‌కు సంబంధించిన అధ్యాయం నేనే రాశాను. అందులో ప్రధానమంత్రి ఇందులో వద్దని రాశాను. కారణం ఏంటంటే.. దేశానికి, ప్రజాస్వామ్యానికి ఒకే ఒక చిహ్నం ప్రధానమంత్రి. ఏపార్టీ అనేది తీసేయండి. ఎవరైన ఓ వ్యక్తి ఆరోపణ చేస్తే ప్రధానమంత్రి మీద విచారణ అని అన్నట్టయితే రేపొద్దున ఏమీ లేదని తేలినా కూడా విచారణ సమయంలో దేశం గందరగోళం అయిపోతుంది. ప్రపంచం మొత్తంలో కూడా మనదేశం గందరగోళం అయిపోతుంది. ఆ ఒక్క పదవిని మాత్రం పార్లమెంటు చేతిలో పెట్టండి. నిజంగా పనికి రాని వాడు అయితే జనాన్ని ఉద్యమాలు చేయనివ్వండి. అంతేకానీ ఈ రకంగా ప్రధానమంత్రిని లోక్‌పాల్ పరిధిలో పెట్టబోకండని చెప్పా. ఇదే విషయాన్ని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కూడా చెప్పాను. ఆయనా ఓ మధ్యతరగతి మనిషి, వ్యక్తిగతంగా మచ్చలేని మనిషి. నాకేం మచ్చ లేదు కాబట్టి చేసుకోండి ఎంక్వైరీ అన్నారు....మీ వ్యక్తిగత విషయం కాదండీ..ఇది వ్యవస్థ విషయం అని నేను చెప్పాను. మన్మోహన్ సింగ్ వ్యక్తిగా అవినీతి పరుడా ? కాదా ? అనేది సెకండరీ. ప్రధానమంత్రి అనే వ్యవస్థను కనుక మనం రోజువారీ ఆటుపోట్ల నుంచి రక్షించకపోతే దేశం నష్టపోతుంది. మీకు నష్టం ఏమీ ఉండదని చెబితే ఇప్పటికే కమిట్ అయిపోయాను, నేను ఒక మాట అన్న తర్వాత వెనక్కి వెళితే బాగుండదు భయపడి వెళ్లారని అంటారన్నారు. అప్పుడు మిగతా వాళ్లలా కాకుండా ప్రధానమంత్రి మీద ఆరోపణలు వస్తే చాలా జాగ్రత్తలు పెట్టాను. కానీ ఏమైంది? మన ప్రస్తుత ప్రధానమంత్రి గారికి ఇది చాలా చికాకు. గుజరాత్‌లో కూడా ఆయన లోకాయుక్తను ఏర్పాటు చేయలేదు. చాలా ఏళ్ల తర్వాత సుప్రీంకోర్టు, హైకోర్టు గొడవ చేస్తే మళ్లీ రంగు, రుచి వాసన లేని లోకాయుక్తను ఏర్పాటు చేశారు. ఒక ఆత్మగౌరవం ఉన్న ప్రధానమంత్రి, వీటికి తలొగ్గని వాడు ప్రజలు ఇంత మద్దతు ఇచ్చి గౌరవిస్తే ఎంపికైన వాడు ఏంటి ప్రశ్నించేది అనే భావన సరైందా, కాదా . అనేది పక్కన పెడితే, గొప్ప అవకాశాన్ని జారవిడుచుకున్నాం. ముందుచూపు , ఈ దేశ ప్రజల్ని ఎలా కాపాడాలనే ఒడుపు అర్థం కాక, ఎక్కడ పట్టు ఉండాలో.. ఎక్కడ విడుపు ఉండాలో తెలియక అంత ఉద్యమం కూడా నిరర్థకం అయిపోయింది. చివరికి ఆప్‌కు ఢిల్లీలో అధికారం రావడానికి ఉపయోగపడింది తప్ప ఈ దేశంలో మార్పుకు నాంది పలకలేదు. అందుకే ఉద్యమాలు చేసే వాళ్లు ఎప్పుడు కూడా హడావుడి చేయడం, ఉద్రేక పడడం, ఆవేశ పడడం, నినాదాలు ఇవ్వడం, రాస్తారోకోలు చేయడం, తిట్టిపోయడం కాకుండా కొంచెం దీర్ఘకాలిక దృక్పథం ఉండాలి. రాజకీయంలో పట్టు విడుపు ఉండాలి. రాజకీయాల్ని గౌరవించాలి. రాజకీయాన్ని ద్వేషిస్తూ వారంతా దుర్మార్గులుగా చిత్రించి మనం అంతా మంచివాళ్లగా అనుకుని ఇదేదో మంచికి చెడుకు పోరాటం అనుకుంటే ప్రజాస్వామ్యం బతకదు. రాజకీయం సమాజానికి అవసరం. విభిన్న వర్గాల ప్రయోజనాలను సమన్వయం చేయాలి. అగ్రకులాలు, అణిచివేసిన వర్గాలు ,హిందూలు, ముస్లింలు, ఉత్తరాది, దక్షిణాది, గ్రామాలు, పట్టణాలు, డబ్బున్న వాళ్లు, డబ్బు లేని వాళ్లు, ఆడ, మగ అందర్నీ సమన్వయం చేయాలి. కరవమంటే కప్పకు..విడవమంటే పాముకు కోపం. తప్పు చేసిన వాడిని విమర్శిస్తూనే ఆ ప్రక్రియ పట్ల మనకు గౌరవం, విశ్వాసం రెండూ ఉండాలి. మన దేశంలో మధ్య తరగతి వర్గాలకు ప్రజాస్వామ్య ప్రక్రియ మీద ఈసడింపు వచ్చింది. అలా ఉండకూడదు. ప్రజాస్వామ్య దేశంలో కచ్చితంగా అపసవ్యం ఉంటుంది. అమెరికా లాంటి దేశంలోనే ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు ఇప్పుడు కూడా దేశాన్ని అల్లకల్లోలం చేస్తున్నాడు . ఆ దేశంతో పోలిస్తే మన సంపద ఏంటి? మన అవగాహన ఏంటి? మన చదువు ఏంటి? మన బీదరికం ఏంటి? కాబట్టి ప్రజాస్వామ్యం కొంత అస్తవ్యస్థంగా ఉంటుంది. దాన్ని కాలక్రమేణా మంచి మార్గాన మళ్లించే ఏర్పాటు చూడకుండా రాజకీయ పోరాటంగా మార్చేశాం. మొదటి రోజుల్లో అలా లేదు. 1950, 60వ దశకాల్లో స్థానిక ప్రభుత్వాలు వచ్చాయి. నాయకత్వం కొంచెం ముందు చూపుతో వ్యవహరించింది. 70ల నుంచే నాశనం అయింది. గత 30 ఏళ్లుగా దేశం కొన్ని రంగా ల్లో చాలా బాగుపడింది. ఉదాహరణకు ఫెడరలిజం మరింత బలపడింది. అధికారాలు పెరిగాయి. ఆర్థికంగా కొంచెం బాగుపడుతున్నాం. టెక్నాలజీ వస్తోంది. కానీ కేంద్రీకరణ వల్ల రాజకీయంగా నాశనం అవుతున్నాం. అంతా నాశనం అయిందనే భావన కాకుండా దీన్ని ఎలా బాగు చేయాలనే తపన, పరిపాలనా యంత్రాంగంలో మార్పులు చేయాలి.

**ప్రశ్న: ఉన్నతమైన సర్వీసులో ఉన్న వ్యక్తులు రాజ్యాంగానికి బద్ధులుగా కాకుండా రాజకీయానికి బద్ధులుగా మారిపోతున్నారు. ఇలా ఎందుకు జరుగుతుంది. దీనికి పరిష్కార మార్గాలు ఏమైనా ఉన్నాయా?**

**జేపీ:** దేశ విభజన తర్వాత కొంత గందరగోళం వచ్చింది.. రెండు పొరబాట్లు ఆనాడు అనివార్యంగా వచ్చాయి. మొట్టమొదటిది..కేంద్రీకరించిన ప్రజాస్వామ్యం. జాతీయ స్థాయి నుంచి రాష్ట్రాలకు అధికారాలు వెళ్లడానికి 40 ఏళ్లు పట్టింది. 90వ దశకంలో ప్రారంభమై 20-30 ఏళ్లలో ఓ మార్గానికి వచ్చింది. స్థానిక ప్రభుత్వాలు ఇప్పటికీ ఏర్పడలేదు. రెండోది..జవహర్‌లాల్ నెహ్రూ అంతరంగం ఏంటంటే సివిల్ సర్వీసెస్‌ను ఆధునిక భారత దేశ నిర్మాణానికి అనుగుణంగా మార్చుకోవాలని, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆనాడు ఉన్న పరిస్థితుల్లో వీళ్లకి ప్రత్యేకంగా రక్షణ ఇద్దాం, శాశ్వతంగా ఉద్యోగ భద్రత ఇద్దాం, వాళ్లకున్న ప్రత్యేక ప్రతిపత్తిని కాపాడదామని తంటాలు పడ్డారు. అధికరణ 311 ప్రకారం దేశంలో ఉన్న అందరు ఉద్యోగులకు దాన్ని విస్తరించారు. దాదాపు తీసేయడం కష్టం అన్న పరిస్థితి తీసుకు వచ్చారు.

కాలక్రమేణా ఏమైంది.. ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీగా ఉండొచ్చు. నిజాయితీ వేరు, ప్రజలకు సేవలు అందించడం వేరు. ఈ రెండింటికి చాలా తేడా ఉంది. ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని బేఖాతరు చేసి ఈ అధికార యంత్రాంగమే వలస పాలన అవశేషం కాబట్టి చాలా గొప్పదిగా భావించే తత్వం, అలవి మించిన హంగులు, అధికారం, ఆర్భాటం ఇవ్వడం. దానికి గ్లామర్ ఉండడం అదొక పక్కన. స్థానిక ప్రభుత్వాలు పూర్తిగా లేకుండా ఉండి స్థానికంగా ప్రభుత్వానికి ఒకే ఒక్క వ్యక్తి జిల్లా కలెక్టర్ అధికారిగా ఉండడం మరోపక్కన, మూడోది లైసెన్స్ పర్మిట్ రాజ్యాన్ని పెట్టడం. ప్రజలకు ఆర్థిక స్వేచ్ఛ లేకుండా, పోటీ లేకుండా చేయడం. పది బస్తాల సిమెంట్ కావాలంటే ఆర్డీవో ఆఫీసుకు వెళ్లి సంతకం పెట్టించుకోవాలి. పది కేజీల పంచదారకు పర్మిట్ కావాలి. ప్రజలకు సేవలు కాకుండా నియంత్రించే అధికారం, ప్రజలకు కొరతలు సృష్టించే అధికారాన్ని ఇచ్చాం. దాన్నుంచి అవినీతి డబ్బులు సంపాదించే అధికారం, పోనీ అవినీతికి పాల్పడకపోయినా కూడా దగ్గరకు పోయి నమస్కారం పెట్టకపోతే పని జరగదనే పద్ధతి. ఆయనకు గులాములు అయ్యే పద్ధతి..దాంతో ఏమైంది. ఏ వ్యవస్థ అయినా కూడా విశృంఖలమైన అధికారం, ఏ ప్రజలకు సేవ చేయాలో వాళ్లు మీ మీద ఆధారపడే పరిస్థితి కల్పించడం. ఆర్థికంగా రేపొద్దున కోటీశ్వరుడు అయ్యే అవకాశాన్ని నిర్ధారించడం. ఆ రోజుల్లో సిటీ బస్సుల లైసెన్స్ ఎవరికి ఇస్తే వాళ్లు కోటీశ్వరులు. ఇవ్వకపోతే వారికి వ్యాపారంలో అవకాశం లేదు. 1989లో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా ఉండగా దరఖాస్తులన్నీ పరిశీలించి అర్హత ఉన్న వాళ్లందరికీ సిటీ బస్సు లైసెన్స్‌లు ఇచ్చేశాను. అలా కాదు మాకు ఒక్కళ్లకే లైసెన్స్ ఇవ్వాలని లైసెన్స్‌లు పొందిన అందరూ నా మీద హైకోర్టుకు వెళ్లారు. లైసెన్స్ కోసం కాదు గుత్తాధిపత్యం కోసం. మొట్టమొదటిసారి నేను గుత్తాధిపత్యాన్ని తొలగించాను. అప్పుడు హైకోర్టు నా చర్యను సమర్థించి ఒప్పుకుంది. అప్పటి నుంచి దేశంలో అది సాంప్రదాయం అయింది. చేస్తున్న పనితో సంబంధం లేకుండా సమయబద్ధంగా పదోన్నతులు వస్తాయి, పదవులు వస్తాయి. వీరికి తప్ప అర్హులు ఉన్నా వారికి పదవులు రావు. కుల వ్యవస్థలో ఎలా అయితే పుట్టిన కులం భవిష్యత్తును శాసిస్తుందో అలా ఐఏఎస్‌లో చేరారు కాబట్టి వారికే భవిష్యత్తు. మిగతా వాళ్లు ఎంత గొప్పోళ్లయినా సరే వారికి లేదు. నాకు ఈ ఉద్యోగాల పట్ల అగౌరవం కాదు. నేను దానిలో పనిచేసిన వాడ్ని, నేను గౌరవంగా పనిచేశాను. ఈ సమాజానికి తెలుసు ఏం చేశానో.. చేయలేదో అనేది. కాబట్టి నేను కోపంతో చెప్పడం లేదు..కసితో చెప్పడం లేదు. అసూయతో చెప్పడం లేదు..కానీ ప్రజాస్వామ్య సమాజంలో ప్రజలకు సేవ చేసేటటువంటి ఏర్పాటు చేశామా? ప్రజల నెత్తిన ఎక్కి తొక్కే ఏర్పాటు చేశామా? కొందరు వ్యక్తుల గొప్పతనాన్ని వ్యవస్థ గొప్పతనంగా ఆపాదించొద్దు. ఎప్పుడైతే కొందరి గుత్తాధిపత్యాన్ని కొందరికే ఇచ్చామో. ఎప్పుడతై అన్ని రకాల ఉద్యోగాలకు వీళ్లనే అర్హులుగా చేశామో.. మీకు డిఫెన్స్ సెక్రటరీ కావాలంటే ఈ అధికారే. విద్యాశాఖ కార్యదర్శి కావాలంటే ఈ అధికారే, ఆర్థిక శాఖ అధికారి కావాలంటే ఈ అధికారే. ఎక్సైజ్ శాఖ కమిషనర్ కావాలంటే ఈ అధికారే. ఒక్కరే ఇవన్నీ చేయగలరా? సాధ్యమా? నాకు బ్యాంకింగ్ అంటే ఏమీ తెలియకుండా సహకార బ్యాంకులకు ఎండీగా నన్ను నియమించారు. అదృష్టం కొద్దీ బ్యాంకులు బతికి బయటపడ్డాయి. కానీ ప్రభుత్వాల నిర్ణయం వల్ల కాదు.




నైపుణ్యం లేకపోయినా కూడా కీలక పదవులన్నీ వీళ్లకే కట్టబెట్టడం. ఐఏఎస్ కోసం చదవడం తప్ప ఆ తర్వాత పుస్తకం చదవనని ఒట్టుపెట్టుకున్న వాళ్లు చాలా మంది ఉన్నారు. ఏం చేస్తున్నామో, ఎందుకు చేస్తున్నామో తెలియకుండా ఫైళ్ల మీద గుడ్డిగా సంతకాలు పెట్టే వాళ్లు చాలా మంది ఉన్నారు. విధానాల పట్ల అవగాహన లేని వాళ్లు చాలా మంది ఉన్నారు. ప్రపంచం ఎంత వేగంగా మారుతోంది. దానికి అనుగుణంగా మనం ఏం చేయాలనే ఆలోచనా శక్తి ఉన్న వాళ్లు ఇవాళ కొద్ది మందే ఉన్నారు..కాబట్టి ఏ వ్యవస్థ అయినా గుత్తాధిపత్యం నుంచి వాళ్ల సామర్థ్యంతో నిమిత్తం లేకుండా, సర్వీసుతో సంబంధం లేకుండా ప్రమోషన్లు ఇచ్చి, నైపుణ్యంతో నిమిత్తం లేకుండా అన్ని పదవుల్లోనూ వాళ్లనే నియమిస్తే కాలక్రమేణా పరిపాలన క్షీణిస్తుంది. మనదేశంలో అదే జరిగింది. ఈ దేశంలో అఖిల భారత సర్వీసులు అత్యద్భుతమైనవి. దేశంలో విపరీతమైన పోటీ ఉంది. లక్షల మంది పోటీపడతారు. ఇప్పటికి కూడా సమాజంలో

మణిపూసలు లాంటి వాళ్లు వస్తున్నారు. కానీ చేరాక వాళ్ల నుంచి మంచి సేవలు పొందే ఏర్పాట్లు చేయకుండా అందర్నీ ఒక గాటన కట్టేసి వాళ్లందరూ ప్రజలకు గుదిబండ అయ్యేలా చేస్తున్నాం.

**ప్రశ్న: ఐఏఎస్, ఐపీఎస్‌లు పదవీ విరమణ తర్వాత మూడు లేదా ఐదేళ్ల వరకు ప్రభుత్వ సలహాదారు వంటి పదవులు చేపట్టరాదని పార్లమెంటులో గతంలో ప్రైవేటు బిల్లు పెట్టారు. అయితే ఈ మధ్య కాలంలో రిటైర్ అయిన వారు మళ్లీ ఏదో పదవిలో చేరిపోతున్నారు. దీనిపై మీ స్పందన.**

**జేపీ:** సామర్థ్యాన్ని బట్టి, ప్రజలకు అందించే సేవలను బట్టి ప్రమాణాలను బట్టి గౌరవాన్ని గుర్తించడం లేదు. పేరుకేమో బ్రిటిష్ సంప్రదాయాన్ని తీసుకున్నాం. జరుగుతుందేమో అమెరికన్ సంప్రదాయం. అధికారంలోకి వస్తే వారి మందీమార్బలన్ని తెచ్చుకుంటారు. ఈయన పోగానే ఇంకొకరు వచ్చి మళ్లీ అందర్నీ దింపేస్తుంటారు. ఇంకొకర్ని తీసుకొస్తుంటారు. ఎన్టీరామారావు గారికి నేను చెప్పాను.. ముఖ్యమంత్రి మారగానే అధికారులందర్నీ ఇలా బదిలీ చేయడం సరైంది కాదు. ఉన్నవాళ్లలో మంచివాళ్లు కొద్దిమందే ఉన్నారు. విచక్షణతో ఎవరు బాగా చేస్తున్నారు. ఎవరు చేయడం లేదో పరిశీలించి ఏ కారణం లేకపోతే అనవసరంగా బదిలీ చేయొద్దంటే ఆయన ఒప్పుకున్నారు. ఉన్న కొద్దిమంది




మంచివాళ్లను బదిలీ చేసి అడుగులకు మడుగులు ఒత్తే వాళ్లను నియమించుకోవడం వల్ల చివరకు పరిపాలన కుంటుపడుతోంది. ఫ్యూడల్ ప్రభువులుగా చెలామణీ అవుతున్నారు. ప్రజలకు మేలు జరగడం లేదు. దీంతో రాజకీయంగా నష్టపోయేది కూడా వీళ్లే. కొందరు నిజంగా సమర్థులు ఉన్నారు..వాళ్ల సేవలు ఉపయోగించుకోవడం అవసరం. దీనికి శాస్త్రీయమైన ప్రామాణికమైన పద్ధతులు ఉండాలి. రెండోది బహుశా కొన్ని వృత్తి నైపుణ్యాల విషయంలో రిటైర్మెంట్ వయస్సు కూడా పెంచాలి. గతంలో ఇంజినీరింగ్ శాఖలో పనిచేసిన వాళ్లలో గొప్ప వాళ్లు ఉన్నారు..పరిజ్ఞానం సంపాదించారు..సమాజం మీద ప్రేమ ఉంది. వాళ్లను ఉపయోగించుకోవడం అవసరం తప్పులేదు. కానీ అలాంటి వాళ్లను ప్రతిభ ఆధారంగా కొనసాగిస్తున్నారన్న దాఖలాలు అన్ని సందర్భాల్లో లేవు. ముఖ్యమంత్రి ఈ రోజు పార్టీలకతీతంగా ఒక నిరంకుశ పాలకుడు. మంత్రులు కూడా నూటికి 95 శాతం అలంకారప్రాయం. మంత్రులకు అధికారాలు దాదాపుగా లేవు. సొంత జిల్లాలో కొంతమంది మంత్రులకు వారి మాట నెగ్గుతోంది. మరికొంతమందికి అదీ లేదు. ఎమ్మెల్యేకు నియోజకవర్గంలో మాట నెగ్గుతుంది. అంతే తప్ప . ఆశాఖ మొత్తం మీద మంత్రిగారికి పట్టుంది..నిర్ణయాలు క్యాబినెట్ పద్ధతిలో ప్రజాస్వామ్యంలో వెస్ట్‌మినిస్టర్స్ మోడల్‌లో ఆయన నిర్ణయం తీసుకుంటాడు..అనేది లేదు. నేను నాశాఖ మంత్రిగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్ణయాలు చేయగలుగుతున్నానని చెప్పమనండి..దేశం మొత్తం మీద ఎవరూ లేరు. ఇద్దరే మిగిలారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి మూడోది బ్యూరోక్రాట్.

**ప్రశ్న: సమాచార హక్కు చట్టం అమలు కూడా సరిగా లేదు. నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోంది? దీనికి పరిష్కారం ఏంటి?**


**జేపీ:** పాలకులకు ఏ ప్రభుత్వ యంత్రాంగం కూడా ప్రజలకు జవాబుదారీగా ఉండడం ఇష్టం లేదు. వాళ్లకు జవాబుదారీగా ఉండాలి. పెత్తనం చేస్తున్న పెద్దమనిషికి జవాబుదారీగా ఉండాలి కానీ ప్రజలకు కాదు. పాలనా సమాచార హక్కు చట్టాన్ని అరుణారాయ్, నేను ఎంత లోతుగా శోధించామో, ఎన్ని చర్చలు జరిపామో, ఎన్ని విషయాల్లో సమన్వయం సాధించామో ఇవాళ చెప్పలేను. ఇన్ఫర్మేషన్ కమిషన్ జాతీయ స్థాయిలో కొంతమేర ప్రమాణాలు పాటిస్తున్నారు... చట్టం కూడా అమలవుతుంది. చాలా రాష్ట్రాల్లో చాలా సిగ్గు చేటుగా ఉంది. పదవుల కోసం పోటీ తప్ప ఆ పదవులకు న్యాయం చేసిన సందర్భాలు ఎన్ని ఉన్నాయి? సరైనోళ్లను పెడదామనే రాజకీయ సంకల్పం లేదు. రాజ్యాంగానికి, చట్టానికి కట్టుబడి ఉన్నాను..ఆ పనులు చేద్దామనే ఆ స్పృహకానీ, హుందాతనం కానీ లేకుండా వ్యవహరిస్తున్నారు. పౌర సమాజానికి నిరంతరం చైతన్యం లేకుండా చట్టాలు మంచివి వచ్చినా ఫలితాలు రావని అర్థం అవుతుంది. కానీ పౌర సమాజం రోజూ అదే పనిచేస్తుందా? ఇప్పటికీ కొంతమంది వ్యక్తులు, సంస్థలు దీని అమలు కోసం తంటాలు పడుతున్నారు. అయితే మీకు జీతాలు ఇచ్చి, హోదా ఇచ్చి అన్నీ ఇచ్చాక మీరు పనిచేయాలని రోజూ తిరుగుతుంటే ప్రభుత్వం ఉంది ఎందుకు? ఇది కేవలం రాజకీయం తప్పు కాదు. అక్కడ నియామకం అయిన వారు కూడా అలానే ప్రవర్తిస్తున్నారు. ప్రభుత్వంలోని అధికారులు అసలు కమిషన్ అక్కర్లేదనే భావనలో ఉన్నారు. ఈ ప్రజలకు జవాబుదారీగా ఉందామన్న భావన ఈ దేశంలో లేదు. చట్టాలు చేసినా కూడా మరింత లోతైనవి, బలమైనవి చేయాలి. లేకపోతే కాగితం మీద ఉన్నా కూడా వాస్తవంలో చాలా కష్టం అవుతుంది.

గత సంచిక తరువాయి

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జూలై 2021** (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

**(పట్టిక 5.7: ద్వితీయ స్థాయి వైద్యం ఖర్చు అంచనాలు)**

కాబట్టి, ప్రస్తుతం జాతీయ స్థాయి ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాలు అనుసరిస్తున్న ఉమ్మడి నష్ట ప్రమాద భర్తీ పద్ధతిని మెరుగుపరిచి, అత్యంత ఖరీదైన తృతీయ స్థాయి వైద్యాన్ని మినహాయించి, ద్వితీయ స్థాయి వైద్యాన్ని మొత్తం పౌరులందరికీ విస్తరించవచ్చు. ఓపక్క ప్రభుత్వ రంగంలోని బోధనాస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, సేవల్ని క్రమపద్ధతి, నిర్దిష్ట కాలవ్యవధితో కూడిన కార్యాచరణతో గణనీయంగా మెరుగుపరుస్తూనే, ఏక చెల్లింపుదారు (సింగిల్-పేయర్), పోటీ ఆధారిత పి.పి.పి నమూనా ద్వితీయ స్థాయి వైద్యాన్ని సాధించాలి. అప్పుడు ద్వితీయ స్థాయి అవసరాలు సి.హెచ్.సిలు, చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంలలోని పి.పి.పి నమూనాలో పూర్తిస్థాయిలో తీరతాయి. అత్యున్నత నాణ్యత గల మూడో దశ చికిత్స అవసరాల్ని ప్రభుత్వ తృతీయ స్థాయి ఆస్పత్రులు ఖజానాపై పెద్ద భారం లేకుండానే తీరుస్తాయి. సంపన్న, వేతన వర్గాలు ప్రయివేటు వైద్య సేవలు ఎంచుకునే అవకాశం ఉంది కాబట్టి, ప్రయివేటు రంగానికి సమస్య ఉండదు. అటువంటి నమూనా మంచి నాణ్యత గల ఆస్పత్రి సేవలను పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనకరంగా, ప్రభుత్వ ఖజానాకు మరీ ఎక్కువ ఖర్చు కాకుండా అందిస్తుంది. అంతిమంగా, వినియోగదారునికి ప్రశ్నించే అధికారాన్ని ఇచ్చేందుకు, జవాబుదారీతనానికి, ఆస్పత్రిలో కొనసాగటాన్ని తగ్గించేందుకు, వ్యయ నియంత్రణ సంస్కృతిని పెంచేందుకు.. చిన్నపాటి సహ చెల్లింపుని ఆస్పత్రి సేవకు ప్రవేశపెట్టవచ్చు. ప్రస్తుతమున్న ఉచిత కార్యక్రమం నుండి వెనక్కిమళ్లటం రాజకీయంగా సవాలు కావచ్చు కానీ, ఒక్కసారి వ్యవస్థ రోగులకు నాణ్యమైన సేవలను అందిస్తూ మొత్తంగా దేశంలో ఆరోగ్యం, ఉత్పాదకత మెరుగైతే, అటువంటి స్వల్ప సహ చెల్లింపుల వ్యవస్థను ప్రవేశపెట్టవచ్చు. అయితే, మొత్తం చికిత్స పొందినవారి సంఖ్యలో 10 శాతం వరకు నిరుపేద రోగులందరినీ మాత్రం సహ చెల్లింపుల నుండి మినహాయించాలి. డబ్బు లేకపోవటం వల్ల ఏ రోగికీ వైద్యాన్ని నిరాకరించకూడదన్నదే సూత్రం కావాలి.

## అధ్యాయం 6
## తృతీయ స్థాయి చికిత్స

కాలిన గాయాలు, గుండెజబ్బులు, కార్డియోథొరాసిక్ శస్త్ర చికిత్సలు, బహుళ ట్రౌమా, కీళ్ల సర్జరీలు, బహుళ-వ్యవస్థ జబ్బులు, క్యాన్సర్ చికిత్స, న్యూరో సర్జరీ వగైరా మరింత పైస్థాయి వైద్య చర్యల కోసం ప్రాథమిక, ద్వితీయ స్థాయి వైద్యుల నుండి సిఫార్సు (రెఫరల్)తో రోగులకు చేసే ప్రత్యేకీకరించిన చికిత్స తృతీయ స్థాయి వైద్యం. మూడో దశ సేవలను తృతీయ దశ ఆస్పత్రుల్లో, ప్రభుత్వ (జిల్లా, ప్రభుత్వ బోధన) ఆస్పత్రుల్లో, అత్యున్నత మల్టీ-స్పెషాలిటీ సంస్థల్లోనూ, ప్రయివేటు లేదా కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ పొందవచ్చు.

తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో చికిత్సలు మరింత ఆధునికమైనవి. స్పెషలైజ్డ్ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అధునాతన రోగ నిర్ధారణ ఆధారిత సేవలు, అత్యాధునిక శస్త్రచికిత్సా ప్రక్రియలు, సంక్లిష్ట ఆపరేషన్లు, చికిత్సలు ఇందులో ఉంటాయి.

ఆధునిక తృతీయ స్థాయి వైద్యం ఎంతో ఖరీదైనది. ఆధునిక, అత్యంత అధునాతన మల్టీ-స్పెషాలిటీ ఆస్పత్రికి మూడు రకాలైన అత్యంత వ్యయభరిత అవసరాలు ఉంటాయి – మంచి నాణ్యత గల భౌతిక మౌలిక వసతులు (భూముల ధరలు ఆకాశాన్నంటే నగరాలలో ఎక్కువగా), డయాగ్నొస్టిక్‌లు, చికిత్సల కోసం అత్యంత ఖరీదైన అత్యాధునిక పరికరాలు (ఎంఆర్ఐ, పి.ఇ.టి స్కాన్, స్టెరియోటాక్టిక్ రేడియో థెరపీ, ఎండోస్కోపీ, మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ మొదలైనవి), అత్యున్నత నైపుణ్యాలు, శిక్షణ కలిగి తమ నిపుణత, పరిజ్ఞానానికి తగ్గ న్యాయమైన చెల్లింపులకు అర్హులైన ఫిజీషియన్లు, నర్సులు, టెక్నీషియన్లు. ఈ అవసరాల రీత్యా, అత్యంత అనుకూల పరిస్థితుల్లో కూడా తృతీయ స్థాయి వైద్యం ఖర్చు అనూహ్యంగా పెరుగుతుంటుంది.

అనారోగ్య భారంలో ఎక్కువ భాగం నివారణ, ప్రాథమిక ఆరోగ్య వైఫల్యం పర్యవసానమే. కాబట్టి, నివారణ, ప్రాథమిక ఆరోగ్య సేవలను మెరుగుపరచకుండా, మనం ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచలేం. అయితే, నివారణ, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ విశ్వసనీయత.. ఆస్పత్రి చేరిక అవసరమైనవారికి అందుబాటులో ఉండే ఆస్పత్రి సేవల నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు, నివారణ వైద్యం ఎంత బాగా ఉన్నప్పటికీ, కొంతమంది అనారోగ్యం బారిన పడుతుంటారు, అనారోగ్యం కుటుంబ ఆర్థిక స్థితిని సంక్షోభంలోకి నెడుతుంది, వ్యక్తుల ఉత్పాదకతను దెబ్బతీస్తుంది, ఆర్థిక వృద్ధిని ఆటంకపరుస్తుంది. కాబట్టి, ఖర్చుకు తగ్గ ఆరోగ్య ఫలితాలు లేకుండా తృతీయ దశ చికిత్సలో విపరీత వ్యయం పెరిగే పెద్ద ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ.. ప్రజలకు అందుబాటులో ఉండేలా, ప్రభుత్వానికి ఖర్చుకు తగ్గ ఫలితం ఉండేలా అందరికీ నాణ్యమైన తృతీయ స్థాయి వైద్యాన్ని అందించటం తప్పనిసరి.

**6.1. ప్రయివేటు తృతీయ స్థాయి చికిత్స వ్యయం**

భారత్‌లో ప్రయివేటు తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో ఒక ఆపరేషనల్ పడకకి ఏడాదికి అయ్యే సగటు ఖర్చును పట్టిక 6.1 తెలియ చేస్తుంది. అది కోటి రూపాయల దాకా ఉంటుంది. ఒక్కో పడకకు సుమారు కోటి రూపాయల పెట్టుబడి వ్యయం, ఒక్కో పడకకు ఏడాదికి రూ. కోటి రూపాయల బిల్లు వసూలు చేయాల్సిన అవసరమున్న ప్రయివేటు తృతీయ స్థాయి వైద్యం అత్యధిక శాతం భారతీయులకు తలకు మించిన భారం. వనరుల కొరత ఉన్న ఒక పేద దేశంలో ఆ ప్రయివేటు సేవలకు ప్రభుత్వమే ఖర్చు భరించే కార్యక్రమాన్ని అమలు చేస్తే, సేవల్లో ఖర్చుకు తగ్గ ఫలితాలు రావు. ప్రయివేటు రంగం ఒక్కసారి తృతీయ దశ వైద్య సదుపాయాలలో భారీగా పెట్టుబడులు పెడితే, సేవలు, పరికరాలు, సిబ్బందికి పెద్దఎత్తున నిర్వహణ వ్యయాన్ని భరిస్తుంటే.. భారీ బిల్లింగ్, ఆదాయం ఉంటేనే ఆ పెట్టుబడి చొరవ మనగలుగుతుంది. దీంతో, ఆర్థిక ప్రోత్సాహకం తీరు మారిపోతుంది. అవసరాన్ని మించిన అధునాతనమైన డయాగ్నొస్టిక్‌లు, ఖర్చు ఎక్కువ ఫలితం తక్కువ చికిత్సలకవైపు వ్యవస్థని అనివార్యంగా మళ్లిస్తుంది. ప్రభుత్వ రంగంలో నిధుల కొరత, అరకొర ఆస్పత్రి సేవలు.. పెట్టుబడి భారం మోస్తున్న, ఖరీదైన ప్రయివేటు తృతీయ స్థాయి ఆస్పత్రులను ప్రజలు ఆశ్రయించేలా చేస్తున్నాయి. పోటీ, జవాబుదారీతనం, సమర్థవంతమైన నియంత్రణ, పటిష్ఠ వ్యవస్థలు లేకపోవటంతో, ప్రయివేటు రంగ తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో మితిమీరిన పరీక్షలు, మితిమీరిన చికిత్స, మితిమీరిన బిల్లులు చోటుచేసుకుంటున్నాయన్న తీవ్ర ఆరోపణలున్నాయి. వృత్తిపరమైన, నైతికమైన అన్ని ప్రమాణాలనూ ఆస్పత్రి పాటించినప్పటికీ, అత్యంత ఖరీదైన సాంకేతికత, పరికరాలు, ఆస్పత్రి ఏర్పాటుకయ్యే భారీ పెట్టుబడి వ్యయం వల్ల ప్రయివేటు నేపథ్యంలో తృతీయ స్థాయి చికిత్స వ్యయం అనివార్యంగా ఎక్కువ అవుతుంది. తృతీయ దశ వైద్య సేవల్లో ఫలితాలు వాటి స్వభావ రీత్యానే రోగులకు అన్ని వేళలా సంతృప్తికరంగా ఉండవు. ఫలితంగా, ఆర్థికంగా, భావోద్వేగపరంగా కుటుంబాలు ఛిన్నాభిన్నమైపోతూ, ప్రజలకు, వైద్య వృత్తికి మధ్య అపనమ్మకం పెరుగుతోంది.

తృతీయ స్థాయి వైద్యంలో ప్రభుత్వ ఆరోగ్య బీమా పద్ధతి కేవలం ఆ ఖర్చుల్ని ప్రభుత్వ ఖజానాకు బదిలీ చేస్తుంది (ఖర్చుకు తగ్గ నాణ్యతను ఆరోగ్య వ్యవస్థలో పెంచకుండా). ఆరోగ్యంలో మన ప్రభుత్వ వ్యయం ప్రస్తుతం జి.డి.పిలో కేవలం ఒక శాతానికి (1%) కాస్త ఎగువన ఉంది. ఎంత సంకల్పంతో ప్రయత్నించినా, ఆ వ్యయం సమీప భవిష్యత్తులో జి.డి.పిలో 2.5 నుండి 3% దాటి పెరగకపోవచ్చు. అమెరికా ఆరోగ్యంపై జి.డి.పిలో దాదాపు 18 శాతం ఖర్చు చేస్తుండగా, జి.డి.పిలో 9 శాతం ప్రభుత్వ వ్యయం. అంతస్థాయి అసాధారణ వ్యయం చేస్తున్నా.. ప్రయివేటు రంగం, ఇన్సూరెన్స్ ఆధారితమైన ఆరోగ్య వ్యవస్థలో ఆరోగ్య కవరేజీ లేక అక్కడ కోట్లాదిమంది నలిగిపోతున్నారు. కాబట్టి ఆరోగ్య ఇన్సూరెన్స్ – అది ప్రయివేటు ఇన్సూరెన్స్ కావచ్చు లేదా ప్రభుత్వం నిధులు సమకూర్చే ఏక చెల్లింపుదారు ఇన్సూరెన్స్ కావచ్చు – భారత్‌లో అందుబాటు వ్యయంలో తృతీయ స్థాయి వైద్యాన్ని అందించటంలో నానాటికీ పెరిగే సవాళ్లను పరిష్కరించలేదు.

**(పట్టిక 6.1: భారత్‌లో అధీకృత జాబితాలోని ప్రయివేటు తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో ఒక్కో ఆపరేషనల్ పడకకి సగటు ఖర్చు (అన్ని మొత్తాలూ కోట్లలో, 2019 ఆర్థిక సంవత్సరానికి))**

(ఇంకా ఉంది...)




**ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు @**

# youtube.com/JP Loksatta

**స్వతంత్ర భారతం 75 - లోక్‌సత్తా 25 కలిసి వచ్చిన అపురూప సందర్భంలో భవిష్యత్ భారత కార్యాచరణపై ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌తో..**

1) **సామాజిక, రాజకీయ విశ్లేషకురాలు, యువ జర్నో స్వాతి ఇంటర్వ్యూ :**
   ఎన్నికల్లో ముక్కుమూసుకుని ఓట్లు వేయటం, ఎవర్ని గెలిపించినా ఏమున్నది గర్వకారణం అని నిట్టూర్చటం, మార్పు కోసం ఏదైనా చేయగల సత్తా ఉన్న యువత రోజువారీ జీవితంలోనే అలసిపోతుండటం.. ఏమిటి చేయటం?.. ఇంకా పలు ప్రశ్నలు.
2) **లైఫ్‌లో ఇంతవరకూ ఎవరినీ ఇంటర్వ్యూ చేయని సామాజిక, పాలనా అంశాల ఉద్యమకారులు, ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి ఎక్స్‌క్లూజివ్ :**
   రాజకీయాల్లోకి వస్తే చెప్పుతో కొట్టండి.. అన్న వారిని అధికారంలోకి తేవటం తప్ప లోక్‌పాల్ ఉద్యమం సాధించింది ఏమిటి? దేశంలో అవినీతి ఎందుకు అంతం కావటం లేదు?.. & మోర్.
3) **సామాజిక, రాజకీయ ఉద్యమకారులు, మీడియా విశ్లేషకులు కటారి శ్రీనివాసరావు ఇంటర్వ్యూ:**
   మోదీ, కేసీఆర్, జగన్‌ల బాకాలే తప్ప ఉద్యమకారులు, పౌర సమాజం గొంతు ఈవేళ బలంగా ఎందుకు వినిపించటం లేదు? ఏవి ఉచితాలు, ఏవి అనుచితాలు.. సంక్షేమం అంటే ఏమిటి?.. ఇంకా అనేక అంశాలు (రెండు భాగాలు).
4) **విద్యావేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర ఎక్స్‌క్లూజివ్:**
   ట్యాక్స్ ఎగ్గొడితే అది నల్లడబ్బు. మరి సరిగా సేవలు అందించని ప్రభుత్వాలకు పన్ను సరిగా కట్టనక్కర్లేదనుకునే పౌరులు కూడా బ్లాక్‌మనీగాళ్లే అవుతారా? ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు ఎలా ఉండాలి?.. & మోర్ (రెండు భాగాలు).
5) **పబ్లిక్ పాలసీ యువ రీసెర్చర్ సుమేధ ఇంటర్వ్యూ (ఇందులో జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీవీ లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు):**
   మోదీ ఈడీని ప్రయోగిస్తున్నాడని ఆరోపిస్తున్నారు గానీ.. ఒక్క పార్టీ కూడా చట్టబద్ధపాలనని సంస్కరించాలని ఎందుకు డిమాండ్ చేయటం లేదు? డ్రగ్స్‌ని నిషేధించినా ఎందుకు అదుపు చేయలేకపోతున్నారు?.. ఇంకా పలు ప్రశ్నలు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th November, 2022 Posting Date 15 &16th of every month

# ‘ఆరోగ్య భారతం’



## మన విధాన ప్రాధాన్యతల్లో మొట్టమొదటిది కావాలి



అరకొర ప్రాథమిక ఆరోగ్య సేవలు, బలహీన మౌలిక వసతులు, ప్రాథమిక సేవలకు-ఆస్పత్రి సేవలకు మధ్య సంధానం కొరవడటం, చికిత్స కోసం సొంతంగా జేబుల్లో నుంచి చేస్తున్న ఖర్చు (ఓ.ఓ.పి.ఇ) అనేకమంది ప్రజల్ని పేదలుగా మార్చటం, అధ్వాన్న ఆరోగ్య ఫలితాలు.. ఒక దేశంగా మనల్ని బలహీనపరుస్తున్నాయి. ప్రజల విశ్వాసాన్ని చూరగొనటంలో మన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ దారుణంగా విఫలమైంది. ప్రజలు ఎక్కువగా ప్రయివేటు వైద్యుల్ని ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఎక్కువమందికి ప్రాథమిక వైద్యమంటే.. ఎటువంటి శిక్షణా లేకుండా డాక్టర్ పేరు తగిలించుకుని అనధికారికంగా వైద్యం చేసే వారి వద్దకు వెళ్లటం. దీనివల్ల ఒకోసారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. సరైన ప్రాథమిక వైద్య సదుపాయం లేకపోవటం వల్ల.. పలు జబ్బుల్ని నివారించటం, ముందే గుర్తించటం జరగటం లేదు. దీంతో నివారించదగ్గ ప్రమాదకరస్థాయికి జబ్బు పెరిగాక.. జిల్లా, బోధనాస్పత్రులకు జనం పరుగులు పెడుతున్నారు. అక్కడ అప్పటికే కిక్కిరిసిన రోగుల మధ్య వైద్యం కోసం దయనీయంగా పడిగాపులు కాస్తున్నారు. సొంతంగా చేసే ఖర్చు ఎక్కువగా ఉండటంతో.. కేవలం అనారోగ్యం వల్ల ఏటా 5.5 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి జారిపోతున్నారు. ఇవన్నీ వైద్య వృత్తి పట్లే ప్రజలు విశ్వాసం కోల్పోయేలా చేస్తున్నాయి. అనారోగ్యం, అకాల మరణాల వల్ల కోట్లాది మంది ఆర్థికంగా, సామాజికంగా అవకాశాల్ని కోల్పోతున్నారు. ఆరోగ్యంపై మన ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చు అతి తక్కువగా ఉండటానికితోడు, అరొకర ఆరోగ్య సంరక్షణ వల్ల దేశంలోని అత్యధిక శాతం ప్రజానీకంపై పడుతున్న తీవ్ర ప్రతికూల ప్రభావం దృష్ట్యా.. ఆరోగ్య సేవలను మెరుగుపరచటం మన ప్రాధాన్యతల్లో మొట్టమొదటిది కావాలి. ఒక అభివృద్ధి చెందుతున్న దేశంగా, మన వనరులు పరిమితమైనవి. నిధుల పరంగా ప్రభుత్వాలకు పరిమితులున్నాయి. కాబట్టి, అందుబాటు వ్యయంలో మన ఆరోగ్య వ్యవస్థని విస్తృత స్థాయిలో మెరుగుపరచటానికి ఒక ఆచరణసాధ్యమైన రోడ్‌మ్యాప్ మనకు అవసరం. ఆరోగ్య రంగంలో భారతదేశ, ప్రపంచ అనుభవాలను రంగరించి, ఒక దేశంగా మనకున్న సానుకూలతల్ని సద్వినియోగపరుస్తూ తక్కువ ఖర్చుతో రూపొందించిన ఆచరణసాధ్య పరిష్కారమే ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా సమగ్ర ఆరోగ్య విధానం.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC “X” Roads, Hyderabad 500 020